
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 269

బుధవారం 20-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




స్టార్క్‌కు 24.75 కోట్లు...
కమిన్స్‌కు 20.50 కోట్లు

ఐపీఎల్‌-2024 వేలంలో ఆస్ట్రేలియా స్టార్‌ ప్లేయర్లు మిచెల్‌ స్టార్క్‌, ప్యాట్‌ కమిన్స్‌ కొత్త రికార్డులు నమోదు చేశారు. దుబాయ్‌లో మంగళవారం జరిగిన వేలంలో కోల్‌కతా జట్టు రూ. 24 కోట్ల 75 లక్షలకు స్టార్క్‌ను... సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ జట్టు రూ. 20 కోట్ల 50 లక్షలకు కమిన్స్‌ను కొనుగోలు చేశాయి.

- వివరాలు 12లో



చైనాలో భూకంపం

చైనాలోని గన్సు రాష్ట్రంలో భూకంపం ధాటికి చాలా ఇళ్లు నేలమట్టమై 127 మందికిపైగా ప్రజలు మృతిచెందారు.

వివరాలు 6లో ▸



ఇండియా కూటమిలో లుకలుకలు

విపక్షాల తరఫున తెరపైకి వచ్చిన 'దళిత ప్రధాని' కార్డు ఇండియా కూటమిలో లుకలుకలను మళ్లీ తెరపైకి తెచ్చింది.

వివరాలు 6లో ▸



విపక్షాలు మళ్లీ అక్కడే...

వచ్చే ఎన్నికల్లో విపక్షాలు గతంకంటే తక్కువ సీట్లకు పరిమితం అవుతాయని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు.

వివరాలు 6లో ▸



ఐరన్‌ డోమ్‌పై హెజ్‌బొల్లా దాడి

శత్రు దేశాల క్షిపణులను కూల్చేసే ఇజ్రాయెల్‌ 'ఐరన్‌ డోమ్‌' రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామని హెజ్‌బొల్లా సంస్థ ప్రకటించింది.

వివరాలు 6లో ▸

సభలో లెక్కాపత్రాలు

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయనున్న ప్రభుత్వం

- ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సభ
- తొలుత మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం
- అనంతరం స్వల్పకాలిక చర్చలో భాగంగా రాష్ట్రం అప్పులు, నీటిపారుదల, విద్యుత్‌ శాఖల పరిస్థితిపై వివరణ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి ప్రసంగించే అవకాశం
- తమ వాదన వినిపించేందుకు కూడా అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు హరీశ్‌ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం మూడు రోజుల క్రితం వాయిదా పడిన రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి భేటీ కానుంది. సమావేశం ప్రారంభమైన వెంటనే మాజీ ఎమ్మెల్యేలు రామన్నగారి శ్రీనివాస్‌రెడ్డి (రామాయంపేట), కొప్పుల హరీశ్వర్‌రెడ్డి (పరిగి), కుంజ సత్యవతి (భద్రాచలం) మృతి పట్ల సభ సంతాపం ప్రకటించనుంది. ఆ తర్వాత స్వల్పకాలిక చర్చ కింద రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణకు ఉన్న అప్పులు, ఆ తర్వాత పదేళ్లలో చేసిన అప్పులు, పదేళ్ల బడ్జెట్‌ అంచనాలు, వాస్తవ రాబడులు, ఖర్చు గురించి సాగునీరు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌, మున్సిపల్‌ తదితర శాఖల పరిస్థితినీ వివరించనుంది. సంవత్సరాల వారీగా అప్పుల డేటాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు నీటి పారుదల రంగం గురించిన వివరణలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు, నీటి వినియోగం తదితరాలను శాసనసభలో వెల్లడించనున్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించి ప్రధానంగా విద్యుత్‌ సంస్థల అప్పులు, నష్టాలు, వ్యవసాయానికి విద్యుత్‌ సరఫరా, కొత్త విద్యుత్‌ ప్రాజెక్టులపై చేసిన వ్యయం తదితరాలను వివరించనున్నారు. ఆర్థిక, విద్యుత్‌, నీటి పారుదల శాఖలకు సంబంధించి డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి కూడా ప్రసంగించే అవకాశముందని సమాచారం. స్వల్పకాలిక చర్చ

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రం అప్ప రూ. 6,85,765 కోట్లు

- నేడు అసెంబ్లీలో సర్కారు వివరణ
- బడ్జెట్‌ అంచనాలకు, ఖర్చుకు మధ్య 20 శాతానికి పైగా తేడా.. శ్వేతపత్రంలో భాగంగా వెల్లడించనున్న ప్రభుత్వం

2లో

నీళ్లు, కరెంట్‌పైనా శ్వేతపత్రం!

- గురువారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులపై గురి
- చేసిన ఖర్చు, అందిన నీళ్లు, మిగిలిన ఆయకట్టు పరిస్థితిపై సమగ్ర సమాచారం
- మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యాలపై ప్రత్యేక ఫోకస్‌
- విద్యుత్‌ సంస్థల అప్పులు, నష్టాలు, అందుకు కారణాలపై విశ్లేషణలు
- సీఎం ఆదేశాలతో వివరాలు సిద్ధం చేసిన రెండు శాఖలు

2లో

పార్లమెంటు వెలుపల నిరసనలో భాగంగా జగదీప్‌ ధన్‌ఖడ్‌ను తృణమూల్‌ ఎంపీ కల్యాణ్‌ బెనర్జీ అనుకరిస్తుండగా వీడియో తీస్తున్న రాహుల్‌గాంధీ.. నవ్వుతున్న సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు



మంటలు రేపిన.. మాక్‌ పార్లమెంట్‌!

సస్పెన్షన్లపై పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన

- రాజ్యసభ చైర్మన్‌ను వ్యంగ్యంగా అనుకరించిన ఎంపీ కల్యాణ్‌ బెనర్జీ
- వీడియో తీసిన రాహుల్‌గాంధీ
- మానసిక క్షోభకు గురయ్యా: ధన్‌ఖడ్‌
- నా కులాన్ని, నేపథ్యాన్ని కించపరిచారు
- అత్యంత సిగ్గుచేటంటూ మండిపాటు

6లో

లోక్‌సభ నుంచి మరో 49 మంది సస్పెన్షన్‌




అంజనీకుమార్‌


సీవీ ఆనంద్‌


డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు

- ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్‌
- రోడ్డు భద్రత అథారిటీ చైర్మన్‌గా అంజనీకుమార్‌
- హోంగార్డ్స్‌ ఐజీగా స్టీఫెన్‌ రవీంద్ర
- పలువురు సీనియర్‌ ఐపీఎస్‌ల బదిలీ, పోస్టింగులు

- వివరాలు 2లో

న్యూస్‌రీల్‌

ఒక్కరోజులో నాలుగు కరోనా కేసులు



కరోనా మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలో మంగళవారం ఒక్కరోజే నాలుగు కరోనా పాజిటివ్‌ కేసులు నమోదయ్యాయి. 402 మందికి కోవిడ్‌ పరీక్షలు చేయగా నలుగురికి వైరస్‌ వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్‌ శ్రీనివాసరావు కోవిడ్‌ బులిటెన్‌ విడుదల చేశారు.

- వివరాలు 15లో ▶

'గాంధీ'లో కోవిడ్‌ కేసులేమీ నమోదు కాలేదు

సూపరింటెండెంట్‌ రాజారావు వెల్లడి

- వివరాలు 7లో ▶

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సీఎంకున్న అభ్యంతరాలేమిటి?



'కాళేశ్వరం' అవినీతిపై సీఎం రేవంత్‌ రెడ్డి సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌ రావు సూటిగా ప్రశ్నించారు. అందుకు సీఎంకి ఉన్న అభ్యంతరాలేమిటని నిలదీశారు.

- వివరాలు 14లో ▶

విద్యార్థుల ప్రతిభతోనే దేశ గౌరవం ఇనుమడిస్తుంది

- భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా పట్టుదలతో సాగాలి
- ప్రకృతి, పర్యావరణంపైనా అవగాహన అవసరం
- హెచ్‌పీఎస్‌ శతాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- వివరాలు 15లో ▶





ఎంపీలూ.. అందుబాటులో ఉండండి: కేసీఆర్‌

లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేయాలని భావిస్తున్న బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌... పార్టీ ఎంపీలను అందుబాటులో ఉండాల్సిందిగా ఆదేశించారు. తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్‌... పార్టీ ఎంపీలతో విడివిడిగా భేటీ కావాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు ఢిల్లీలో ఉన్న పలువురు బీఆర్‌ఎస్‌ ఎంపీలు హైదరాబాద్‌కు తిరుగుముఖం పడుతున్నారు.

-వివరాలు 14లో



క్లుప్తంగా...

‘ప్రత్యేక మిర్చి బోర్డు’ ఏర్పాటు ప్రతిపాదన లేదు

లోక్‌సభలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా



సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతానికి ప్రత్యేక మిర్చి బోర్డు ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా స్పష్టం చేశారు. 2021–22 పంట సీజన్‌లో మిరప పంటకు పట్టిన తెగులు కారణంగా జాతీయ స్థాయిలో మిర్చి ఉత్పత్తి 2021–22 నాటికి 18.36 లక్షల టన్నులకు తగ్గిందన్నారు. (2020–21లో ఉత్పత్తి 20.49 లక్షల టన్నులు) ఈ తెగులు ప్రభావం ఏపీలో ఎక్కువగా ఉందని.. దీని కారణంగా ఏపీలో మిర్చి పంట ఉత్పత్తి 7.97 లక్షల టన్నుల నుంచి 2021–22లో 4.18 లక్షల టన్నులకు పడిపోయిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి సగటు వార్షిక ఉత్పాదకత హెక్టారుకు 4 నుంచి 5 టన్నులు కాగా, 2021–22లో హెక్టారుకు 1.86 టన్నులకు పడిపోయిందన్నారు. కాగా, 2019–22 మధ్య నాలుగేళ్ల కాలంలో ఏపీలో 27.86 లక్షల టన్నులు, తెలంగాణలో 21.31 లక్షల టన్నుల మిర్చి పంట ఉత్పత్తి అయ్యిందని ముండా తెలిపారు. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

రేపు కలెక్టర్ల సదస్సు

ఆరు గ్యారంటీలపై ప్రధాన చర్చ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా జిల్లా కలెక్టర్ల సదస్సును గురువారం సాయంత్రం నాలుగు గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహించే ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారంటీల లబ్ధిదారులు ఎంతమంది ఉంటారు.. వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను సీఎం రేవంత్‌రెడ్డి వారికి వివరించనున్నట్లు సమాచారం. కాగా, అధికారికంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఎజెండా మంగళవారం రాత్రి వరకు కలెక్టర్లకు వెళ్లలేదని సమాచారం. మౌఖికంగా ఆదేశాలు వెళ్లినట్లు చెబుతున్నారు. సదస్సు అనంతరం కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విందు ఇవ్వనున్నారు.

7 శాతం వద్దు.. 12 శాతం ముద్దు

మాదిగల రిజర్వేషన్‌పై పిడమర్తి రవి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ ప్రకారం 7 శాతం కాకుండా తెలంగాణలోని మాదిగలకు జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మైస ఉపేందర్ అధ్యక్షతన జరిగిన మహాధర్నాకు పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగలకు ఇచ్చిన మాట తప్పకుండా ప్రధాని మోదీ ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు.

23న ‘సేవ్ డేస్’కు రండి

డిప్యూటీ సీఎం భట్టికి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: రవీంద్రభారతిలో ఈనెల 23న నిర్వహించనున్న ‘సేవ్ డేస్’ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆహ్వానించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వంశీరెడ్డి, ప్రతినిధులు మల్లిపెద్ది నవీన్, కవితారెడ్డి, సురేశ్‌రెడ్డి, గణేశ్, జ్యోతిరెడ్డి, మనోజ్‌రెడ్డి, దుర్గాప్రసాద్, మనోహర్ తదితరులు భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 10 నుంచి 23 వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల ను వారు వివరించారు. వరంగల్‌లో 38 సంస్థల సహకారంతో జాబ్‌మేళా నిర్వహించగా 16,000 మంది హాజరయ్యారని, వారిలో 1,500 మంది నిరుద్యోగులను ఎంపిక చేశామని వివరించారు. 2024 మే 24 నుంచి 26 వరకు అమెరికాలోని వాషింగ్టన్‌లో నిర్వహించనున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం మహాసభలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సభలో లెక్కాపత్రాలు

▶ మొదటి పేజీ తరువాయి

అనంతరం గురువారం సభ కొనసాగేదీ లేనిదీ బుధవారమే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మా వాదనకు అవకాశం ఇవ్వాలి: హరీశ్‌రావు

శాసనసభలో ఆర్థిక, సాగునీరు, విద్యుత్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశమున్నందున ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదన వినిపించేందుకు కూడా అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్‌కు లేఖ అందజేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు తమకు అనుమతి ఇవ్వాలని హరీశ్ విజ్ఞప్తి చేశారు. ఇలావుండగా ప్రభుత్వం లేవనెత్తే అంశాలకు దీటుగా సమాధానం ఇచ్చేందుకు హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రెండు రోజుల పాటు ముమ్మర కసరత్తు చేశారు.

రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా.. నూతన తెలంగాణ భవన్

భవన్ అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఉమ్మడి ఆస్తుల విభజన అంశాలపై ఆరా
- రాజకీయ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చలు
- నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులు, జేఏసీ, కుల సంఘాల నేతలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయం



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా దేశ రాజధానిలో నూతన తెలంగాణ భవన్ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఢిల్లీలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై అధికారులతో జరిపిన సమీక్ష సందర్భంగా కొత్త భవన్ నిర్మాణం చేపట్టేందుకు ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పార్టీ పెద్దలను కలిసేందుకు మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి తన నివాసంలో ఉమ్మడి ఆస్తుల విభజన అంశాలపై తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, భవన్ ఓఎస్డీ సంజయ్ జాజులతో సమీక్ష నిర్వహించారు. భవన్ మొత్తం విస్తీర్ణం, అందులో ఉన్న భవనాలు, వాటి ప్రస్తుత పరిస్థితి, తెలంగాణ వాటా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీలో ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని, ఇందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు వివరించారు. ఇందులో పునర్విభజన చట్టం ప్రకారం 42:58 నిష్పత్తిలో తెలంగాణకు 8.245 ఎకరాలు, ఏపీకి 11.536 ఎకరాలు వస్తుందని చెప్పారు. ప్రస్తుత భవనాలు, సిబ్బంది నివాస గృహాల స్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రస్తుత భవనాలన్నీ మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించినవని, చాలావరకు శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేయిస్తున్నామని గౌరవ్ ఉప్పల్ వివరించారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నూతన భవనం నిర్మించుకుందామని చెప్పారు. ఇదే సమయంలో ఆస్తుల విభజన ప్రక్రియను వేగిరం చేసే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఆస్తుల విభజనపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

రాజకీయ ప్రముఖులకు రేవంత్ విందు

ఢిల్లీలోని రాజకీయ ప్రముఖులు, గతంలో తనతో కలిసి పనిచేసిన ఎంపీలకు రేవంత్‌రెడ్డి విందు ఇచ్చారు. తుగ్లక్‌రోడ్డులోని ముఖ్యమంత్రి అధికార నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు ఎంపీలు శశిథరూర్, మాణిక్యం ఠాగూర్, సుదీప్ బందోపాధ్యాయ, దీపేందర్ హుడా, సుప్రియా సూలే, కార్తి చిదంబరం, మాగుంట శ్రీనివాసరెడ్డి, డీకే సురేశ్, రఘురామ కృష్ణరాజు, సీఎం రమేశ్, నిరంజన్‌రెడ్డితోపాటు మరి కొందరు హాజరైనట్లు తెలిసింది.

పదవుల భర్తీపై కేసీతో భేటీ

రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పార్టీ అధిష్టాన పెద్దలతో చర్చించేందుకు ఢిల్లీ వచ్చిన రేవంత్‌రెడ్డి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీ, వచ్చే పార్లమెంట్ ఎన్నికలు, రాజకీయ వ్యవహారాల కమిటీలో చేసిన తీర్మానాలు, ఆరు గ్యారంటీల అమలు, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, మద్దతుగా నిలిచిన జేఏసీ, కుల సంఘాల నేతలు, తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కేసీ సూచించినట్లు తెలిసింది. మంత్రి పదవుల భర్తీపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, ప్రియాంకతో చర్చించిన అనంతరమే ఓ నిర్ణయానికి రావాలని తీర్మానించినట్లు సమాచారం.

డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు

- ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్
- రోడ్డు భద్రత అథారిటీ చైర్మన్‌గా అంజనీకుమార్
- హోంగార్డ్స్ ఐజీగా స్టీఫెన్ రవీంద్ర
- పలువురు సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ, పోస్టింగులు



స్టీఫెన్ రవీంద్ర



శిఖాగోయల్



బి.సుమతి



సౌమ్యామిశ్రా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ సంఖ్యలో సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవిగుప్తాను పూర్తిస్థాయి డీజీపీగా నియమించింది. ఆయనకు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ (హెచ్‌ఓపీఎఫ్)గా బాధ్యతలు అప్పగించింది. వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగులు ఇచ్చింది. డీజీపీగా పనిచేస్తూ ఎన్నికల సంఘం సస్పెన్షన్‌కు గురై వెయిటింగ్‌లో ఉన్న అంజనీకుమార్‌ను రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ చేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా కూడా ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. వెయిటింగ్‌లో ఉన్న మరో అధికారి సీవీ ఆనంద్‌ను ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. మొత్తం 20 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ, పోస్టింగులు ఇస్తూ సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారుల బదిలీలు, పోస్టింగుల వివరాలు..

అధికారి పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ అయిన స్థానం
రవిగుప్తా	ఇన్‌చార్జి డీజీపీ	పూర్తిస్థాయి డీజీపీ
అంజనీకుమార్	వెయిటింగ్	రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్
రాజీవ్ రతన్	పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ	విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ
సీవీ ఆనంద్	వెయిటింగ్	అవినీతి నిరోధక విభాగం డీజీ
అభిలాష బిస్త్	అదనపు డీజీ సంక్షేమం, క్రీడలు, హోంగార్డ్స్	పోలీస్ అకాడమీ డైరెక్టర్, ట్రైనింగ్ ఐజీ
సౌమ్యామిశ్రా	అడిషనల్ డీజీపీ పర్సొనెల్	జైళ్లశాఖ డీజీ
శిఖాగోయల్	అదనపు డీజీ మహిళా భద్రత	సీఐడీ అదనపు డీజీ, సైబర్ సెక్యూరిటీ, సాంకేతిక సర్వీసులు, ఎఫ్ఎస్ఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్
మహేశ్ ఎం భగవత్	అదనపు డీజీ సీఐడీ	రైల్వేస్, రోడ్డు సేఫ్టీ, ఆర్గనైజేషన్, లీగల్ అడిషనల్ డీజీ
అనిల్‌కుమార్	వెయిటింగ్	ఎస్‌పీఎఫ్ డీజీ
స్టీఫెన్ రవీంద్ర	వెయిటింగ్	హోంగార్డ్స్ ఐజీ, అదనంగా సంక్షేమం, క్రీడలు
తరుణ్‌జోషి	అదనపు సీపీ రాచకొండ	మల్టీజోన్-2 ఐజీ, అదనంగా మల్టీజోన్-1
వీబీ కమలాసన్‌రెడ్డి	డ్రగ్స్ కంట్రోల్ డీజీ	ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్
ఏఆర్ శ్రీనివాస్	పోలీస్ అకాడమీ అదనపు డీజీ	ఏసీబీ డైరెక్టర్
చంద్రశేఖర్‌రెడ్డి	మల్టీజోన్-1 ఐజీ	పర్సొనెల్ ఐజీ
ఎం రమేశ్	ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ ఐజీ	పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ
కె.రమేశ్‌నాయుడు	రాజన్న సిరిసిల్ల జోన్-3 డీఐజీ	సీఐడీ డీఐజీ
వి.సత్యనారాయణ	వెయిటింగ్	సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జాయింట్ సీపీ
బి.సుమతి	ఉమెన్ సేఫ్టీ ప్రొటెక్షన్ డీఐజీ	ఎస్ఐబీ డీఐజీ
ఎం.శ్రీనివాసులు	సిటీ ఆర్మ్‌డ్ జాయింట్ సీపీ	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్
శరత్‌చంద్ర పవార్	పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్	హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ

---

97 డిపోలకు గాను 96 లాభాల్లో..



- గత సోమవారం నాటి ఆదాయంపై లెక్కలేసిన ఆర్టీసీ
- సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలోని కోస్గి డిపో ఒక్కటే నష్టాల్లో
- ‘మహాలక్ష్మి’తో ఒక్కరోజులో ఆర్టీసీకి రూ.21.11 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ఒక్కసారిగా ప్రయాణికులు పెరగడంతో దశాబ్దం తర్వాత సంస్థ లాభాలను ఆర్జిస్తోంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో, వారి రూపంలో కోల్పోయే మొత్తాన్ని ప్రభుత్వం సంస్థకు రీయింబర్స్ చేస్తుందన్న ఉద్దేశంతో అధికారులు లెక్కలు ఖరారు చేశారు. గత సోమవారం (డిసెంబర్ 18) ఒక్కరోజే రూ.21.11 కోట్ల ఆదాయం నమోదైంది. ఈనెలలో ఇప్పటివరకు వచ్చిన ఆదాయం రూ.259 కోట్లకు చేరుకుంది. తెలంగాణ ఆర్టీసీ పరిధిలో 97 డిపోలుంటే, సోమవారం ఏకంగా 96 డిపోలు లాభాలు ఆర్జించాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలో ఉన్న కోస్గి డిపో ఒక్కటే రూ.2 వేలు నష్టం చవిచూసింది. ఇలా 96 డిపోలు లాభాల్లోకి రావటం టీఎస్ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డుగా నిలిచింది. డిసెంబరులో ఇప్పటివరకు 49 డిపోలు లాభాలు ఆర్జించాయి. దీంతో ఈనెల మొత్తానికి రూ.3.14 కోట్ల లాభం నమోదవుతుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇలా ఒక నెల మొత్తానికి లాభాలు నమోదవడం ఇదే తొలిసారి కానుండటం విశేషం. బస్సుల్లో సాధారణ రోజుల్లో కంటే సోమవారం రద్దీ అధికంగా ఉంటుంది. జీరో టికెట్ల జారీ మొదలైన తర్వాత తొలి సోమవారం (18వ తేదీ) 51.74 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించినట్టు తేలింది. సోమవారం 30.12 లక్షల జీరో టికెట్లు (మహిళలకు ఇచ్చేవి) జారీ అయ్యాయి.

కొత్త ఉత్సాహం

కొన్ని డిపోలు సోమవారం ఒక్కరోజే 14 లక్షలకు మించి లాభాలు ఆర్జించటం విశేషం. ఒక్కో డిపో రోజుకు ఐదారు లక్షల నష్టాలను చవిచూసే పరిస్థితికి అలవాటుపడ్డ ఆర్టీసీకి తాజా లెక్కలు ఉత్సాహాన్నిచ్చాయి. సోమవారం హనుమకొండ డిపో రూ.14.10 లక్షలు, దేవరకొండ డిపో రూ.13.94 లక్షలు, మహబూబ్‌నగర్ డిపో రూ. 13.61 లక్షలు, హైదరాబాద్-1 డిపో రూ. 13.55 లక్షలు.. ఇలా పలు డిపోలు భారీ లాభాలు నమోదు చేసుకున్నాయి. ఒక్క కోస్గి డిపో ఒక్కటే రూ.2 వేలు నష్టం పొందటంతో మొత్తం డిపోల జాబితాలో నష్టాలు పొందిన ఏకైక డిపోగా మిగిలింది.

450కు మించి టికెట్ల జారీ

సాధారణంగా జిల్లా సర్వీసుల్లో ఒక కండక్టర్ గరిష్టంగా 300 వరకు టికెట్లు జారీ చేస్తుంటారు. కానీ, ప్రస్తుతం వాటిల్లో 450కి మించి టికెట్లు జారీ చేయాల్సి వస్తోంది. మహిళలకు జీరో టికెట్ జారీ చేస్తున్నా.. వారు ఎక్కడి వరకు ప్రయాణిస్తారో తెలుసుకోవడం, వారు తెలంగాణ నివాసితులా కాదా అని ధ్రువపత్రాలు పరిశీలించడం లాంటి వాటి వల్ల టికెట్ల జారీలో ఆలస్యం జరుగుతోంది.

ముఖ్య కార్యదర్శిగా శేషాద్రికి పదోన్నతి



సాక్షి హైదరాబాద్: సీఎం ఎనుమల రేవంత్ రెడ్డి కార్యదర్శిగా ఉన్న వి.శేషాద్రికి ముఖ్య కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనతో పాటు ప్రస్తుతం ట్రాన్స్ కో, జెన్కో ఎండీగా ఉన్న అలీ ముర్తుజా రిజ్వీకి కూడా కార్యదర్శి నుంచి పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదోన్నతులు జనవరి ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి.

మరోసారి ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తాం

- ఐపీఎస్ అధికారి అంజనీకుమార్‌కు ప్రభుత్వం వార్నింగ్
- సస్పెన్షన్ ఎత్తివేత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

సాక్షి, హైదరాబాద్: మరోసారి నిబంధనలు అతిక్రమిస్తే తీవ్రంగా పరిగణిస్తామని సీనియర్ ఐపీఎస్ అధికారి అంజనీకుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఆల్ ఇండియా సర్వీస్ కండక్ట్ నిబంధనలను భవిష్యత్తులో మరెప్పుడూ అతిక్రమించవద్దని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందే టీపీసీసీ చీఫ్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అప్పుడు డీజీపీగా పనిచేసిన అంజనీకుమార్ మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు కలిసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు అంజనీకుమార్‌పై ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, తప్పు జరిగిందని బేషరతుగా తాను క్షమాపణ చెబుతున్నట్టు అంజనీకుమార్ ఎన్నికల సంఘానికి తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన సూచనల మేరకు అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడంతోపాటు, భవిష్యత్తులో మరోసారి ఇలాంటివి పునరావృతమైతే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఓ మెమోను జారీ చేశారు.

నీటిపారుదల అదనపు బాధ్యతలపై స్మితాసబర్వాల్ అయిష్టత!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగడం పట్ల ఐఏ ఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ప్రభుత్వం వద్ద అయిష్టత వ్యక్తం చేసినట్లు తెలిసింది. నీటిపారుదల శాఖపై నిర్వహిస్తున్న సమీక్షలకు ఆమె ఎందుకు రావడం లేదని ఇటీవల ఆ శాఖమంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించగా.. ఈ మేరకు అధికారులు వివరణ ఇచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కార్యదర్శిగా వ్యవహరించిన స్మితా సబర్వాల్ ప్రస్తుతం మిషన్ భగీరథ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రజత్‌కుమార్ పదవీ విరమణ చేసిన సమయంలో స్మితా సబర్వాల్‌కు నీటిపారుదల శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఆమె ఆ బాధ్యతలు స్వీకరించలేదు. నీటిపారుదల శాఖ కార్యదర్శిగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తే ఆ పోస్టులో కొనసాగుతానని స్మితా సబర్వాల్ పేర్కొన్నారని ఆశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫైళ్లపై సంతకాలు చేయడానికి కూడా ఆమె అయిష్టత వ్యక్తంచేయడంతో రెండు వారాలుగా ముఖ్యమైన ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయని వెల్లడించారు.

సాగునీటి, విద్యుత్ ప్రాజెక్టులపైనా గురి

శాసనసభలో వివరించనున్న ప్రభుత్వం

- మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యాలపై ప్రత్యేక నివేదిక?
- ‘ప్రాణహిత-చేవెళ్ల’పై సమగ్ర సమాచారం సిద్ధం!



సాక్షి, హైదరాబాద్: సాగునీరు, విద్యుత్ ప్రాజెక్టుల కోసం గత పదేళ్లలో చేసిన అప్పులు, వ్యయం, కల్పించిన ఆయకట్టు, నష్టాలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ మేరకు వివరాలు సిద్ధం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం, పాలనపరమైన అనుమతులు, ఇప్పటివరకు చేసిన ఖర్చు, ప్రతిపాదించిన ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టు, మిగిలిన ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు కావాల్సిన నిధులు, ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా తరలించిన జలాలు, ఇందుకు అయిన నిర్వహణ వ్యయం, ప్రాజెక్టు కోసం చేసిన మొత్తం అప్పులు వంటి అంశాలను పొందుపరిచారు. ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.81 వేల కోట్లకు పైగా ఖర్చు చేయగా, ఇప్పటివరకు ఎంత ఆయకట్టుకు సాగునీరు అందించారు? మిగిలిన ఆయకట్టుకు అందించడం సాధ్యమేనా? ఇందుకు ఎంత వ్యయం అవుతుంది? వంటి విషయాలతో సమాచారం తయారు చేసినట్లు చెబుతున్నారు. సీఎం సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై ప్రత్యేక నివేదికను సైతం సిద్ధం చేసినట్లు తెలిసింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనుల స్థితిగతులు, తెలంగాణ ఏర్పడడానికి ముందు చేసిన వ్యయం, తెలంగాణ వచ్చాక ఈ ప్రాజెక్టు విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై కూడా నివేదికను రూపొందించారని అంటున్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉమ్మడి మెదక్ జిల్లాకు సాగునీరు అందించే అంశంపై అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. తుమ్మిడిహెట్టికి బదులు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన వార్ధా బ్యారేజీ విషయంలో ముందుకు వెళ్తారా? అన్న దానిపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

క్రాప్ హాలిడే పైనా వివరణ

నాగార్జునసాగర్ జలాశయంలో నిల్వలు అడుగంటిపోవడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న 6.4 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటల సాగుకు విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించాలని ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కల్వకుర్తి, బీమా, పాలేరు, వైరా, మల్లూరు, లంకాసాగర్, గొల్లవాగు ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సైతం నీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు మొత్తం ఎన్ని టీఎంసీల వరద వచ్చింది? ఆశించిన మేరకు వరద రాకపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంది? ఎన్ని టీఎంసీలు సాగు, తాగునీటి అవసరాలకు వాడారు? తదితర అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ ఇవ్వనుందని తెలిసింది.

విద్యుత్ సంస్థల నష్టాలు, అప్పులే ప్రధానం

తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర విద్యుత్ సంస్థలు తీసుకున్న అప్పులు, నష్టాలు, ఇందుకు సంబంధించి గత ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలను విశ్లేషిస్తూ విద్యుత్ శాఖ అధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క సోమ, మంగళవారాల్లో విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీతో సమావేశమై విద్యుత్ శాఖకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. కాగా ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, కాళేశ్వరం, ఇతర ఎత్తిపోతల పథకాల నిర్వహణకు వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి రూ.28,140 కోట్ల కరెంట్ బిల్లులు బకాయి ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం. రూ.12,515 కోట్ల ట్రూఅప్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు అనుమతించకుండా తామే వచ్చే ఐదేళ్లలో విడతల వారీగా చెల్లించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (టీఎస్ఎన్పీడీసీఎల్/టీఎస్ఎస్పీడీసీఎల్) నష్టాలు రూ.50,275 కోట్లకు పెరిగినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వివరించనున్నట్టు తెలిసింది.

రాష్ట్రం అప్పు రూ.6,85,765 కోట్లు



నేడు అసెంబ్లీలో సర్కారు వివరణ

- బడ్జెట్ అంచనాలకు, ఖర్చుకు మధ్య 20 శాతానికి పైగా తేడా
- శ్వేతపత్రంలో భాగంగా వెల్లడించనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ‘పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసం–ఆర్థిక అరాచకం’పేరుతో విడుదల చేయనున్న శ్వేతపత్రంలో భాగంగా 1956–2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టిన ఖర్చులో తెలంగాణకు వచ్చిన వాటా, తద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాల కోసం చేసిన అప్పుల గురించి వివరించనున్నట్లు సమాచారం. అలాగే 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2023–24 బడ్జెట్ ప్రతిపాదనలతో కలిపి మొత్తం అంచనాలు, జరిగిన ఖర్చుతో పాటు అప్పుల గురించి శాసనసభకు తెలియజేయనున్నట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. గత పదేళ్లలో ప్రభుత్వం చేసిన బడ్జెట్ ప్రతిపాదనలకు, ఖర్చుకు పొంతన లేదని, రెండింటికీ మధ్య సుమారు 20 శాతం తేడా ఉందంటూ గణాంకాలు వెల్లడించనున్నట్లు తెలిపాయి. 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2023–24 వరకు మొత్తం రూ.14,87,834 కోట్లను ప్రతిపాదిస్తే, ఖర్చు చేసింది కేవలం రూ.12,24,877 కోట్లు మాత్రమేనని ప్రభుత్వం వివరించనుంది.

అప్పులు ఇలా..!

‘తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.75 వేల కోట్ల అప్పు ఉంటే గత పదేళ్లలో అది రూ.6,85,765 కోట్లకు చేరింది. అందులో ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితులకు లోబడి తెచ్చిన అప్పు రూ.3.89 లక్షల కోట్లయితే, వివిధ కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్, సంస్థలకు గ్యారంటీల ద్వారా ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్లకు పైగా సమకూర్చి ఖర్చు పెట్టింది. మరో రూ.1.09 లక్షల కోట్లను గ్యారంటీలిచ్చి కార్పొరేషన్ల ద్వారా ఖర్చు పెట్టింది. ఇక ప్రభుత్వ గ్యారంటీలు లేకుండా రూ.60 వేల కోట్ల మేర కార్పొరేషన్లే నేరుగా అప్పులు చేశాయి..’అని విశదీకరించనున్నారు. ‘రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రూ.12 లక్షల కోట్లకు పైగా కేవలం మిషన్ భగీరథ, సీతారామ, కాళేశ్వరంతో పాటు కొంతమేర పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టారు. ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల్లో కొంత వెచ్చించి మౌలిక సదుపాయాలు సమకూర్చారు. అయితే 1956 నుంచి 2014 వరకు అన్ని బడ్జెట్‌లు కలిపి తెలంగాణకు వచ్చిన వాటా కేవలం రూ.5 లక్షల కోట్లకు పైగా మాత్రమే. ఈ తక్కువ మొత్తంతోనే నాగార్జున సాగర్ నుంచి కృష్ణా, గోదావరి నదులపై అనేక ప్రాజెక్టులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు, వైద్యసంస్థలు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ లాంటి ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ఇతర సంక్షేమ పథకాలను గత ప్రభుత్వాలు అమలు చేశాయి..’ అని వెల్లడించనున్నట్టు తెలుస్తోంది.

పదేళ్లలో తెలంగాణ అప్పల వివరాలివి

అప్ప రకం	మొత్తం (రూ.కోట్లలో)
ఎఫ్ఆర్‌బీఎం పరిమితులకు లోబడి	3,89,673
గ్యారంటీలిచ్చి ప్రభుత్వమే నేరుగా ఖర్చు పెట్టింది	1,27,248
గ్యారంటీలిచ్చి కార్పొరేషన్ల ద్వారా వెచ్చించింది	1,09,335
కార్పొరేషన్లు, ఎస్‌పీవీలు తీసుకున్న నాన్‌గ్యారంటీ లోన్లు	59,509
మొత్తం	6,85,765

‘సలార్’ టికెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి

- ఈనెల 22 నుంచి 28 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.65, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 టికెట్ ధర పెంపు

సాక్షి, హైదరాబాద్: ప్రభాస్ కథానాయకుడిగా, దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కించిన చిత్రం ‘సలార్’కు టికెట్ ధరల పెంపునకు, బెనిఫిట్ షోలు వేసుకునేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మైత్రీ మూవీస్ నిర్మాణ సంస్థ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ‘సలార్’చిత్రం ప్రదర్శించే సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్ ధరపై రూ.65, మల్టీప్లెక్స్‌లో ఒక్కో టికెట్‌పై రూ.100 పెంపునకు ప్రభుత్వం అనుమతించింది. అయితే ఈ టికెట్ ధర పెంపు ఈనెల 22 నుంచి 28 వరకు మాత్రమే వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అదేవిధంగా 22న రాష్ట్రవ్యాప్తంగా అన్ని థియేటర్లలో ఉదయం 4 గంటలకు షో కు, ఆరోజు ఆరో షో వేసేందుకు అనుమతించారు. ఈనెల 22న తెల్లవారుజామున ఒంటిగంటకు ‘సలార్’చిత్రం బెనిఫిట్ షో వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 20 థియేటర్లకు అనుమతిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ప్రతి ఉదయం మనం కొత్తగా జన్మిస్తాం.
ఈ రోజు మనం ఏం చేస్తామనేదే అత్యంత ముఖ్యం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 20 డిసెంబర్ 2023

ఇదేమి ప్రజాస్వామ్యస్ఫూర్తి?!

ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంట్‌లో చరిత్రలో మునుపెన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో సస్పెన్షన్ల పర్వం సాగుతోంది. ఈ నెల 13న పార్లమెంట్‌లో జరిగిన భద్రతా వైఫల్య ఘటనపై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలనీ, చర్చ జరగాలనీ ప్రతిపక్షాలు పట్టుబట్టడం రచ్చగా మారింది. సభా వ్యవహారాలకు అడ్డుతగులుతున్నారనీ, అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారనీ అంటూ ఇప్పటికి 141 మంది ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయడం నిర్ఘాంత పరుస్తోంది. అధికార పార్టీ ఎంపీ సిఫార్సు పాసులతో సందర్శకులుగా వచ్చిన ఆగంతకుల రంగు పొగల హంగామాపై అధికారపక్షాన్ని ఇరుకున పెట్టాలని విపక్షం చూస్తుంటే, గత సంప్రదాయాలకు విరుద్ధంగా సభలో కాక బయట వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ళలో ప్రధాని, హోమ్ మంత్రి జరిగిన సంఘటనపై స్పందిస్తూ ప్రతిపక్షాల డిమాండ్‌ను పెడచెవిన పెట్టడం చర్చనీయాంశమైంది.

గత వారం 14 మంది, ఈ సోమవారం 78 మంది, తాజాగా మంగళవారం మరో 49 మంది... మొత్తం ఇప్పటికి 141 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటుపడింది. పార్లమెంట్‌లో సభా వ్యవహారాలకు అడ్డుపడిన సభ్యుల సస్పెన్షన్ కొత్తేమీ కాదు. ఇలా ఇంత సంఖ్యలో సస్పెన్షన్ల పర్వం సాగడం మాత్రం ఇదే తొలిసారి. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం ఎన్నడో 1989 మార్చిలో థక్కర్ ప్యానెల్ నివేదికపై రచ్చతో ఒకే రోజున లోక్‌సభలో 63 మంది సభ్యులను సస్పెండ్ చేసినట్టు చరిత్ర. ఇప్పుడు ఆ పాత రికార్డును చెరిపేస్తూ, దురదృష్టకరమైన కొత్త చరిత్ర లిఖితమైంది. సభాధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తికి సభ్యులను సస్పెండ్ చేసే అధికారమున్న మాట నిజమే. కానీ, ఆ స్థానంలో కూర్చొనే వ్యక్తి ప్రథమ కర్తవ్యం – అధికార, ప్రతిపక్షాల మధ్య సమతూకం పాటిస్తూ సభను సజావుగా నడపడమే తప్ప, సభ్యులపై పెత్తనం చూపడం కానే కాదు. ఆ సంగతి మర్చిపోయి సభలో వారందరికీ పెద్దన్నయ్యలా ప్రవర్తిస్తామంటేనే కష్టం. ప్రస్తుతం జరుగుతున్నదదే!

నిరుద్యోగం సహా వివిధ సమస్యలపై దృష్టి పడేటందుకే పార్లమెంట్‌లో గతవారం అలా అలజడి రేపామని పట్టుబడ్డ ఆగంతకుల కథనం. ఆ ఆందోళనకారుల ఆలోచనలు ఏమైనప్పటికీ, వారు పొగ గొట్టాలతో పార్లమెంటులోకొచ్చే వీలు కల్పించి, సభ్యుల ప్రాణాల్ని ప్రమాదంలోకి నెట్టిన భద్రతా లోపంపై తక్షణం చర్చ జరగాల్సి ఉంది. అత్యవసరంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. విపక్షాల వాదనా అదే. ఆ వాదనలో న్యాయం ఉంది. ఘటనపై సభలో రక్షణ మంత్రి లాంటి వారు కాక శాంతి భద్రతలు చూసే హోమ్ మంత్రి, సభానాయకుడు ప్రకటన చేయడం, సభ్యుల అనుమానాలను నివృత్తి చేయడం విధాయకం కూడా! కానీ అలా జరగట్లేదు. అక్కడే పీటముడి బిగిసింది. అనైతికత అంటూ ప్రతిపక్ష ఎంపీ మహువా మొయిత్రాపై చర్యలకు వేగిరపడ్డ పాలకులు, ఆగంతకులకు పాసులిచ్చిన స్వపక్షీయుడిపై చర్యకు ముందుకు రాకపోవడం ద్వంద్వ ప్రమాణాలంటూ విమర్శలకు తావిచ్చింది.

అయితే, సభను సజావుగా సాగనివ్వకుండా ప్రతిపక్షాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని అధికార పక్ష ఆరోపణ. అది పూర్తి సత్యదూరమనలేం. కానీ, దాన్ని సాకుగా చూపుతూ సభలో సాధారణ ప్రకటన చేయడానికి కూడా అమాత్యులకూ, ప్రభుత్వానికీ అభ్యంతరం ఉంటే అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనిపించుకోదు. సభావ్యవహారాలను అడ్డుకోవడం సైతం సభ్యుల హక్కులలో భాగమేనని బీజేపీ ఎంపీ స్వర్గీయ అరుణ్ జైట్లీయే ఒకప్పుడు వ్యాఖ్యానించడం గమనార్హం. కానీ, అధికార పీఠంపై కూర్చున్నాక బీజేపీ ఆ పాత వైఖరిని నమ్ముతున్నట్టు లేదు. చర్చలు, భిన్నాభిప్రాయాల కలబోతతో సాగాల్సిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పాలకుల ఏకపాత్రాభినయంగా మార్చాలని చూస్తున్నట్టుంది. ఎన్నికల సంఖ్యాబలపు నియంతృత్వంతో అధికారాన్ని హక్కుభుక్తంగా భావిస్తే అది గర్హనీయం. ప్రతిపక్షాలకున్న ప్రశ్నించే హక్కును కాదంటే, వాటి మాట వినాల్సిన పనే లేదనుకుంటే ఇక సభా సమావేశాలకు అర్థం ఏముంది!

నేటి ప్రధాని గతంలో గుజరాత్‌ను ఏలినప్పుడూ, నిరసన తెలిపే ప్రతిపక్షాలపై నిర్దాక్షిణ్య సస్పెన్షన్ల పర్వం ఇలాగే సాగిందని పండితులు లెక్కలు తీస్తున్నారు. ఒకప్పుడు కొన్ని రాష్ట్రాల్లోనే కనిపించే ఈ ధోరణి ఇప్పుడు పార్లమెంటుకు పాకడం విచారకరం. 2009–14 మధ్య దాదాపు 36 సస్పెన్షన్లు జరిగితే, ఎన్డీఏ ఏలుబడి వచ్చాక 2014–19లో అది 81కి ఎగబాకింది. ఇక, కేంద్రంలో వర్తమాన ప్రభుత్వ హయాంలో సస్పెన్షన్లు 149కి చేరాయి. ఇక, తాజా సస్పెన్షన్ల వల్ల ప్రస్తుత శీతకాల సమావేశాల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో మూడింట రెండొంతుల పైగా సభ్యులు సభ వెలుపలికే పరిమితమైన పరిస్థితి. కొన్నేళ్ళుగా అనేక కీలక బిల్లులు చర్చే లేకుండా, అవసరమైన సవరణల్ని పట్టించుకోకుండా సంఖ్యాబలంతో చట్టాలవుతున్న తీరు పార్లమెంటరీ విధానాన్నే ప్రశ్నిస్తున్నాయి.

ఇక, ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ వెలుపల మంగళవారం నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు ఓ ప్రతిపక్ష ఎంపీ ప్రవర్తించిన తీరు బాగా లేదు. రాజ్యసభ ఛైర్మన్‌ను అనుకరిస్తూ ఆ సభ్యుడు చేసిన ప్రహసనం సమర్థనీయం కాదు. ఇది 'డెమోక్రసీ' కాదు, 'నమోక్రసీ' అంటున్న ప్రతిపక్షాల పోరుకు శోభనిచ్చేదీ కాదు. వ్యక్తిగత ప్రవర్తనలో లోపాలు, పక్షపాత ధోరణులు ఎన్ని ఉన్నా... రాజ్యాంగ రీత్యా రాజ్యసభ ఛైర్మనైన భారత ఉపరాష్ట్రపతి హోదాకంటూ ఓ గౌరవం ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా అందరూ ఆ గౌరవం ఇవ్వాల్సి ఉంది. అది మరిచి అగౌరవంగా ప్రవర్తిస్తే ప్రతిపక్షాలకే నష్టం. పోరాటాన్ని అది పలుచన చేస్తుంది. అసలు సంగతి పక్కదోవ పడుతుంది. ఏమైనా, చర్చలంటే టీవీలో ప్రసంగాల స్థాయికి దించేస్తూ, ప్రజాసమస్యల్ని గాలికొదిలేసే సభలతో ప్రయోజనం శూన్యం. ప్రతిపక్షాలే లేని పాలన కావాలనుకుంటే దానికి ప్రజాస్వామ్యమని పేరెందుకు?

న్యాయమూర్తినీ వదలని వేధింపులు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

జిల్లా జడ్జి తనను లైంగికంగా వేధిస్తున్నాడనీ, అనుమతిస్తే గౌరవంగా చనిపోతాననీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం కలకలం రేపింది. అసలు దేశవ్యాప్తంగా మహిళలపైన నేరాలు పెరగడం చూస్తున్నాం. మహిళలపై అత్యాచారాలకు కారణం – వారి పట్ల భారత సమాజ దృక్పథమే. అయితే, ఒక మహిళా న్యాయమూర్తి లాంటి ప్రసిద్ధురాలినే వేధింపులు దుర్భర మానసిక స్థితి వైపు నెట్టాయంటే సామాన్య స్త్రీల పరిస్థితి ఏమిటి? విచిత్రమేమంటే, సరికొత్త ఉదారవాద ఆర్థిక యుగంలో తిరిగి పాత తరహా పురుషాధిక్య ధోరణులు ప్రబలిపోతున్నాయి. నేటి ఈ అవాంఛనీయ పరిస్థితులలో కావలసింది సమాజంలో స్త్రీ ప్రతిపత్తిని పెంచగల రాజకీయ విధానాలు, కార్యక్రమాలు!

"ఏ పౌరుడూ మరొక పౌరుణ్ణి కొన గలిగినంత ధనవంతుడుగా ఉండకూడదు. అలాగని ఏ పౌరుడూ తనను తాను అమ్ముకోవలసినంత పేదవాని గానూ ఉండకూడదు."

– రూసో మహాకవి, తాత్విక మేధావి

"తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నాడనీ, అనుమతిస్తే గౌరవంగా చనిపోతాననీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాయడం దేశంలో కలకలం రేపింది. ఈ వ్యవహారాన్ని దేశ ప్రధాన న్యాయమూర్తి సీరియస్‌గా తీసుకొని అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను విచారణకు ఆదేశించారు. "ఇక నాకు ఏమాత్రం జీవించాలని లేదు. నిర్జీవమైన ఈ శరీరాన్ని మోయడం నిష్ప్రయోజనం. నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకోవడానికి అనుమతించండి" అని మహిళా జడ్జి తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ సుప్రీం చీఫ్‌ను కదిలించి వేసిన ఫలితంగా తక్షణ చర్యలకు ఆదేశించారు."

– 16.12.2023 నాటి పత్రికా వార్తలు

ఇలాంటి 'వేధింపుల పర్వం' ఇంతకుముందూ జరిగిందని మరచిపోరాదు. నైతికంగా బలహీనుడైన ఒక మాజీ ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలోనే పనిచేస్తున్న ఒక స్త్రీ అధికారిని రకరకాల వేధింపులకు గురిచేసి, ఆమె లొంగకపోయే సరికి, ఆమెనూ, ఆమె కుటుంబ సభ్యులనూ ఎన్ని రకాల బాధలు పెట్టిందీ లోకం మరచిపోలేదు. అలాంటి నైతిక బలహీనతలు లేనందుననే ప్రస్తుత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ చంద్రచూడ్ ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తి పట్ల జరిగిన వేధింపుల కేసుపై తక్షణ విచారణకు ఆదేశించారు.

గవర్నర్ల తీరు

ఇదిలా ఉంచి, బీజేపీ–ఆరెస్సెస్ నాయకత్వ పాలన ఎలా ఉందో చూడండి: వారి విధానాలను అడ్డుకునే లేదా విమర్శించే రాష్ట్ర ప్రభుత్వాలను అదుపులో ఉంచగల తమ పార్టీ గవర్నర్లకు మాత్రమే రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడే అధికారాలు అప్పగించారు. ఇందుకు పక్కా ఉదాహరణలు – కేరళ, తమిళనాడు గవర్నర్లు తీసుకుంటున్న నిర్ణయాలు! రాజ్యాంగంలోని 200 అధికరణకు ఇచ్చిన తొలి వివరణ ప్రకారం, శాసనసభ చర్చలో ఉన్న బిల్లులను ఆమోదించడమో లేదా తిరస్కరించడమో శాసనసభ నిర్ణయం. అంతేగానీ ఆ హక్కు గవర్నర్‌కు లేదు. కానీ ఇప్పుడు బీజేపీ గవర్నర్లు తమ అసాధారణ అధికారాలు చెలాయిస్తూ శాసనసభ బిల్లులను తొక్కిపెడుతున్నారు. కానీ, బిల్లును ఆమోదించగల లేదా తిరస్కరించగల అధికారం ప్రజలు ఎన్నుకున్న శాసనసభకు లేకుండా చేసే పెత్తనం

రెండో మాట



గవర్నర్‌కు లేదు. ఒక వేళ ఏ కారణం చేతనైనా బిల్లును ఆమోదించ నిరాకరించే పక్షంలో 'తిరిగి పరిశీలించండి' అన్న విజ్ఞప్తితో శాసన సభకు నివేదించాలేగానీ, బిల్లులను తొక్కిపెట్టే అధికారం మాత్రం గవర్నర్‌కు లేదని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి కరాఖండీగా ప్రకటించాల్సి వచ్చింది. ఆ అధికారం ప్రజలు ఎన్నుకొనని గవర్నర్లకు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ప్రసిద్ధులకే ఇలా ఉంటే...

అంతేగాదు, పంజాబ్ శాసనసభ కేసులో సుప్రీంకోర్టు బిల్లులను తొక్కిపెట్టి ఉంచే అధికారం గవర్నర్లకు లేదని స్పష్టం చేయడంతో రాజ్యాంగంలోని 200 అధికరణకు ఆచరణలో విలువ పెరిగింది. ఇదే సూత్రం రాష్ట్రపతికీ వర్తిస్తుంది. లోక్ సభ మాజీ ప్రధాన కార్యదర్శి పి.డి.టి. ఆచారి చెప్పినట్టు, ఒక చట్టం రాజ్యాంగబద్ధత సరైనదా, కాదా అన్నది కోర్టు నిర్ణయించాల్సిందే గానీ, ఆ విషయంపై ఇటు రాష్ట్రపతికీ, అటు గవర్నర్లకూ ఎలాంటి నిర్ణయాధికారం లేదు. అయితేనేమి, పాలకులు రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నట్టు నటించడమేగానీ దాని విలువలను ఆచరణలో పాటించడంలో నడుపుకొనేవి 'సొంత దుకాణాలే'నని మరవరాదు.

ఈ పరిస్థితులలో ఒక్క మహిళా న్యాయమూర్తులపైననే కాదు, అసలు దేశ మహిళలపైననే నేరాల సంఖ్య పెరిగిపోవడం చూస్తున్నాం. 2022వ సంవత్సరానికి నేషనల్ క్రైమ్స్ బ్యూరో ప్రకటించిన వివరాలను బట్టి మహిళలపైన ఇంతకుముందు కంటే నేరాల సంఖ్య పెరిగిపోయింది. పైగా, పెక్కు రాష్ట్రాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పక్కన తమ మగ బంధువుల తోడు లేకుండా తాముగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసుకోలేని స్థితి. మహిళలపై నేరాల సంఖ్య 4 శాతంపైన పెరిగిందని క్రైమ్స్ బ్యూరో నివేదిక. ఇవిగాక భర్తలు, వారి బంధువులు చేసిన నేరాల సంఖ్య 2022లో 4.45 లక్షలు. అంటే, ప్రతి గంటకూ 51 కేసులు రికార్డయ్యాయి.

మరీ విచిత్రమేమంటే, 'సరికొత్త ఉదారవాద ఆర్థిక యుగంలో తిరిగి పాత తరహా పురుషాధిక్య ధోరణులు ప్రబలిపోతున్నా'యని జాతీయ మహిళా సంస్థ 'జాగోరి' డైరెక్టర్ జయశ్రీ వేలంకర్ వివరించారు. నేటి ఈ అవాంఛనీయ పరిస్థితులలో కావలసింది సమాజంలో స్త్రీ ప్రతిపత్తిని పెంచగల రాజకీయ విధానాలు, కార్యక్రమాలని ఆమె అన్నారు. మహిళల రక్షణకు ఉద్దేశించిన కఠిన చర్యలు కాగితం మీదనే ఉండి పోయాయిగానీ ఆచరణలో లేవనీ, దీన్ని బట్టి సంప్రదాయంగా స్త్రీలపై అత్యాచారాలు పెరుగుతూ ఉండటానికి అసలు కారణం – స్త్రీల పట్ల భారత సమాజ దృక్పథమేననీ సుప్రీంకోర్టు ప్రసిద్ధ మహిళా న్యాయ వాది శిల్పి జైన్ స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే, ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తి లాంటి ప్రసిద్ధురాలినే వేధింపులు దుర్భర మానసిక స్థితివైపు నెట్టాయంటే సామాన్య స్త్రీల విషయంలో గణింపనకు రాని, వచ్చినా పట్టించుకోని సమాజ స్థితిగతుల్ని అర్థం చేసుకోగలగాలి.

మాంస వ్యాపారం

నా మిత్రుడు, సుప్రసిద్ధ లాయర్ హనుమారెడ్డి మతాలు – చట్టాల గురించి ముచ్చటిస్తూ మరవరాని రెండు మంచి మాటలు చెప్పాడు: ''మతాలు రాజ్యమేలినప్పుడు చట్టం ఒక పద్ధతిగానూ, రాచరికం రాజ్యమేలినప్పుడు చట్టం మరొక పద్ధతిలోనూ, వ్యాపారం రాజ్యమేలినప్పుడు వేరొక పద్ధతిలోనూ ఉండి ప్రజలకు సంబంధించిన విధివిధానాలు మారుతూ వచ్చాయి. స్థూలంగా చెప్పాలంటే నేరాలు రెండు విధాలుగా ఉండాలి. ఒకటి రాజ్యాధికారం పట్ల నేరం, రెండవది ప్రజలపట్ల నేరం.''

అలాగే, 'ప్రేమ' అనే పేరిట ఎంత ప్రమాదకర పరిణామాలు, విధ్వంసం జరుగుతున్నాయో మందరపు హైమవతి తన 'నీలి గోరింట' కవితలో ఇలా చీల్చి చెండాడవలసి వచ్చింది:

**''తండ్రీ, కూతురు, గురువు, శిష్యురాలు
వావివరసల్లేకుండా
ఆడపిల్లలే అంగడి సరుకులైనప్పుడు
మానవ మాంస వ్యాపారంలో
మహిళల శరీరాలే పెట్టుబడి ఐనప్పుడు
రుష్యశృంగుడైనా మేనకను చూచిన
విశ్వామిత్రునిలా మారిపోడా?!''**

అలా మారిపోకూడదనే ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తికి జరిగిన సంఘటన నేపథ్యంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి పదేపదే చేస్తున్న విజ్ఞప్తుల పరంపర లక్ష్యం!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పని నిరసన



ఇటీవలి భద్రతా వైఫల్యం మీద చర్చ జరగాలంటూ ప్లకార్డు పట్టుకొని దాదాపు నా 15 ఏళ్ల పార్లమెంటరీ కెరియర్‌లో నేను కూడా మొదటిసారి పార్లమెంటు సభా మధ్యంలోకి ప్రవేశించాను. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం డిమాండ్ చేసినందుకు సస్పెండైన నా కాంగ్రెస్ సహచరులకు సంఘీభావంగా అలాచేశా.

– శశి థరూర్, లోక్‌సభ ఎంపీ

తగని అగౌరవం



ఛైర్‌పర్సన్, స్పీకర్ స్థానంలోకి వెళ్ళాక ఒక పార్టీకి చెందిన వారు కాదు. వాళ్లు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. వారి పట్ల వ్యంగ్యం చూపడం అగౌరవించడమే. ప్రభుత్వం నుంచి ప్రకటన రావాలనే న్యాయమైన డిమాండ్ ప్రతిపక్షం దగ్గర ఇప్పటిదాకా ఉంది; కానీ దీనితో వాళ్లు ఆటలో ఓడారు.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

అసలు నిజం



దళితుల దురవస్థల మీద తమ కెరియర్‌ను నిర్మించుకున్న దళిత నాయకులు నా పట్ల కొత్త అబద్ధాన్ని వ్యాపింపజేస్తున్నారు. దళితులు ఎప్పటికీ మురికిలో, పేదరికంలో ఉండాలని నేను కోరుకుంటున్నానట! అబద్ధాలు. రిజర్వేషన్ల కంటే స్వేచ్ఛా మార్కెట్ అనేది దళితుల్ని మరింత పైకి తెస్తుందని మాత్రమే నేను నమ్ముతానన్నది నిజం.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అంతా అక్కడికే...



అసలైన రథయాత్రి, అయోధ్య మందిర నాయకుడు (అద్వాణీ) రామమందిర ప్రారంభోత్సవంలో ఇప్పుడు అక్కర్లేని మనిషి. 'నవ భారత' పాలకుల చేతిలో నిజంగానే మార్గదర్శక మండలికి పరిమితమయ్యారు. తనకు తోడుగా శివరాజ్, వసుంధర, ఇంకా త్వరలో గడ్కరీ, రాజ్‌నాథ్‌ల కోసం ఆయన ఎదురుచూస్తున్నారు.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

ఎలా?



ఒక డీఎంకే సీనియర్ నాయకుడికి (క్. పొన్ముడి) అవినీతికి శిక్ష పడటం ఇదే మొదటిసారా? అదే నిజమైతే, చాలామంది చాలా మొత్తానికి చాలా కాలం తప్పించుకోవడం గొప్ప విషయమే!


– సుమంత్ రామన్, యాంకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గణిత ఘనాపాఠి

అపారమైన మేధస్సుతో భారతదేశ కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగరవేసిన మహా గణితవేత్త శ్రీనివాస రామానుజన్. ఒక సాధారణ సంప్రదాయ కుటుంబంలో 1887 డిసెంబర్ 22న తమిళనాడు ఈరోడ్‌లో జన్మించారు. చిన్న వయసులోనే 'ఏ సంఖ్య అయినా అదే సంఖ్యతో భాగిస్తే ఒకటి వస్తుంది' అని సార్వత్రీకరించిన ఉపాధ్యాయుని 'సున్న ను సున్న తో భాగిస్తే ఒకటి వస్తుందా?' అనే ప్లేస్టోర్ ప్రశ్న వేసి ఆశ్చర్య పరిచాడు. ఇప్పటికీ దీనికి సమాధానం లేకపోవడం గమనార్హం.

1903వ సంవత్సరంలో కార్ రచించిన 'ఏ సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరీ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ మాథెమాటిక్స్' అధ్యయనంతో రామానుజన్ గణిత ఆలోచనలు కొత్త మలుపులు తిరిగాయి. ఆ పుస్తకంలో అనేక క్లిష్టమైన సిద్ధాంతాలను రామానుజన్ స్వయంగా సాధించడం విశేషం. రామానుజన్ చూపిస్తున్న గణిత ప్రజ్ఞను గమనించి మద్రాస్ యూనివర్సిటీ నెలకు 75 రూపాయల స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. కుంభకోణం ప్రభుత్వ కాలేజీలో ఎఫ్ఏలో చేరాడు. గణితమే సర్వస్వంగా ఉండి మిగతా సబ్జెక్టులు నిర్లక్ష్యం చేయడంతో ఎఫ్ఏ పరీక్ష పూర్తి కాలేదు. 1909, జూలై 14న జానకి అమ్మాళ్‌తో వివాహం జరిగింది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రామానుజన్ జీవనోపాధి కోసం పోర్ట్‌లో నెలకు ఇరవై రూపాయల జీతంతో గుమస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1913లో ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా॥ వాకర్... మద్రాస్ యూనివర్సిటీ నెలకు 75 రూపాయలు ఉపకార వేతనం ఇచ్చేలా సిఫారసు చేశారు. అదే సమయంలో రామానుజన్ తన పరిశోధనలను కేంబ్రిడ్జిలో ప్రముఖ గణిత ప్రొఫెసర్ జీహెచ్ హార్డీకి పంపించారు.



శ్రీనివాస రామానుజన్

హార్డీ కృషితో రామానుజన్ 1914 మార్చి 17న ఇంగ్లాండ్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చేరారు. ఆరేళ్ల కాలంలో 32 పరిశోధనా పత్రాలను సమర్పించారు. తక్కువ కాలంలోనే 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ', 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ్' గౌరవాలను పొందారు. రామానుజన్ 'మేజిక్ స్క్వేర్', 'మాక్ తీటా ఫంక్షన్స్', 'నంబర్ థియరీ', 'స్ట్రింగ్ థియరీ' వంటి వాటిపై అనేక పరిశోధనలు చేశారు. 'గణిత శాస్త్రానికి నేను రామానుజన్‌ను కనుగొనడం నా గొప్ప పరిశోధన' అని హార్డీ పేర్కొనడం విశేషం. అనారోగ్యంతో 1920, ఏప్రిల్ 26న చిన్నవయసులోనే తుది శ్వాస విడిచారు. మనవాళ్లు గణితంలో సరికొత్త ఆవిష్కరణలతో రాణించడమే ఆయనకిచ్చే అసలైన నివాళి.

– తోటకూర సాయి రామకృష్ణ; గణిత అవధాని, సామర్లకోట
(డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి)

తండ్రి స్వప్నాన్ని నిజం చేసిన తనయుడు

అభిప్రాయం



భండారు శ్రీనివాసరావు

వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేదల ఆరోగ్యం గురించి ఒక బృహత్తరమైన కలకంటూ అది పూర్తిగా నెరవేరక ముందే అర్ధంతరంగా నిష్క్రమించారు. దాన్ని ఆయన కుమారుడు, ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి సామాన్య ప్రజలకోసం 'ఆరోగ్య శ్రీ' పేరుతో ఒక బృహత్తర కార్యక్రమానికి రూప కల్పన చేశారు. సామాన్యులకు అందని ద్రాక్షగా ఉన్న కార్పొరేట్ స్థాయి వైద్యం వారికి అందుబాటులోకి తెచ్చిన పథకమే ఆరోగ్య శ్రీ. అందులో భాగంగానే అత్యవసర సమయాల్లో, పిలుపు అందగానే రయ్యిమని వచ్చి సకాలంలో ఆసుపత్రులకు చేర్చి వారి ప్రాణాలు కాపాడడానికి ఉద్దేశించిన '108 అంబులెన్స్ సర్వీసు', ప్రజల వద్దకే వెళ్లి రోగనిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు అక్కడికక్కడే ఉచితంగా ఇచ్చే '104 సర్వీసు'లు. వీటిని వైఎస్ చాలా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తూ... ఈ పథకాల ద్వారా ఎలాంటి పరిపూర్ణ ఫలితాలు రాబట్టాలని కల కన్నారో, ఆ స్వప్నం సాకారం కాకుండానే హెలికాప్టర్ ప్రమాదంలో కన్ను మూశారు. ఆయన కన్నకలను నిజం చేసే మహత్తర అవకాశం, వైఎస్ మరణించిన పదేళ్ల తర్వాత 2019లో విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పుడు జగన్ మోహన్ రెడ్డికి లభించింది.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు గురై కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతూ, అమృత ఘడియల్లో (వైద్య పరిభాషలో గోల్డెన్ అవర్స్) అవసరమైన వైద్య సాయానికి నోచుకోకుండా ఏటా వందల వేల సంఖ్యలో, కలిగినవారు లేనివారు అనే తేడా లేకుండా మృత్యువాత పడు తున్నారు. ఇలాంటి వారికి ప్రాణభిక్ష పెట్టేదే 108 అంబులెన్స్ సర్వీసు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మూడు మైళ్ళ దూరంలో నివసించే పేద వారికి కార్పొరేట్ వైద్యం సంగతి సరే, సాధారణ వైద్యం కూడా అందని మావే. షుగర్, బీపీ వంటి రోగాలు వారి శరీరంలో దూరిన సంగతి కూడా వారికి తెలియదు. ఎందుకంటే వారు తమ జీవితంలో ఎన్నడూ ఆరోగ్య పరీక్షలు ఎరుగరు కాబట్టి. అవి ముదిరి పక్ష వాతం, గుండెజబ్బులకు దారితీసినప్పుడు కానీ పరిస్థితి తమ చేయిదాటి పోయిందనే ఎరుక వారికి కలగదు. అప్పటి ఆలోచనే 104 సర్వీసు.

జబ్బులు, రోగాలు చెప్పిరావు. వచ్చిపడిన తరువాత తల తాకట్టు పెట్టయినా వైద్యం చేయించాల్సిన పరిస్థితి. చాలీ చాలని ఆదాయాలతో రోజులు గడిపే వారికి ఆసుపత్రులు, ఖరీదైన వైద్యం అంటే మాటలు కాదు. అందుకే వైఎస్, ఆరోగ్య శ్రీ అనే పథకానికి



రూపకల్పన చేసి అమల్లో పెట్టారు. గుండె జబ్బుల వంటి పెద్ద జబ్బులకు కూడా ఉచితంగా ఆపరేషన్లు చేయించుకోగలిగే అద్భుత అవకాశం పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 104 వాహనం ప్రతినెలా ఒక నిర్దిష్టమైన రోజు ప్రతి గ్రామానికీ వెళ్లి బాలింతలు, చూలింతలు, వృద్ధులు, బాల బాలికలకు వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఇస్తుంది. వారి ఆరోగ్య రికార్డులను కంప్యూటర్లలో భద్రపరచి, ఇతర ప్రదేశాలకు వెళ్ళినప్పుడు ఆ రికార్డుల ద్వారా వైద్య సాయం, చికిత్స పొందడానికి వీలైన ఏర్పాట్లు ఈ పథకంలో పొందుపరచారు. గర్భిణులకు క్రమబద్ధంగా పరీక్షలు చేసి, గర్భస్థ శిశువు పెరుగుదల గమనించి, తదనుగుణంగా వారికి పోషకా హారం అందించడమే కాకుండా, పురుడు వచ్చే రోజును నిర్ధారించి, 108 అంబులెన్స్‌కు కబురుచేసి, వారికి సకాలంలో ఆసుపత్రులలో పురుడుపోసుకునే వీలు కల్పించాలని అనుకున్నారు. అలాగే ప్రసవానంతరం ఆ తల్లీ బిడ్డలను క్షేమంగా ప్రభుత్వ అంబులెన్స్ లోనే ఇంటికి చేర్చాలనేది కూడా వైఎస్ తలంపు.

వైఎస్ కన్న కలలో పూర్తికాని, అమలుకు నోచుకోని ఆయన ఆలోచనలకు జగన్ తన హయాంలో పూర్తి స్వరూపం కల్పించారని ఆరోగ్యశ్రీ గురించి ఆయన మొన్న చేసిన ప్రకటన చెప్పకనే చెబుతోంది. వైఎస్ స్వప్నం నేరవేర్చడానికి ఆయన ప్రస్తుతం లభ్యం అవుతున్న అధునాతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం హర్షణీయం. విశాలమైన రహదారులూ, రమ్య హర్మ్యాలూ అభివృద్ధికి కొలమానాలు కావచ్చు. అయితే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కూడా కళ్ళకు కనిపించని పురోగతే.

తోక టపా:

సీనియర్ జర్నలిస్ట్ దారా గోపి తన అనుభవం గురించి ఓసారి చెప్పారు. ఆ ముచ్చట ఆయన మాటల్లోనే: 'రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారు. చాలామంది డబ్బున్నోళ్ళు కూడా ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకుని వైద్యం చేయించుకుంటున్నారు. ఇదే ఓసారి వైఎస్సార్‌తో అంటే... నాకు రెండు ఉదాహరణలు చెప్పారు.

1. వరద వచ్చినప్పుడు ముందుగా చెత్తా చెదారం వస్తుంది. మంచినీళ్ళు ఆ తర్వాతే వస్తాయి. ఈ స్కీం ఇప్పుడే పెట్టాం కాబట్టి చెత్తా చెదారం ఉంటుంది.

2. నేను పేదలకు అన్నదానం అని ప్రకటించా. ఓ పెద్దాయన ప్లేట్ పట్టుకుని వరసలో నుంచుంటే, ఆ ప్లేట్‌లో అన్నం పెట్టకుండా ఎలా ఉంటాను!?'

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మృతదేహం అంటే...

మెహెర్ బాబాకు దగ్గర శిష్యుడు ఏరచ్. అతడికి ప్రొద్దుటి పూట ఎండలో కొంతసేపు నడిచే అలవాటు ఒకటి ఉన్నది. ఓ ఉదయం అలా కొంత దూరం నడిచాక తోడు వచ్చిన స్నేహితునితో 'నేను తొందరగా మూత్ర విసర్జనకు వెళ్ళాలి. ఆపుకోలేను' అని అన్నాడు. కొంత వయసు మళ్ళటం మూలాన, మరికొంత అధికంగా మందు బిళ్ళలు వాడటం వల్ల ఏరచ్‌కు శరీరం మీద పూర్వం ఉన్న అదుపు కొంత సడలింది. ఏరచ్ రోడ్డు దాటి పక్క పొలంలోకి వెళ్ళి, ఆ పని పూర్తి చేసుకు వచ్చి 'ఇప్పుడు ఎంత హాయిగా ఉందో చెప్పలేను. ఒక్క నిమిషం ఆలోచించు. కొద్దిపాటి మూత్రం బరువును వదిలించుకొన్నందుకే ఆత్మ ఇంతగా సంతోషపడితే, మరణ సమయంలో దేహం యొక్క అతి పెద్ద బరువును వదిలించుకొన్నందుకు ఇంకెంతగా ఆత్మ సంతోషపడుతుందో గ్రహించగలవా?' అన్నాడు.



జ్యోతిర్మయం

తన జీవితంలో ఇది వరకు జరిగిన ఒక సంఘటన గురించి కూడా ఏరచ్ ఆ సందర్భంలో చెప్పాడు. తన తండ్రి చనిపోయినప్పుడు మెహెర్ బాబా, తానూ శ్మశానానికి వెళ్లామనీ, శవం కేసి వేలు చూపి బాబా 'అది ఏమిటి ఏరచ్?' అని అడిగారనీ, దానికి తాను 'అది నా తండ్రి మృతదేహం' అని సమాధానం ఇచ్చాననీ చెప్పాడు. ''ఈ జవాబు బాబాకు తృప్తి నివ్వలేదు. మళ్ళీ అడిగారు, 'అది ఏమిటి?' అని. మళ్ళీ అదే సమాధానం ఇచ్చాను. ఏమీ తెలియనట్లు బాబా పదేపదే అదే ఎందుకు అడుగుతున్నారో నాకు అర్థం కాలేదు. ఉన్నట్టుండి బాబా విషయం మార్చి అడిగారు, 'నీవు ప్రొద్దుటిపూట మల విసర్జనకు వెళ్తావా?' అన్నారు. వెళ్తాను అని చెప్పగా బాబా 'మల విసర్జన చేసినందుకు నీకు ఏమైనా దుఃఖం కలుగుతుందా?' అన్నారు. 'లేదు, అది చేసినందుకు నేను చాలా సుఖం అనుభవిస్తాను' అన్నాను. బాబా అప్పుడు నా తండ్రి మృతదేహం వైపు వేలు చూపించి 'మరణం అనే ప్రక్రియ ద్వారా మనిషి దేహాన్ని ఆత్మ విసర్జిస్తుంది. నీకు ఎదురుగా ఏదైతే నీ తండ్రి మృతదేహంగా కనిపిస్తున్నదో, అది ఆత్మ విసర్జించిన మలం!' అన్నారు'' అని నాటి గురువుగారి బోధన గుర్తు చేసుకున్నాడు ఏరచ్.

చివరగా మృత దేహం అంటే ఏమిటో ఒక్క ముక్కలో చెప్పాడు ఏరచ్: 'మనం జీవితం అంతా, ఆత్మ విసర్జించే మలం అయిన దేహానికి ప్రాముఖ్యం ఇస్తాము, ఆత్మను నిర్లక్ష్యం చేసి!!'

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.అష్టమి ప.1.55 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.1.39వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.12.11 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.36 నుండి 12.19 వరకు, **అమృత ఘడియలు:** రా.9.10 నుండి 10.41 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.26.

● రామావతారంలో భద్రాద్రి రామయ్య



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిజరూపమైన రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సీతా, లక్ష్మణ సమేతుడైన రామయ్యను భక్తరామదాసు చేయించిన బంగారు ఆభరణాలతో అలంకరించారు. మిథిలా స్టేడియంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. - భద్రాచలంటౌన్

నర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతంపై హర్షం



మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖలో 7,094 పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతంపై నర్సింగ్ ఆఫీసర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాతరాథోడ్, నర్సింగ్ ఆఫీసర్లు లక్ష్మణ్ రూడావత్, సోమేశ్, రవినాయక్, హరిత, సౌమ్య కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 317 జీవో సమస్య గురించి మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆరు హత్యల కేసులో ఐదుగురు అరెస్టు

- ప్రధాన నిందితుడు ప్రశాంత్‌కు సహకరించిన ప్రశాంత్ తల్లి, తమ్ముడు, మరో ఇద్దరు అదుపులోకి
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి క్రైం: ఇంటి కోసం ఒకే కుటుంబంలోని ఆరుగురిని దారుణంగా హత్య చేసిన కేసులోని నిందితులను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ మంగళవారం మీడియాకు వెల్లడించిన వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌కు చెందిన పూనే ప్రసాద్ (36)కు భార్య శాన్విక అలియాస్ రమణి (29), కవల పిల్లలు చైత్రిక (8), చైత్రిక్ (8), తల్లి సుశీల, ఇద్దరు చెల్లెళ్లు స్వప్న (26), శ్రావణి (23) ఉన్నారు. ఓ యువతి ఆత్మహత్య కేసు నేపథ్యంలో ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాక ప్రసాద్ తన కుటుంబంతో కలిసి కామారెడ్డి జిల్లాలోని పాల్వంచకు మకాం మార్చాడు. ఆ కేసు నిమిత్తం డబ్బులు అవసరమై గతంలో తన స్నేహితుడు ప్రశాంత్ నుంచి రూ.3.50 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. ఈమధ్యన ప్రశాంత్ తనకు రావాల్సిన డబ్బులను ప్రసాద్‌ను అడగగా స్వగ్రామం మాక్లూర్‌లోని ఇంటిని తాకట్టు పెట్టి చెల్లిస్తానని చెప్పాడు. ఈ క్రమంలో రూ.25 లక్షలు విలువ చేసే ప్రసాద్ ఇంటిని సొంతం చేసుకోవాలని ప్రశాంత్ పథకం పన్నాడు. ఇంటిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిస్తే లోన్ తీసుకుని తనకివ్వాల్సిన డబ్బులు తీసుకుని మిగిలిన మొత్తం ఇస్తానని ప్రసాద్‌ను నమ్మించాడు. ప్రసాద్ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ రోజులు గడుస్తున్నా ప్రశాంత్ డబ్బులు ఇవ్వకపోగా, చివరికి హత్య చేయాలని భావించాడు.

రూ.60 వేలకు సుపారీ..

ప్రసాద్‌ను హత్య చేసేందుకు మాక్లూర్ మండలం దుర్గానగర్ తండాకు చెందిన బానోత్ వంశీ, గుగులోత్ విష్ణులకు రూ.60 వేలు ఇచ్చేందుకు ప్రశాంత్ ఒప్పందం చేసుకున్నాడు. గత నెల 29న మాట్లాడుకుందామని నమ్మించి ప్రశాంత్, వంశీ, విష్ణులతో కలిసి ప్రసాద్‌ను కారులో మదనపల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లారు. మద్యం తాగించి కర్రలు, రాళ్లతో కొట్టి చంపారు. అక్కడే గోతిని తవ్వి పాతి పెట్టారు. ఈనెల 1న పోలీసుల భయంతో ప్రసాద్ ఓ చోట దాక్కున్నాడని, అతను రమ్మన్నాడని చెప్పి భార్య శాన్విక (గర్భవతి), ప్రసాద్ చెల్లెలు శ్రావణిను వెంట తీసుకుని నిజామాబాద్ వెళ్లారు. శ్రావణిని ఓ చోట ఉంచి శాన్వికను బాసర బ్రిడ్జి సమీపంలోకి తీసుకెళ్లి ఆమె గొంతుకు తాడు బిగించి నిందితులందరూ కలిసి చంపేశారు. ఆమె మృతదేహాన్ని నదిలో పడేశారు. ఆ వెంటనే శ్రావణి దగ్గరకు వెళ్లి ఆమెను కారులో ఎక్కించుకుని చేగుంట మండలం వడియారం ప్రాంతంలో హత్య చేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. మళ్లీ పాల్వంచకు వచ్చి ప్రసాద్ తల్లి సుశీల, మరో చెల్లెలు స్వప్న, ఇద్దరు పిల్లలను ఈనెల 4 న అదే కారులో తీసుకువెళ్లి నిజామాబాద్‌లోని ఓ లాడ్జిలో ఉంచారు. ఆ తర్వాత ప్రశాంత్ ఇంటికి వెళ్లి జరిగిందంతా తన తల్లి వడ్డెమ్మతో చెప్పి సహకరించాలని కోరాగా ఆమె ఒప్పుకుంది.

తప్పించుకున్న తల్లి

ప్రసాద్ పిల్లల్ని చూడాలని అంటున్నాడని సుశీలను, స్వప్నను నమ్మించారు. సుశీల, స్వప్నలను లాడ్జిలోనే ఉంచి ఇద్దరు పిల్లలను ప్రశాంత్, అతని తమ్ముడు తీసుకుని వెళ్లారు. నిర్మల్ వెళ్లే దారిలో ఉండే సోన్ బ్రిడ్జి వద్దకు వెళ్లేలోగా కారులోనే ఇద్దరు పిల్లలను తాడుతో ఉరి బిగించి హత్య చేసి గోనె సంచుల్లో కట్టి వాగులో పడేశారు. ఈ నెల 13న లాడ్జి నుంచి స్వప్నను కారులో తీసుకువెళ్లిన ప్రశాంత్, మైనర్ బాలుడు, వంశీ కలిసి సదాశివనగర్ మండలం భూంపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన హత్యచేసి పెట్రోల్ పోసి తగలబెట్టారు. నిందితులు ప్రసాద్ తల్లిని కూడా చంపేయాలని ప్లాన్ చేసినా చివరగా ఆమెకు అనుమానం వచ్చి లాడ్జి నుంచి బయటకు వెళ్లిపోయి తప్పించుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుల గుర్తింపు..

భూంపల్లి వద్ద గుర్తుతెలియని యువతి మృతదేహాన్ని మరుసటి రోజు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పక్షం రోజుల వ్యవధిలోనే ఒకే తరహా హత్యలు చేగుంట, సదాశివనగర్, మెండోరా (సోన్ బ్రిడ్జి) పీఎస్‌ల పరిధిలో వెలుగు చూడటంతో వాటి మధ్య ఏదైనా లింక్ ఉన్నదా అనే కోణంలో విచారించారు. వందల సంఖ్యలో సీసీ కెమెరాలు పరిశీలించారు. సెల్‌ఫోన్ టవర్ డంప్, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని మాక్లూర్ కు చెందిన ప్రశాంత్‌గా గుర్తించారు. మంగళవారం నిందితులంతా కలిసి కారులో ప్రసాద్ తల్లిని వెతుకుతూ పాల్వంచకు వెళ్తుండగా పద్మాజీవాడి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు.

వన్యప్రాణుల దాడులకు పరిహారం పెంపు

- తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు
- మనిషి చనిపోతే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: వన్యప్రాణులు–మనుషుల సంఘర్షణలో మరణాలు లేదా గాయపడటం వంటివి సంభవిస్తే.. వివిధ కేటగిరీల వారీగా చెల్లించే నష్టపరిహారాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ దాడుల్లో మనుషులు చనిపోతే గరిష్టంగా ఇచ్చే రూ.5లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గాయపడిన వారికి (సింపుల్ ఇంజూరి) వైద్య ఖర్చులకయ్యే మొత్తాన్ని చెల్లిస్తుండగా, వెంటనే సహాయం అందించేందుకు రూ.పదివేలు ఎక్స్‌గ్రేషియాగా ఇవ్వనున్నారు. ఈ ఘటనల్లో తీవ్రంగా గాయపడినవారికి వాస్తవ వైద్యఖర్చుతో పాటు శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.75 వేలు ఇస్తుండగా, ఇప్పుడు ఆ ఎక్స్‌గ్రేషియా రూ.లక్షకు పెంచారు. ఈ దాడుల్లో పశువులు చనిపోతే పశుసంవర్ధకశాఖ ఇన్‌స్పెక్టర్ అంచనాలకు అనుగుణంగా మార్కెట్ ధర చెల్లిస్తుండగా దానిని పశుసంవర్ధకశాఖ ఇన్‌స్పెక్టర్‌తో పాటు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్‌వో) , గ్రామసర్పంచ్ సంయుక్తంగా సమర్పించే నివేదిక ఆధారంగా మార్కెట్ ధర (రూ.50వేలుమించకుండా) చెల్లించనున్నారు.

పంట నష్టానికీ పరిహారం పెంపు

పంటనష్టం వాటిల్లినపుడు గతంలో ఎకరానికి రూ.6 వేలు చెల్లిస్తుండగా, వ్యవసాయ అధికారి, ఎఫ్ఎస్‌వో, రెవెన్యూ అధికారి సంయుక్తంగా వేసే అంచనా ఆధారంగా ఎకరానికి రూ.ఏడున్నర వేలకు పరిహారం పెంచారు. ఇతర ఉద్యానవన పంటలకు రెవెన్యూ అధికారుల అంచనాకు అనుగుణంగా రూ.ఏడున్నర వేల నుంచి రూ.50 వేల దాకా పరిహారం చెల్లిస్తుండగా, ఉద్యాన అధికారి, ఎఫ్ఎస్‌వో, రెవెన్యూ అధికారి సంయుక్త నివేదిక ఆధారంగా గతంలో చెల్లిస్తున్న మొత్తాన్ని అందజేయనున్నా రు. మరణం / గాయం / పంటనష్టం వంటి వాటికి ఆయా కుటుంబాల్లోని పెద్దలకు రెవెన్యూ అధికారుల సర్టిఫికెట్ ఆధారంగా వేగవంతంగా పరిహారం చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

వివిధ కేటగిరీలకు అర్హత మార్గదర్శకాలు ఇవీ...

- అడవులు, రక్షిత ప్రాంతాల్లో వలస పశువులు, మేకలు, గొర్రెలు చనిపోతే ఎలాంటి పరిహారం లేదు
- జాతీయపార్కుల్లో జరిగిన దాడుల్లో పశువులు చనిపోతే పరిహారం చెల్లించరు
- ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్/ ఎఫ్ఎస్‌వో పరిశీలించే దాకా దాడిలో పశువులు చనిపోయిన ప్రాంతం నుంచి తరలించొద్దు
- పశువులను చంపడంపై ఎఫ్ఎస్‌వో ఆ పై స్థాయి అధికారి సర్టిఫికెట్ (పంచనామా, ఫొటోలతో సహా) ఇవ్వాల్సి ఉంటుంది
- డీఎఫ్‌వో/ ఎఫ్‌డీవోలు మంజూరు చేసి చెక్కుల ద్వారా చెల్లించాలి
- వన్యప్రాణుల దాడుల్లో మనుషుల మరణం లేదా గాయపడినపుడు (పాములు, కోతులు మినహా) దాడి జరిగిన ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లేదా ఎస్ఐ ర్యాంక్‌కు తక్కువలేని ఉద్యోగి 48 గంటల్లో స్పాట్ ఇన్‌స్పెక్షన్ చేయాలి
- మృతికి కారణంపై అసిస్టెంట్ సివిల్ సర్జన్‌తో పోస్ట్‌మార్టమ్ నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఈ దాడి జరిగినపుడు అటవీ, వన్యప్రాణుల చట్టాలను బాధితుడు ఉల్లంఘించి ఉండకూడదు.

ముఖ్యమంత్రి సారూ... సర్కారు బడులకు ఉచిత విద్యుత్ ఇవ్వరూ..

సీఎం రేవంత్‌రెడ్డికి 5వ తరగతి విద్యార్థిని లేఖ



సీఎంకు రాసిన లేఖను పోస్టు చేస్తున్న విద్యార్థిని అంజలి

ఇబ్రహీంపట్నం రూరల్: 'ముఖ్యమంత్రి సారూ.. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వండి' అంటూ 5వ తరగతి విద్యార్థిని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసింది. మంగళవారం దాన్ని పోస్ట్ చేసింది. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్.అంజలి అనే విద్యార్థిని 5వ తరగతి చదువుతోంది. 'శ్రీయుత గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి నమస్కరించి వ్రాయునది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీరు ఎన్నికైనందుకు శుభాకాంక్షలు అందజేస్తూ, దయచేసి మన ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని నా మనవి'అని ఉత్తరం రాసి ఆదిబట్లలోని పోస్టాఫీస్ వద్ద గల పోస్టు బాక్స్‌లో వేసింది. విద్యార్థిని చేసిన పనికి శభాష్ అంటూ అందరూ మెచ్చుకున్నారు. గతంలో ఇదే పాఠశాల విద్యార్థి 'మా బడికి బస్సులు నడపండి'అంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఉత్తరం రాయగా ఆయన స్పందించారు. మరి సీఎం స్పందించి.. చిన్నారి కోరిక నెరవేరుస్తారేమో చూడాలి.

కొత్త జోన్లవారీగా కేడర్ స్ట్రెంథ్ కేటాయించాలి

మంత్రి సీతక్కకు పంచాయతీ సెక్రెటరీల అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పలువురు పంచాయతీ కార్యదర్శులు జీవో 317 కారణంగా స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని వెంటనే సవరిస్తూ కొత్త జోన్ల వారీగా కేడర్ స్ట్రెంథ్ కేటాయించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)కు తెలంగాణ పంచాయతీ సెక్రెటరీల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ విధంగా బదిలీ అయిన సెక్రెటరీలను వారి జోన్లలో తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వాలని, స్పౌజ్ కేసులు, పరస్పర బదిలీలు, సాధారణ బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను ఓ కమిటీ ద్వారా క్రమబద్ధీకరించినందున, మిగిలిన వారిని కూడా వెంటనే అదేవిధంగా చేయాలని విజ్ఞప్తి చేసింది. మంగళవారంరాత్రి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఈ. శ్రీనివాస్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, ఆయా అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారని మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కాలువలో పడి విద్యార్థి మృతి



ఫర్హాన్ (ఫైల్)

బాన్సువాడ రూరల్: మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆడుకుంటూ వెళ్లి పాఠశాల వెనుక ఉన్న నిజాంసాగర్ ఉపకాలువలో పడి ఒకటో తరగతి విద్యార్థి మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొత్తాబాది గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఉస్మాన్, ఆసిఫాబేగం దంపతుల కొడుకు ఫర్హాన్(6) గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లిన ఆసిఫాబేగం కుమారుడు ఫర్హాన్‌కు భోజనం తినిపించి ఇంటికి వెళ్లింది. తర్వాత తోటి విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ వెళ్లిన ఫర్హాన్ పాఠశాల వెనుకభాగంలో ఉన్న నిజాంసాగర్ 8వ నంబర్ ఉపకాలువలో పడి కొట్టుకుపోయాడు. విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో నుంచి ఫర్హాన్‌ను బయటకు తీశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గోడౌన్ నిర్మాణ సమయంలో ప్రహరీని కూల్చివేయడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు చెప్పారు. విద్యార్థి తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో నాగేశ్వరరావు, సీఐ మహేందర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు రెండు, చివరి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను మంగళవారం ప్రకటించారు. సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 23 వరకు ఆయా కాలేజీలో ఫీజు రసీదుతోపాటు జాయినింగ్ లెటర్‌ను సమర్పించాలని టీఎస్‌సెట్–23 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.రమేశ్‌బాబు తెలిపారు.

24న ప్రవాసీ తెలంగాణ దివస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24న రవీంద్ర భారతిలో ప్రవాసీ తెలంగాణ దివస్–2023 నిర్వహించనున్నట్లు ఫోరం వ్యవస్థాపకుడు డీపీరెడ్డి, ప్రధాన కార్యదర్శి మట్టా రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ప్రవాసీ తెలంగాణ దివస్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి, ఫిల్మ్ డైరెక్టర్ రఫీ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా ప్రతినిధులు మారకంటి భవానీరెడ్డి, గాలి రెడ్డి, నరేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై దృష్టి సారించాలి: ఆర్ఎస్పీ



దోర్నకల్: నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగం రావడం లేదన్న బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మహబూబాబాద్ జిల్లా ఎర్రమట్టితండాకు చెందిన భూక్యా వినయ్ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. వినయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినట్లుగా ప్రభుత్వమే నిరుద్యోగులకు గ్రామగ్రామాన ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ ద్వారా అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. 2017లో టీఎస్‌పీఎస్సీ 616 గురుకుల పీఈటీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహించి 1,200 మందిని ఎంపిక చేసిందని, కానీ పలు కారణాలతో నియామక ప్రక్రియను నిలిపి వేసిందన్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఐదుగురు అభ్యర్థులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం వెంటనే ఆ పీఈటీ నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్‌పర్సన్ పదవులను గిరిజన అభ్యర్థులకే కేటాయించాలని ప్రవీణ్ కోరారు. వినయ్ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తూ మృతుడి సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

కోతిని తప్పించబోయి ఆటో బోల్తా

ఇద్దరు కూలీలు మృతి.. 11 మందికి గాయాలు



రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

వేములవాడ రూరల్: వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడి ఇద్దరు మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మరో 11 మంది గాయపడ్డారు. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా మిడ్‌మానేరు ముంపు గ్రామం కావడంతో ఇక్కడ పనులు లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన 13 మంది వ్యవసాయ మహిళా కూలీలు మంగళవారం ఉదయం ఆటోలో చందుర్తి మండలం మర్రిగడ్డకు వరినాట్ల పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లి వద్ద ఆటోకు ఎదురుగా కోతి వచ్చింది. డ్రైవర్ కోతిని తప్పించబోగా ఆటోకింద ఇరుక్కోవడంతో బోల్తాపడింది. ఈ ఘటనలో జాతర కొండ మల్లవ్వ (51) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ కుర్ర బాలవ్వ (65) కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. మిగతా 11 మంది కూలీలు వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వేములవాడ రూరల్ ఎస్సై మారుతి కేసు నమోదుచేసి, మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మంటలు రేపిన మాక్ పార్లమెంట్!

సస్పెన్షన్లపై పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన రాజ్యసభ చైర్మన్‌ను వ్యంగ్యంగా అనుకరించిన ఎంపీ

- నవ్వుల్లో మునిగిన ఎంపీలు, వీడియో తీసిన రాహుల్
- దారుణమైన మానసిక క్షోభకు గురయ్యా: ధన్‌ఖడ్
- విపక్షాల సంస్కారానికి నిదర్శనం: బీజేపీ

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయ సభల నుంచి తమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన కార్యక్రమం తీవ్ర రాజకీయ దుమారానికి తెర తీసింది. విపక్ష ఇండియా కూటమికి చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు మంగళవారం ఉదయం పార్లమెంటు ఆవరణలోని మకర ద్వారం మెట్లపై మాక్ పార్లమెంటు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీతో పాటు పలు విపక్షాల సభ్యులు అందులో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అచ్చంగా సభల్లో మాదిరిగానే సభ్యులంతా నినాదాలతో హోరెత్తించారు. పార్లమెంటు భద్రతా వైఫల్య ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఉభయ సభల నుంచి విపక్ష సభ్యులను భారీగా సస్పెండ్ చేస్తున్న తీరును తీవ్రంగా ఆక్షేపించారు. పాలక పక్షానివి నియంతృత్వ పోకడలంటూ దుమ్మెత్తిపోశారు. పార్లమెంటులో అధికార పక్షానికి చెందిన సభ్యుల వ్యవహార శైలిని వ్యంగ్యంగా అనుకరించారు. ఆ క్రమంలో తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఉన్నట్టుండి లేచి నిలబడి రాజ్యసభలో చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ నడక తీరును, హావభావాలను, ఆయన సభను నిర్వహించే తీరును రకరకాలుగా అనుకరిస్తూ ఎద్దేవా చేశారు. అచ్చం ధన్‌ఖడ్ మాదిరిగానే కాస్త వెనక్కు వంగి నిలబడి, 'వెన్నెముక' అంటూ పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. విపక్ష సభ్యులంతా నవ్వుతూ అయన్ను ప్రోత్సహించగా దీన్నంతటినీ రాహుల్ తన సెల్ ఫోన్లో వీడియో తీస్తూ కన్పించారు. మరికొందరు విపక్షసభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను నడిపే తీరును కూడా వ్యంగ్యంగా అనుకరిస్తూ ఆటపట్టించారు. ఇదంతా టీవీ చానళ్లలో లైవ్‌గా ప్రసారమైంది. ముఖ్యంగా ధన్‌ఖడ్‌ను బెనర్జీ అనుకరించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



మంగళవారం పార్లమెంటు ఆవరణలో రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌ను వ్యంగ్యంగా అనుకరిస్తూ తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రదర్శించిన హావభావాలు

సిగ్గుచేటు: బీజేపీ

విపక్షాల తీరుపై బీజేపీ మండిపడింది. విపక్ష సభ్యులు తమ ప్రవర్తనతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దారుణంగా హేళన చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ మండిపడ్డారు. ఈ చర్యతో విపక్ష ఇండియా కూటమి సంస్కారరాహిత్యం అట్టడుగుకు దిగజారిందన్నారు. ప్రజాస్వామిక విలువల పరిరక్షకుడినని చెప్పుకునే రాహుల్ తీరు ప్రజాస్వామ్యానికి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజలకు, దేశానికి సిగ్గుచేటంటూ ఆక్షేపించారు. వెనకబడ్డ సాదాసీదా నేపథ్యం నుంచి వచ్చి అత్యున్నత రాజ్యాంగ పదవులను అధిష్టించిన వారిని అవమానించడం ఇండియా కూటమి సంస్కృతి అంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. ''ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్‌ను అవమానించిన తీరు ఇందుకు తాజా నిదర్శనం. ఓబీసీ అయిన ప్రధాని నరేంద్ర మోదీని విపక్షాలు ఎంతగా అవమానిస్తున్నదీ దేశమంతా చూస్తూనే ఉంది. ఈ విషయంలో రాహుల్‌ను కోర్టు దోషిగా కూడా తేల్చింది. రాష్ట్రపతి ముర్మును కూడా అధీర్ రంజన్ చౌధరి రాష్ట్రపత్ని అంటూ అవమానించారు'' అన్నారు.



తీరని అవమానం: ధన్‌ఖడ్

విపక్ష సభ్యుల ప్రవర్తన అత్యంత దారుణం, సిగ్గుచేటు అంటూ రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ మండిపడ్డారు. ఉదయం రెండుసార్లు వాయిదా పడ్డ రాజ్యసభ మధ్యాహ్నం తిరిగి సమావేశం కాగానే కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్‌సింగ్ నినాదాలకు దిగగా కూర్చోవాల్సిందిగా ఆదేశించారు. విపక్ష ఎంపీలు తనను అనుకరిస్తూ ఎద్దేవా చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. ''పార్టీల మధ్య వాగ్యుద్ధాలు, పరస్పర విమర్శలు సహజమే. కాకపోతే రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్ వంటి వ్యవస్థలపై కనీస గౌరవం చూపాలి. కానీ నేనిప్పుడే చానళ్లలో చూశా. చైర్మన్‌ను, స్పీకర్‌ను వ్యంగ్యంగా అనుకరిస్తూ ఒక ఎంపీ అత్యంత దారుణంగా ప్రవర్తిస్తుంటే మీ పార్టీ సీనియర్ నాయకుడు (రాహుల్) దాన్ని వీడియో తీస్తున్నాడు. ఆయన మీకంటే పెద్ద నాయకుడు. ఇది చాలా దారుణం. అభ్యంతరకరం. అత్యంత సిగ్గుచేటు. ఏమాత్రం అంగీకారయోగ్యం కాదు. దేనికైనా ఒక హద్దుంటుంది! కానీ ఈ దిగజారుడుతనానికి హద్దంటూ లేదా? మీకు సద్బుద్ధి కలగాలని ఆశించడం తప్ప ఏం చేయగలను?'' అంటూ మండిపడ్డారు. అనంతరం మరో కాంగ్రెస్ సభ్యుడు పి.చిదంబరాన్ని ఉద్దేశించి కూడా ధన్‌ఖడ్ తన ఆవేదన వెలిబుచ్చారు. ''రాజ్యసభ చైర్మన్ వంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిని ఒకరు వ్యంగ్యంగా అనుకరిస్తుంటే, ఇంకొకరు వీడియో తీస్తుంటే చూసి నా హృదయం ఎంతగా క్షోభిల్లి ఉంటుందో మీరే ఊహించండి! దేశాన్ని చిరకాలం పాటు పాలించిన పార్టీ రాజ్యసభ చైర్మన్ వ్యవస్థను ఇంత దారుణంగా అవమానించడం దారుణం. మిస్టర్ చిదంబరం! ఏమిటిది? మీకో విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నా. ఈ ఉదంతంతో నా మనసు ఎంతగానో గాయపడింది. పైగా ఆ వీడియోను మీ పార్టీ ఇన్‌స్టాగ్రాంలో, పార్టీ ట్విటర్‌లో కూడా పెట్టారు. తద్వారా నా రైతు నేపథ్యాన్ని, ఒక జాట్‌గా నా సామాజిక నేపథ్యాన్ని, రాజ్యసభ చైర్మన్‌గా నా హోదాను... ఇలా అన్నింటినీ తీవ్రంగా అవమానించారు'' అంటూ ధన్‌ఖడ్ తీవ్రంగా ఆక్షేపించారు.

మరో 49 మంది సస్పెన్షన్

141కి చేరిన ఎంపీల సంఖ్య

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో విపక్ష సభ్యుల సస్పెన్షన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. లోక్‌సభలో మంగళవారం మరో 49 మందిపై వేటు పడింది. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగిస్తున్నారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, బిగ్గరగా నినాదాలు చేస్తుండడం, సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతుండడంతో లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ విపక్ష సభ్యులపై సస్పెన్షన్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఈ నెల 14న లోక్‌సభ నుంచి 13 మంది, రాజ్యసభ నుంచి ఒక విపక్ష ఎంపీ సస్పెండ్ అయ్యారు. ఈ నెల 18న లోక్‌సభలో 33 మంది, రాజ్యసభలో 45 మంది బహిష్కరణ వేటుకు గురయ్యారు. దీంతో ఇప్పటిదాకా ఉభయ సభల నుంచి సస్పెండైన మొత్తం విపక్ష ఎంపీల సంఖ్య 141కు చేరుకుంది.

లోక్‌సభలో అదే అలజడి

లోక్‌సభ మంగళవారం ఉదయం ప్రారంభం కాగానే విపక్ష సభ్యుల ఆందోళనకు దిగారు. భద్రతా వైఫల్యాన్ని ప్రస్తావించారు. నినాదాలు మొదలుపెట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పారు. వారి ప్రవర్తనపై స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. సభకు సహకరించాలని పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దాంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఇటీవల పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని తట్టుకోలేక విపక్షాలు పార్లమెంట్‌లో ఉద్దేశపూర్వకంగా రగడ సృష్టిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఆరోపించారు. 49 మంది విపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ఆయన ప్రవేశపెట్టిన తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. 49 మంది సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శశి థరూర్, మనీశ్ తివారీ, కార్తీ చిదంబరం, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన డింపుల్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఫరూఖ్ అబ్దుల్లా, ఎన్సీపీకి చెందిన సుప్రియా సూలే, డీఎంకేకు చెందిన జగత్‌రక్షకన్; డీఎన్‌వీ సెంథిల్ కుమార్, జేడీ(యూ)కు చెందిన గిరిధర్ యాదవ్, బీఎస్పీకి చెందిన డానిష్ అలీ, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సుశీల్‌కుమార్ రింకూ తదితరులపై మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ అంతటికీ వారిని సస్పెండ్ చేశారు.

రాజ్యసభలో వాయిదాల పర్వం

భద్రతా వైఫల్యంపై ఎగువ సభలోనూ విపక్షాలు గళమెత్తాయి. మంగళవారం సభలో నిరసనలు, నినాదాలు కొనసాగించాయి. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో సభను ఏకంగా ఐదుసార్లు వాయిదా వేయాల్సి వచ్చింది!

ఇది మోదీస్వామ్య దౌర్జన్యం: కాంగ్రెస్

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడమే మోదీ ప్రభుత్వ అసలు లక్ష్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. పార్లమెంట్ నుంచి 141 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ప్రతిపక్షాలను లేకుండా చేసి, క్రూరమైన చట్టాలను ఆమోదించుకోవడానికి మోదీ సర్కారు కుట్ర పన్నిందని మండిపడ్డారు. ఇది మోదీస్వామ్య దౌర్జన్యమని విమర్శించారు.



మంగళవారం సస్పెన్షన్ తర్వాత పార్లమెంటు ఆవరణలో బైఠాయించిన విపక్ష ఎంపీలు

పడిపోయిన విపక్షాల సంఖ్యాబలం

వరుస సస్పెన్షన్ల నేపథ్యంలో లోక్‌సభలో విపక్షాల సంఖ్యాబలం భారీగా క్షీణించింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మూడింట రెండొంతుల మందిపై వేటు పడింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా కేవలం 9 మంది సభలో మిగిలారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో 138 మంది సభ్యులుండగా, ప్రస్తుతం 43 మంది మిగిలారు. ఏకంగా 95 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు.



మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితరులు

మళ్లీ అక్కడే కూర్చుంటారు

విపక్షాలనుద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష పార్టీలు గతంలో కంటే తక్కువ సీట్లు గెలిచి మళ్లీ 'విపక్షం' పాత్రకే పరిమితం అవుతాయని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. '' దేశ ఉజ్వల భవితవ్యం కోసం మా శక్తియుక్తుల్ని వినియోగిస్తున్నాం. అధికార పీఠం నుంచి మమ్మల్ని కిందకు పడదోసేందుకు విపక్షాలు తమ బలాన్ని వాడుతున్నాయి. లోక్‌సభలో పొగబెట్టిన ఘటనను తమ స్వార్థ రాజకీయాల కోసం పక్కదోవ పట్టిస్తున్నారు. అందుకే 2024 లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష పార్టీలు గతంలో కంటే తక్కువ సీట్లే సాధించి పార్లమెంట్‌లో మళ్లీ అదే విపక్షాల కుర్చీల్లో కూర్చుంటాయి. వాళ్లు ఓడిపోవడంతో ఖాళీ అయిన కుర్చీలను మా బీజేపీ ఎంపీలు భర్తీచేస్తారు'' అని మోదీ వ్యాఖ్యానించారు. '' లోక్‌సభలో ఆగంతకుల చొరబాటు ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిందే. కానీ, నిరుద్యోగిత, అధిక ధరలతో పెరిగిన అసహనంతోనే ఇలాంటి భద్రతా వైఫల్య ఘటనలు జరుగుతాయంటూ ఈ ఘటనను రాహుల్ గాంధీ, తదితర విపక్ష నేతలు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక అక్కసుతో లోక్‌సభలో పొగ ఘటనకు రాజకీయ కోణాన్ని కాంగ్రెస్ ఆపాదిస్తోంది. తమ రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు ఈ ఘటనకు రాజకీయ రంగు పులుముతున్నాయి. ఈ ఉదంతం చాలు విపక్షాల వైఖరి ఏమిటో చెప్పడానికి. వీరి గురించి తెలుసు కాబట్టే దేశ ఓటర్లు వీరికి మళ్లీ విపక్ష స్థానమే కట్టబెడతారు'' అని మోదీ వ్యాఖ్యానించారు.

2024 ఎన్నికల్లో పొత్తులపై కాంగ్రెస్ కమిటీ

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు కుదుర్చుకునేందుకు, సీట్ల పంపిణీపై చర్చలు జరిపేందుకు కాంగ్రెస్ పార్టీ అయిదుగురు సభ్యులతో ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నేషనల్ అలయెన్స్ కమిటీ పేరుతో ఏర్పాటైన ఈ కమిటీకి పార్టీ సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇందులో రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోత్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పార్టీ సీనియర్ నేత మోహన్ ప్రకాశ్ సభ్యులుగా ఉంటారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

భారత్ జోడో యాత్ర 2.0 జనవరిలో!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర వచ్చే ఏడాది జనవరిలో రెండో విడత మొదలయ్యే అవకాశం ఉంది. యాత్రను జనవరి మొదటి వారం తర్వాత మొదలుపెట్టే వీలుందని సంబంధిత వర్గాలు మంగళవారం వెల్లడించాయి. తొలి విడత భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా పాదయాత్ర చేస్తూ స్థానికులతో మమేకం అయ్యారు. ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో కాంగ్రెస్ పార్టీ యాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్యకర్తలు రాహుల్‌తోపాటు పాదయాత్ర చేయడంతోపాటు అవసరమైన చోట్ల వాహనాల్లో యాత్రను అనుసరిస్తారని సమాచారం.

ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయండి

ప్రయాగ్‌రాజ్: వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు కేసులో మంగళవారం కీలక పరిణామం సంభవించింది. మసీదు ప్రాంతంలో గతంలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించాలంటూ హిందూ భక్తులు వేసిన పిటిషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన అర్జీలను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. విచారణను వేగవంతం చేయడం ద్వారా, మూడు దశాబ్దాలుగా నలుగుతున్న ఈ వివాదానికి ఆరు నెలల్లో ముగింపు పలకాలని జిల్లా కోర్టును ఆదేశించింది. వివాదాస్పద ప్రదేశంలోని మతపరమైన అంశాన్ని కోర్టులు మాత్రమే నిర్ణయించగలవని విచారణ సందర్భంగా జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ వ్యాఖ్యానించారు.

అయోధ్య వేడుకలకు అద్వానీ, జోషిలకు వీహెచ్‌పీ ఆహ్వానం

అయోధ్య: అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా బీజేపీ కురువృద్ధ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషిలను మంగళవారం విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆహ్వానించింది. 'రామ మందిరం ఉద్యమానికి ఆధ్యులుగా ఉన్న ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషిలను రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాం. వచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని ఇద్దరు సీనియర్ నేతలు తెలిపారు'అని వీహెచ్‌పీ సభ్యుడు అలోక్ కుమార్ చెప్పారు. ఎల్‌కే అద్వానీ(96), మనోహర్ జోషి(89)లను వారి వయస్సు, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతిష్ఠా కార్యక్రమానికి రావొద్దని కోరగా, వారిద్దరూ అంగీకరించారంటూ రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సోమవారం చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే.

కేరళలో కొత్తగా 115 కోవిడ్ కేసులు

తిరువనంతపురం: కేరళలో కోవిడ్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా 115 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. దీంతో, రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,749కు చేరినట్లు వెల్లడించింది. అదేవిధంగా, మంగళవారం ఉదయం 8 గంటల సమయానికి కేరళ మినహా దేశవ్యాప్తంగా కొత్తగా 142 కోవిడ్ కేసులు నమోదయ్యాయని వివరించింది. ఇదే సమయంలో కోవిడ్ బాధితుల మరణాలేవీ లేవని తెలిపింది.



ఐస్‌లాండ్‌లోని రెకిజేన్స్ దీవిలో అగ్ని పర్వతం బద్దలవడంతో సోమవారం రాత్రి నుంచి లావా ఇలా భారీగా ప్రవహిస్తోంది



మంగళవారం జరిగిన ఇండియా కూటమి భేటీలో నేతలు స్టాలిన్, సోనియా, పవార్, ఖర్గే, లాలు, నితీశ్, మమత, రాహుల్, ఏచూరి

ఇండియా కూటమిలో లుకలుకలు

- మరోసారి బట్టబయలు
- 'దళిత పీఎం'గా ఖర్గే!
- మమత, కేజ్రీవాల్ ప్రతిపాదన
- వాకౌట్ చేసిన నితీశ్, లాలు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాల తరఫున తెరపైకి వచ్చిన 'దళిత ప్రధాని' కార్డు ఇండియా కూటమిలో లుకలుకలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఇండియా కూటమి నాలుగో సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. కాంగ్రెస్, తృణమూల్, ఆప్‌తో పాటు మొత్తం 28 విపక్షాల నేతలు భేటీలో పాల్గొన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏను దీటుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు కీలకమైన సీట్ల సర్దుబాటు తదితరాలపై లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేరును తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్‌లు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపాదించారు. ''దళిత సామాజిక వర్గానికి చెందిన ఆయనను ప్రధాని అభ్యర్థిని చేస్తే వ్యూహాత్మకంగా ఎంతగానో కలిసొస్తుంది. దేశానికి తొలి దళిత ప్రధానిని అందించేందుకు కృషి చేస్తున్నామన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయి'' అని వారన్నట్టు తెలిసింది. దీన్ని పలువురు నేతలు సమర్థించినా బిహార్ సీఎం, నితీశ్‌కుమార్, ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. అసంతృప్తితో వారిద్దరూ భేటీ నుంచి వాకౌట్ చేశారని తెలుస్తోంది. అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశానికి కూడా నితీశ్, లాలు రాలేదు! ఇండియా కూటమిలో లుకలుకలకు ఇది మరోసారి అద్దం పట్టిందని భావిస్తున్నారు. మరోవైపు కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాన్ని పర్యవేక్షించే కమిటీకి ఖర్గేనే కన్వీనర్‌ను చేయాలని కూడా మమత ప్రతిపాదించారు.

సీట్ల పంపకంపై చర్చ

సీట్ల పంపకంపైనా భేటీలో వాడివేడిగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ అంశాన్ని వీలైనంత త్వరగా తేల్చాలని పలు పార్టీలు పట్టుబట్టాయి. డిసెంబర్ నెలాఖరు, లేదంటే జనవరి తొలి వారంలోగా గానీ సీట్ల సర్దుబాటును ఖరారు చేయాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. బీజేపీకి ప్రత్యామ్నాయం తామేనని ప్రజలకు వివరించేలా సానుకూల అజెండాతో 'నేను కాదు, మేము' థీమ్‌తో ముందుకెళ్లాలన్న భావన వ్యక్తమైంది.

విజయానికి కృషి చేద్దాం: ఖర్గే

ప్రధానిగా తన పేరును ప్రతిపాదించడంపై ఖర్గే ఆచితూచి స్పందించారు. ముందుగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏపై ఇండియా కూటమి విజయం కోసం కృషి చేయాలని భేటీలో ఆయన పిలుపునిచ్చారు. ''లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే మన తొలి లక్ష్యం కావాలి. ప్రధాని ఎవరన్నది ఆ తర్వాత చూద్దాం'' అన్నారు. అనంతరం ప్రధాని అభ్యర్థిగా మీ పేరు ఖరారైందా అని ప్రశ్నించగా మీడియాతోనూ అదే చెప్పారు. విపక్ష ఎంపీల సస్పెన్షన్‌పై 22న కూటమి సారథ్యంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ''సీట్ల పంపకం ఎక్కడికక్కడ రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. సమస్య ఉన్న చోట్ల మాత్రమే కూటమి జోక్యం చేసుకుంటుంది'' అని తెలిపారు.

సీట్లపై కాంగ్రెస్ కాస్త తగ్గాలి!

సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్ పట్టు విడుపులతో వ్యవహరించాలని మమత తదితరులు కుండబద్దలు కొట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తొలుత మమతే ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఇతర పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ కాస్త తగ్గాలి. యూపీలో సమాజ్‌వాదీ, పంజాబ్, ఢిల్లీల్లో ఆప్, పశ్చిమబెంగాల్లో తృణమూల్‌కు ప్రాధాన్యం దక్కాలి'' అన్నట్టు చెబుతున్నారు. సీట్ల పంపకం త్వరలో ఖరారు కాకుంటే కూటమి విజయావకాశాలు దెబ్బ తింటాయని కూడా హెచ్చరించినట్టు సమాచారం.

చైనాలో భూకంపం

127 మందికిపైగా దుర్మరణం 700 మందికిపైగా గాయాలు

బీజింగ్/జిషిషాన్: వాయవ్య చైనాను భూకంపం కుదిపేసింది. సోమవారం అర్ధరాత్రి గన్సు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన ఈ భూకంపం ధాటికి చాలా ఇళ్లు నేలమట్టమై 127 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు. పొరుగు రాష్ట్రం క్వింఘాయిలోనూ ఈ ప్రకంపనలు బీభత్సం సృష్టించాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి 700 మందికి పైగా గాయాలపాలయ్యారు. శిథిలాల వద్ద యుద్ధప్రాతిపదికన గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం గ్రామీణ ప్రాంతాల్లో సంభవించడంతో మట్టి ఇళ్లు ఎక్కువగా కూలాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భూమి కంపించడంతో జనం ఇళ్లు వదిలి భయంతో బయటకు పరుగులు తీశారు. భూకంపం వార్త తెలిసి అధ్యక్షుడు జిన్‌పింగ్ యుద్ధప్రాతిపదికన వేలాదిగా సహాయక బృందాలు తరలివెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని అధికారులను ఆదేశించారు. ''భూకంపం ధాటికి విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. చలికాలం, అందునా మైనస్ 15 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత సహాయక చర్యలకు అవరోధంగా మారింది'' అని బ్లూ స్కై రెస్క్యూ టీమ్ చీఫ్ కమాండర్ వాంగ్ యీ చెప్పారు. గన్సు, క్వింఘాయి ప్రావిన్సుల్లో సంభవించిన ఈ భూకంపం కేంద్రస్థానం భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో ఉందని చైనా యంత్రాంగం ప్రకటించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది. భూకంపం వచ్చిన క్వింఘాయి ప్రావిన్స్.. తరచూ భూకంపాలొచ్చే టిబెట్ హిమాలయ ప్రాంతాన్ని ఆనుకుని ఉంది.

ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌పై హెజ్‌బొల్లా దాడి

టెల్ అవీవ్: ఒకేసారి వందలాదిగా దూసుకొచ్చే శత్రు దేశ చిన్నపాటి క్షిపణులను కూల్చేసే ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' రక్షణ వ్యవస్థను ధ్వంసంచేశామని హెజ్‌బొల్లా సంస్థ ప్రకటించింది. క్షిపణులను ప్రయోగించే రెండు ఐరన్ డోమ్ లాంఛర్‌లను ధ్వంసం చేశామని లెబనాన్‌కు చెందిన మిలిటెంట్ సంస్థ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. భిన్న దిశలో దూసుకొచ్చే వందలాది శత్రు దేశ క్షిపణుల పథాన్ని కనిపెట్టి వాటిని నిలువరించేందుకు వెంటనే వందల క్షిపణులను ప్రయోగించే అత్యాధునిక రక్షణ వ్యవస్థగా 'ఐరన్ డోమ్' అంతర్జాతీయంగా పేరుగాంచింది. హెజ్‌బొల్లా ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించలేదు. సోమవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతం 'కబ్రీ'లో ఈ దాడి జరిగిందని వార్తలొచ్చాయి. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా యోధుడి అంతిమయాత్రపై ఇజ్రాయెల్ గగనతలదాడి చేయడంతో ఆగ్రహించి హెజ్‌బొల్లా ప్రతిదాడి చేసింది. గాజా యుద్ధంలో జోక్యం చేసుకుంటే హమాస్ అంతానికి ప్రతిజ్ఞచేసినట్లే హెజ్బొల్లా మీదా దాడికి దిగుతామని ఇజ్రాయెల్ గతంలోనే హెచ్చరించింది. అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ సరిహద్దు గ్రామాలపైకి హమాస్ మిలిటెంట్ల దాడి తర్వాత హమాస్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు మొదలెట్టింది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు లెబనాన్ హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై పోరుకు దిగారు. రోజూ గగనతల దాడులు చేస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 20 । డిసెంబర్ । 2023









ఉత్సవ వందనం

బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, మంత్రి సీతక్క అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌పీఎస్ వందేళ్ల ప్రస్థానాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన మ్యూజియంను రాష్ట్రపతి సందర్శించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటోలను ఆమె ఆసక్తిగా తిలకించారు. పలువురు విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. –సనత్‌నగర్





గాంధీ ఆస్పత్రిలో కోవిడ్ కేసులేమీ నమోదు కాలేదు

- జేఎన్- 1 వేరియంట్‌తో ఐదుగురు చేరారనే ప్రచారం ఫేక్
- అనవసర భయాందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి
- శబరిమలకు వెళ్లే భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలి
- తిరిగి వచ్చిన తర్వాత స్వీయ నియంత్రణలో ఉండాలి
- రానున్న పండుగలు కరోనా వ్యాప్తికి కీలకం
- ఐసోలేషన్ వార్డులో అందుబాటులో 50 పడకలు
- గాంధీ సూపరింటెండెంట్ రాజారావు వెల్లడి

వదంతులు నమ్మొద్దు

గాంధీఆస్పత్రి: 'కోవిడ్ వైరస్ వ్యాప్తిపై వదంతులు నమ్మవద్దు. ఈ నెలలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. కేరళలో వ్యాప్తిలో ఉన్న జేఎన్-1 వేరియంట్‌తో గాంధీ ఆస్పత్రిలో ఐదుగురు చేరారనే ప్రచారం పూర్తిగా ఫేక్. అనవసరంగా భయాందోళన వద్దు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి' అని రాష్ట్ర కోవిడ్ నోడల్ సెంటర్ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ..

- కేరళలో వ్యాప్తిలో ఉన్న జేఎన్-1 వైరస్‌తో గాంధీలో ఐదుగురు చేరారనేది పూర్తిగా అబద్ధం. ఆ ప్రచారంలో ఎటువంటి నిజం లేదు. రాష్ట్రంలోనే జేఎన్-1 వేరియంట్ కేసు నమోదు కాలేదు. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని కేంద్రం అలర్ట్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలు, సలహాలు అందించింది. రాష్ట్ర వైద్యమంత్రి దామోదర రాజనర్సింహా, ఇతర వైద్య ఉన్నతాధికారులు గాంధీలో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.
- గాంధీ అత్యవసర విభాగంలో గతంలో ఏర్పాటు చేసిన కోవిడ్ ఐసోలేషన్ వార్డులో పురుషులకు 30, మహిళలకు 20 మొత్తం 50 పడకలు అందుబాటులో ఉన్నాయి. కోవిడ్ పాండమిక్ ముగిసిన తర్వాత ఎండమిక్‌లో ఒకటి, రెండు కేసులు నమోదు కావడం సర్వసాధారణం. ఈ నెలలో గాంధీలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

రానున్న పండగ రోజులు కీలకం..

- రానున్న క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండగలు కీలకం. కోవిడ్ వంటి వైరస్ ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. హ్యాండ్ శానిటైజేషన్ పాటించాలి. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శ్వాసకోశ రుగ్మతలు, ఇన్ఫెక్షన్లు, వైరల్ ఫీవర్లు ఎక్కువగా నమోదు అయ్యాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో తగ్గుముఖం పట్టాయి.
- ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ జేఎన్-1 మొదట అమెరికాలో వెలుగుచూసింది. కొన్ని నెలల తర్వాత ఇప్పుడు కేరళలో వ్యాప్తిలో ఉంది. రూపాంతరం చెందిన జేఎన్- 1 సబ్ వేరియంట్ సెల్ఫ్ లిమిటింగ్ వైరస్. దానంతట అదే తగ్గిపోతుంది. ఈ వైరస్ తీవ్రత తక్కువ, ఇన్ఫెక్షన్ రేట్ ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు గుర్తించారు.

వీరు జాగ్రత్తగా ఉండాలి..

ఫస్ట్, సెకెండ్ వేవ్‌ల్లో వ్యాపించిన ఆల్ఫా, డెల్టా కంటే మూడో వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ త్వరితగతిన వ్యాపిస్తుంది. ఒమిక్రాన్ సబ్‌వేరియంటే జేఎన్- 1. దీర్ఘకాల రోగాలతో బాధపడేవారు, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి త్వరగా సోకే అవకాశం ఉంది. వారంతా మరింత అప్రమత్తంగా ఉండాలి. కోవిడ్ వైరస్ అన్ని వేవ్‌లు సమ్మర్‌లోనే ఎక్కువగా వ్యాపించాయి.

- కేరళలో జేఎన్- 1 వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములు ముందు జాగ్రత్తలు పాటించాలి. తిరిగి వచ్చిన తర్వాత స్వీయ నియంత్రణ పాటించడంతో పాటు కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. కోవిడ్ కేసులు పెరిగితే గాంధీ మెడికల్ కాలేజీ వైరాలజీ ల్యాబ్‌లోనే జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే మార్గదర్శకాలను అమలు చేస్తాం.
- కోవిడ్ నోడల్ కేంద్రం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో కోవిడ్ ఐసోలేషన్ వార్డుతోపాటు, కోవిడ్ పరీక్షలు, పీపీఈ కిట్లు, వ్యాక్సినేషన్ అందుబాటులో ఉన్నాయి. అసత్య ప్రచారాలు నమ్మవద్దు. భయాందోళనకు గురి కావద్దు. మాస్క్ ధరించి, హ్యాండ్ శానిటైజేషన్, కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.



ఔటర్‌పై ఆరా!

- లీజు విషయంలో విధి విధానాలేమిటి..
- ప్రణాళికా విభాగంలో అనుమతులెలా ఇస్తారు?
- జీఓ 111 పరిధిలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయా?
- పలు విభాగాలపై హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన రెండో రోజే వివిధ విభాగాలపై సమీక్షించారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన హెచ్ఎండీఏ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలపై ఆయన దృష్టి సారించారు. కమిషనర్‌గా తొలిసారి అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వచ్చిన ఆయన ఆయా విభాగాలు చేపట్టే పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవన నిర్మాణాలు, లే అవుట్ అనుమతులు తదితర అంశాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. మరోవైపు ఔటర్‌రింగ్ రోడ్డు లీజుతో సహా కీలకమైన అంశాలపైన సమీక్షించినట్లు తెలిసింది. జీఓ 111 పరిధిలోని శంషాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. హెచ్‌ఎండీఏకు వచ్చిన మొదటి రోజే విధులను నిర్వహించడంతో పాటు పలు అంశాలపై సమాచారం కోసం అధికారులను హడలెత్తించారు.

వివాదాస్పదంగా మారడంతో..

- ఇంజినీరింగ్ విభాగంపై సమీక్షించే క్రమంలో ఔటర్ లీజుపై ఆరా తీసినట్లు తెలిసింది. ఔటర్‌రింగ్‌రోడ్డును లీజుకు ఇచ్చేందుకు అనుసరించిన పద్ధతులు, విధివిధానాలు తదితర అంశాలపై అధికారులతో దానకిషోర్ మాట్లాడారు. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును గత ప్రభుత్వం 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రతి సంవత్సరం వాహనాల నుంచి టోల్‌ట్యాక్స్ రూపంలో రూ.వందల కోట్ల ఆదాయాన్నిచ్చే ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్లపాటు కేవలం రూ.7380 కోట్లకు లీజుకు ఇవ్వడం పట్ల ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రతిపక్షనేతగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
- ఔటర్‌లీజు వ్యవహారంలో అతిపెద్ద కుంభకోణం ఉందని ఆరోపించారు. మరోవైపు బీజేపీ సైతం ఈ లీజును తీవ్రంగా ఖండించింది. రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో ఔటర్‌లీజు అంశం వివాదాస్పదంగా మారింది.
- టీఓటీ పద్ధతిలో ఔటర్ లీజును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ గడువులోపే లీజు మొత్తాన్ని చెల్లించి ఔటర్‌ను దక్కించుకుంది. గతంలో ఔటర్‌పై విధులు నిర్వర్తించిన కొందరు ఇంజినీరింగ్ నిపుణులు సైతం అప్పట్లో ఈ లీజు పట్ల పెదవి విరిచారు. కనీసం రూ.8 వేల కోట్ల ఆదాయమైనా వస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. లీజు ఒప్పందంతో ప్రభుత్వానికి కనీసం రూ.1000 కోట్ల వరకు నష్టం వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాదాస్పదంగా మారిన ఔటర్‌లీజుపై ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన రెండో రోజే ఇంజినీరింగ్ అధికారులతో చర్చించడం గమనార్హం.
- లీజు విధివిధానాలు, బిడ్డింగ్ జరిగిన తీరు, బేస్ ప్రైస్ వంటి పలు అంశాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం ఐఆర్‌బీ సంస్థ నిర్వహణలోనే ఔటర్ ఉన్నప్పటికీ గ్రీనరీ నిర్వహణ మాత్రం హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉంది. మరోవైపు ఔటర్‌కు రెండు వైపులా పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం కొనసాగుతోంది. హైరైజ్ భవనాల అనుమతులపై కూడా కమిషనర్ దృష్టి సారించారు. మరోవైపు పలు అభివృద్ధి ప్రాజెక్టులపైనా అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం కొనసాగుతున్న మూసీపై అత్యాధునిక వంతెనల నిర్మాణం, పలుచోట్ల చేపట్టిన పార్కుల అభివృద్ధి, వినియోగంలోకి వచ్చిన సైకిల్‌ట్రాక్, ఉప్పల్ స్కైవాక్ తదితర ప్రాజెక్టులను వివరించారు.





అనుమతులపై సమీక్ష..

హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. జీఓ 111 పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణాలపై ఆయన ఆరా తీసినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా భూ వినియోగ మార్పిడి సర్టిఫికెట్‌లను పొందిన కొందరు శంషాబాద్, వట్టినాగులపల్లి, తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్న అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. వివిధ రకాల భవనాలకు అనుమతులను ఇచ్చేందుకు ఎలాంటి నిబంధనలు ఉంటాయనే అంశంపై చర్చించారు. కమిషనర్ స్థాయిలో ఆమోదించాల్సినవి, డైరెక్టర్ల స్థాయిలో ఆమోదించాల్సిన భవనాలపై వివరాలను అడిగారు. కార్యక్రమంలో ప్రణాళికా విభాగం డైరెక్టర్లు, ప్లానింగ్ అధికారులు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ విభాగంపై జరిగిన సమీక్షలో చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నైట్‌షెల్టర్.. నామ్‌కే వాస్తే

- చలికి వణుకుతున్న నిరాశ్రయులు
- పట్టించుకోని బల్దియా యంత్రాంగం
- గ్రేటర్‌లో 200 షెల్టర్‌హోమ్స్ అవసరం
- ఇందులో 10 శాతం మాత్రమే అందుబాటులో

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చలి తీవ్రత పెరిగిపోయింది. రాత్రుళ్లు తలదాచుకునే చోటు లేక బస్టాండ్లలో, రోడ్ల వెంబడి దుకాణాల షెటర్ల ముందు వణుకుతూ కునుకు పట్టని అభాగ్యులెందరో నగరంలో కనిపిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రజలందరికీ రాత్రిపూట ఆశ్రయాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలదే. వాటినే నైట్ షెల్టర్లుగా.. కరోనా కాలం నుంచి షెల్టర్ హోమ్స్‌గా వ్యవహరిస్తున్నారు. నగర జనాభాను బట్టి వీటిని నిర్వహించాలి. ఆ మేరకు గ్రేటర్ నగరంలో 200 షెల్టర్‌హోమ్స్ ఉండాలి. కానీ అందులో పదిశాతం మాత్రమే ఉన్నాయి. మొత్తం 20 షెల్టర్ హోమ్స్‌కుగాను ఎనిమిది షెల్టర్ హోమ్స్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నవే. వాటిని ఆస్పత్రుల్లోని రోగులకు సహాయకులుగా వచ్చిన వారి కోసం వినియోగిస్తున్నారు. అవిపోను మిగిలినవి 12 మాత్రమే. అవి సైతం పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు. అవి ఎక్కడున్నాయో తెలియక పోవడంతో చాలామంది నిరాశ్రయులు వాటిని వినియోగించుకోలేక పోతున్నారు. అందరికీ తెలిసేలా కాకుండా దూరంగా తెలియని ప్రాంతాల్లో అవి ఉండటం ఇందుకు ప్రధాన కారణం. చిరునామా తెలిసిన వాటిల్లో కొత్తవారికి చోటు దొరకడం లేదు. షెల్టర్‌హోమ్స్ గురించి కనీసం చలికాలంలోనైనా విస్తృతంగా ప్రచారం చేసి, ఎక్కడున్నాయో తెలిసేలా ఏర్పాట్లు చేస్తే ఉన్నవాటినైనా ఎక్కువమంది వినియోగించుకునే వీలుంది.


ఉప్పల్‌లోని మహిళల షెల్టర్ హోమ్

పైస్థాయిలోనూ పట్టింపులేదు..

నిరాశ్రయులు ఎక్కువగా కనిపించే బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో సర్వే జరిపి నిరాశ్రయులను దగ్గర్లోని షెల్టర్‌హోమ్స్‌లోకి తరలించే పనిని జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం చేయాల్సి ఉండగా.. ఆ పని జరగడం లేదు. ఏళ్ల తరబడి ఈ విభాగంలో పాతుకుపోయిన వారు తమనెవరూ ఇక్కడి నుంచి కదిలించలేరనే ధీమాతో, ప్రభుత్వాలు మారినా తమనేం చేయలేరనే విధంగా వ్యవహరిస్తున్నారంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. నిరాశ్రయులను గుర్తించి షెల్టర్‌హోమ్స్‌కు తరలించి వారి వివరాలతో డేటాబేస్ నిర్వహించాల్సి ఉండగా, అలా చేయడం లేదు. పైస్థాయి లోనూ పట్టించుకుంటున్న వారెవరూ లేకుండాపోయా రు. ఈ నేపథ్యంలో అవసరమైనన్ని షెల్టర్లు ఏర్పాటు కాలేదు. ఉన్నవాటిలోనూ తగినంత మంది లేరు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నందువల్లే కొన్నింటినైనా ఏర్పాటు చేశారు. అంతే తప్ప నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలనే లక్ష్యంతో జనాభాకనుగుణంగా తగినన్ని కేంద్రాల్ని మాత్రం ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన వాటిల్లోనూ కొన్నింట్లో తగిన సదుపాయాల్లేకుండాపోయాయి.

- ఉప్పల్‌లో స్ఫూర్తి ఎన్జీఓ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళల షెల్టర్‌హోమ్‌లో 25 మందికి వసతి సదుపాయాలు, నిర్వహణ బాగున్నా ప్రస్తుతం అందులో 12 మంది మాత్రమే ఉన్నారు. అందుకు కారణం దాని గురించి తెలియకపోవడం. రాత్రుళ్లలో ఆశ్రయం లేని మహిళల్ని గుర్తిస్తే పోలీసులు తమ కేంద్రానికి తీసుకువస్తారని నిర్వాహకురాలు సుమబాల పేర్కొన్నారు.
- బేగంపేట ఫ్లై ఓవర్ కింద ఉన్న షెల్టర్‌హోమ్‌లో 35 మందికి సదుపాయం ఉండగా హౌస్‌ఫుల్‌గా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇది తెలిసే విధంగా ఉండటంతో ఇది ఖాళీగా ఉండటం లేదు. కొత్తగా వచ్చేవారికి సదుపాయం దొరకడం లేదు.
- నిరాశ్రయులు ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రాంతాల్లో మరిన్ని షెల్టర్‌హోమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఉన్నవాటి గురించీ తగిన ప్రచారం చేసి వాటిని వినియోగించుకునేలా చేయాలని ఎన్జీఓ సంస్థలు చెబుతున్నాయి.

ఎక్కడెక్కడ ఉన్నాయి..?

ఉప్పల్ మార్కెట్ దగ్గరి కమ్యూనిటీ హాల్ (మహిళలు), సరూర్‌నగర్ చౌడీ బిల్డింగ్ (మహిళలు), పేట్లబుర్జు వార్డు కార్యాలయం (పురుషులు), శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీ(పురుషులు), గోషామహల్ అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్ (పురుషులు),గోల్నాక కమలానగర్ కమ్యూనిటీహాల్(మహిళలు), బేగంపేట ఫ్లై ఓవర్ దగ్గర రెండు (పురుషులు), ఫ్లై ఓవర్ కింద ఒకటి (పురుషులు), యూసుఫ్‌గూడ వార్డ్ ఆఫీస్ (పురుషులు), శేరిలింగంపల్లి పాత మున్సిపల్ కార్యాలయం(పురుషులు), ఆర్‌కేపురం బ్రిడ్జి కింద (పురుషులు) షెల్టర్‌హోమ్స్ ఉన్నాయి. రోగుల సహాయకుల కోసం మహవీర్, నిలోఫర్, కోఠి మెటర్నిటీ, ఈఎన్‌టీ, ఉస్మానియా, నిమ్స్, నాంపల్లి ఏరియా ఆస్పత్రుల్లో షెల్టర్ హోమ్‌లున్నాయి. వీటిలో పురుషులు, మహిళలకు సదుపాయం ఉండగా ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో మహిళల కోసం ఉంది.

డిసెంబర్ 31 హద్దు మీరొద్దు

- రాత్రి ఒంటి గంట వరకే న్యూ ఇయర్ వేడుకలు
- పోలీసుల అనుమతి తప్పనిసరి
- మార్గదర్శకాలు జారీ చేసిన సిటీ కొత్వాల్



సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకల బందోబస్తుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. త్రీస్టార్, అంతకు మించి స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్‌లు, బార్‌లు న్యూ ఇయర్ ఈవెంట్స్ నిర్వహణకు ముందస్తు పోలీసు అనుమతులు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకే కార్యక్రమాలు నిర్వహించాలని, సమయం దాటితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నిబంధనలివీ..

- ప్రతి ఈవెంట్ నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. వేదిక ప్రవేశం, నిష్క్రమణ ద్వారాల వద్ద, పార్కింగ్ ప్లేస్ వద్ద సీసీటీవీ కెమెరాలు, రికార్డింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఈవెంట్‌లో అశ్లీల నృత్యాలు, సంజ్ఞలు ఇతరత్రా చర్యలకు పాల్పడకూడదు. 45 డెసిబుల్స్‌కు మించి శబ్దాలు చేయకూడదు. ఈవెంట్‌లోకి ఎలాంటి తుపాకులు, ఆయుధాలను అనుమతించకూడదు. టపాసులు పేల్చకూడదు. సామర్థ్యానికి మించి పాస్‌లు, టికెట్‌లు, కూపన్లు జారీ చేయకూడదు.
- జంటల కోసం నిర్వహించే ఈవెంట్‌లలో మైనర్లను అనుమతించకూడదు. ఈవెంట్‌లలో ఎలాంటి నార్కోటిక్ డ్రగ్స్ వినియోగించకూడదు. నియంత్రించడంలో విఫలమైన యాజమాన్యంపై చట్ట ప్రకారం కఠిన చర్యలుంటాయి. ఎక్సైజ్ విభాగం అనుమతించని సమయానికి మించి మద్యాన్ని విక్రయించకూడదు. మద్యం మత్తులో ఉన్న కస్టమర్లు సురక్షితంగా వారి గమ్యస్థానానికి చేరుకునేందుకు ఈవెంట్ నిర్వాహకులు డ్రైవర్లు, క్యాబ్‌లను ఏర్పాటు చేయాలి. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వాహనదారుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు గరిష్ఠంగా 6 నెలల పాటు జైలు శిక్ష ఉంటుంది.









వీల్‌చైర్లలో వచ్చి.. వినతులిచ్చి..

నగరంలోని ప్రజాభవన్‌కు అర్జీదారులు పోటెత్తారు. మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతులు ఇచ్చేందుకు బారులు తీరారు. ప్రధానంగా దివ్యాంగులు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరు సహాయకులను వెంటపెట్టుకుని వీల్‌ఛైర్లలో వచ్చి, తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వినతిపత్రాలను అందించి ఆదుకోవాలని అధికారులకు మొర పెట్టుకున్నారు. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్







పరారీలో బిగ్‌బాస్ విజేత

- కొనసాగుతున్న గాలింపు
- మూడు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కొమురవెల్లి సమీపంలో ఉన్నట్లు గుర్తింపు ?
- ఫోన్ స్విచ్ఛాఫ్


బిగ్‌బాస్ సీజన్-07 విజేత పల్లవి ప్రశాంత్

బంజారాహిల్స్: పబ్లిక్ న్యూసెన్స్‌కు కారకుడైన బిగ్‌బాస్ సీజన్–7 విజేత గొడుగు పల్లవి ప్రశాంత్ కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. ప్రస్తుతం ఆయన పరారీలో ఉండగా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అతడి అనుచరులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గజ్వేల్ సమీపంలోని కొలుగూరు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్ ఆదివారం రాత్రి జరిగిన బిగ్‌బాస్–7 విజేతగా ఎంపిక కాగా, అమర్ దీప్ రన్నరప్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో ఇద్దరి అభిమానులు పెద్ద సంఖ్యలో జూబ్లీహిల్స్‌రోడ్ నెం.5లోని అన్నపూర్ణ స్టూడియో వద్దకు చేరుకుని నినాదాలు చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అమర్‌దీప్‌ను విజేతగా ప్రకటించ కపోవడంతో ఆయన అభిమానులు గొడవకు దిగారు. మరోవైపు పల్లవి ప్రశాంత్ అభిమానులు వేలాదిగా అక్కడికి చేరుకుని నినాదాలు చేస్తూ అమర్‌దీప్ కారును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాలు పరస్పర దాడులకు దిగడమేగాక అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సులపై రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. బయట గొడవ జరుగుతున్నట్లు గుర్తించిన బిగ్‌బాస్ యాజమాన్యం పల్లవి ప్రశాంత్‌ను స్థానిక పోలీసుల సహకారంతో రహస్య మార్గం నుంచి బయటికి పంపించింది. మళ్లీ ఇటు వైపు రావొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే పల్లవి ప్రశాంత్ ఇటు పోలీసుల ఆదేశాలను, అటు బిగ్‌బాస్ యాజమాన్యం సూచనలను బేఖాతర్ చేస్తూ గొడవ జరుగుతున్న ప్రాంతానికి ఓపెన్ టాప్ జీప్‌పై చేరుకోవడంతో రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరు వర్గాల మద్దతుదారులు రాళ్లు రువ్వుతూ మహిళా కంటెస్టెంట్లపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఇందుకు కారకుడైన పల్లవి ప్రశాంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న పల్లవి ప్రశాంత్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పోలీసులకు దొరక్కుండా పరారయ్యాడు. దీంతో అతడి సోదరుడు పరుశరాములు కోసం పోలీసులు ఒక బృందాన్ని స్వగ్రామానికి పంపించారు. కారు డ్రైవర్ సాయి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పల్లవి ప్రశాంత్ కోసం ప్రత్యేకంగా మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఆయన అనుచరుల ఫోన్ డేటాను సేకరించారు. కొమరవెల్లి సమీపంలోని ఓ గ్రామంలో పల్లవి ప్రశాంత్ ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు అక్కడికి కూడా ఓ బృందాన్ని పంపించనున్నారు. ఇదిలా ఉండగా బస్సులపై రాళ్లు రువ్విన వ్యక్తులను గుర్తించేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇందుకోసం 15 మంది పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను వడపోస్తున్నారు.

ఇద్దరు కారు డ్రైవర్ల అరెస్ట్


సాయి కిరణ్


రాజు

బంజారాహిల్స్: బిగ్‌బాస్ సీజ న్–7 ఫైనల్స్ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద గొడవకు కారణమైన ఇద్దరు కారు డ్రైవర్లను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పల్లవి ప్రశాంత్, అతడి సోదరుడు మనోహర్, స్నేహితుడు వినయ్‌ని నిందితులుగా గుర్తించారు. పోలీసులు వారిస్తున్నా వినకుండా ప్రశాంత్‌ను అక్కడికు తీసుకువచ్చిన కారు డ్రైవర్లు నిజామాబాద్‌కు చెందిన సాయికిరణ్, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన రాజును మంగళవారం అరెస్ట్ చేసిన పోలీసులు వారి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీల సాయంతో ఇతర నిందితులను గుర్తించేందుకు ప్రయత్నాలు చేపట్టారు.

వారికి మోదం.. వీరికి ఖేదం..

- బైక్ ట్యాక్సీలకు 'మహాలక్ష్మి' గండం
- నగరంలో తగ్గిన బైక్ ట్యాక్సీ బుకింగ్‌లు
- కస్టమర్లను ఆకర్షించేందుకు ధరలను తగ్గించిన కంపెనీలు
- ఆదాయం తగ్గడంతో కష్టాల్లో ద్విచక్రవాహన డ్రైవర్లు
- గ్రేటర్‌లో సుమారు 70వేల మంది బైక్ క్యాప్టెన్లు



సాక్షి, సిటీబ్యూరో: 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అన్నట్లుంది తెలంగాణలో బైక్ ట్యాక్సీల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం అమలు చేస్తుండటంతో.. దీని ప్రభావం ప్రత్యక్షంగా ఆటోలు, క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలపై పడుతోంది. మహిళలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించడం చాలా వరకు తగ్గించారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన వారం రోజుల్లోనే గ్రేటర్‌లో 5 లక్షలకు పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. దీంతో ఓలా, ఉబర్, ర్యాపిడో తదితర బైక్ ట్యాక్సీలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాయి. బైక్ ట్యాక్సీల బుకింగ్‌లు తగ్గిపోవడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు బైక్ ట్యాక్సీ కంపెనీలు ధరలను తగ్గించాయి. దీంతో బైక్ క్యాప్టెన్ల ఆదాయం సగానికి పైగా తగ్గిపోయింది.

తగ్గిన ఆదాయం..

ర్యాపిడో, ఓలా, ఉబర్ వంటి అగ్రిగేటర్లు బైక్ ట్యాక్సీ సేవలను అందిస్తున్నాయి. సాధారణంగా ఈ బైక్ ట్యాక్సీలను నిరుద్యోగులు, విద్యార్థులు పార్ట్‌టైం జాబ్‌గా నడుపుతుంటారు. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు 70 వేల మంది బైక్ ట్యాక్సీ క్యాప్టెన్లు ఉండగా.. వీరిలో మహిళా బైక్ క్యాప్టెన్లు 300 నుంచి 400 మంది ఉంటారు. వీరికి కిలోమీటర్ల చొప్పున ఆయా కంపెనీలు బైక్ క్యాప్టెన్లకు కమీషన్ ఇస్తుంటాయి. అయితే మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ఒక్కో క్యాప్టెన్‌కు రోజుకు 20కి పైగా బుకింగ్‌లు వస్తుండేవి. పెట్రోల్ ఖర్చులు పోను రోజుకు రూ.1,000 పైగానే ఆదాయం సమకూరేది. అయితే ఉచిత బస్సు ప్రయాణం అమలుల్లోకి వచ్చాక బుకింగ్‌లు చాలా వరకు తగ్గిపోయాయని ఓలా బైక్ క్యాప్టెన్ శ్రీను తెలిపారు. నష్టాలను పూడ్చుకునేందుకు అగ్రిగేటర్ సంస్థలు కూడా బైక్ క్యాప్టెన్ల కమీషన్లను సగానికి పైగా తగ్గించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కస్టమర్లను ఆకర్షించేందుకు ధరలను తగ్గించాయన్నారు. గతంలో 15–25 కిలో మీటర్ల బుకింగ్‌కు కనిష్ఠంగా రూ.150–180 వరకు ఛార్జీ వచ్చేదని, కానీ ఇప్పుడు రూ.60–80కి మించి రావడం లేదన్నాడు.

మార్గదర్శకాలు రూపొందించాలి..

సాధారణంగా వాహన అగ్రిగేటర్లే ధరలను నిర్ణయిస్తుంటారు. కంపెనీల వద్ద కస్టమర్ల డేటా నిక్షిప్తమై ఉండటంతో ఆల్గరిథం సాంకేతికతతో కస్టమర్ల డేటా, రోజు, డిమాండ్‌ను బట్టి సంస్థలు ధరలను మారుస్తుంటాయని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సల్లావుద్దీన్ తెలిపారు. అందుకే ఆటో, క్యాబ్, బైక్ అగ్రిగేటర్ల ధరలను ప్రభుత్వమే నిర్ణయించాలని, ఇందుకోసం విధానాలు, మార్గదర్శకాలను రూపొందించాలని సూచించారు. ఆటోలు, క్యాబ్‌ల తరహాలోనే బైక్ ట్యాక్సీలను కూడా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావాలని కోరారు.

గ్రేటర్‌లో బైక్ ట్యాక్సీ గణాంకాలివీ :

- ర్యాపిడో: 26 వేలు
- ఓలా: 24 వేలు
- ఉబర్: 20 వేలు

గతం, ప్రస్తుతం బైక్ ట్యాక్సీ ధరలిలా..

- గతంలో 0–5 కి.మీ. రూ.40–50 ; ప్రస్తుతం రూ.25–30
- 15–25 కి.మీ. రూ.150–180 ; ప్రస్తుతం రూ.60–80

(నోట్: సమయం, డిమాండ్‌ను బట్టి ధరలు మారుతుంటాయి)

సీపీని కలిసిన అదనపు సీపీ



సాక్షి, సిటీబ్యూరో: నగర అదనపు సీపీగా (క్రైమ్స్) బాధ్యతలు స్వీకరించిన ఏవీ రంగనాథ్ మంగళవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డిని కలిశారు. బంజారాహిల్స్ లోని ఐసీసీసీలో ఉన్న కమిషనరేట్‌లో సీపీని కలిసిన రంగనాథ్ పుష్ప గుచ్ఛం అందించారు.

నాడు కామర్స్ అధ్యాపకుడు...
నేడు నగర పోలీస్ కమిషనర్


సీపీని సన్మానిస్తున్న ఓయూ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని నాడు కామర్స్ అధ్యాపకులుగా... నేడు సీపీగా కలసుకోవడం ఆనందంగా ఉందని ఓయూ పీఆర్‌ఓ ఆఫీస్ సూపరింటెండెంట్, ఎన్‌జీవో అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం ఓయూ ఉద్యోగ సంఘాల నేతలతో సీపీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఓయూ క్యాంపస్ కాలేజీలో ఎంకాం పూర్తి చేసిన శ్రీనివాసరెడ్డి 1991లో నల్గొండ జిల్లా పీజీ సెంటర్‌లో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారని వివరించారు. అదే కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన తాను శ్రీనివాస్ రెడ్డి ఒకే గదిలో ఉండేవారమన్నారు. 1993లో ఐపీఎస్‌కు ఎంపికైన శ్రీనివాస్ రెడ్డి పోలీసు అధికారిగా వివిధ హోదాల్లో పని చేసి నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ ఉద్యోగ సంఘాల నేతలు శంకరయ్య, అశోక్ కుమార్, నాగరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



మాదాపూర్: అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో అక్రమంగా నిర్మించిన పలు భవనాలను మంగళవారం కూల్చివేశారు. డివిజన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు చందానగర్ డీసీ వంశీకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన కూడలిలో ఉన్న భవనాలను కూల్చివేస్తున్నామన్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా యజమానులు, బిల్డర్లు పట్టించుకోలేదన్నారు. అయ్యప్ప సొసైటీలో పలు అక్రమ నిర్మాణాలను గుర్తించామని, శేరిలింగంపల్లి జోన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు కూల్చివేత పనులను పర్యవేక్షిస్తున్నాయన్నారు. కూల్చివేతల్లో ఏసీపీ రాజ్‌కుమార్, సీపీ మల్లికార్జున్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న మంత్రులకు అభినందన సభ

జర్నలిస్టుల మాక్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి పీవీ రమణరావు

సాక్షి,సిటీబ్యూరో: రవీంద్ర భారతిలో ఈ నెల 21న (గురువారం) మంత్రులకు అభినందన సభ, జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల మాక్స్ హౌసింగ్ సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ ఫౌండర్ మెంబర్ పీవీ రమణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సమాచార శాఖ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ–సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతున్నారన్నారు.ఇదే సమావేశంలో జేఎన్‌జే మాక్స్ హౌసింగ్ సొసైటీ ప్రస్తుత కమిటీ స్థానంలో కొత్త కమిటీ ఎన్నుకునే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో హైదరాబాద్ జర్నలిస్టులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన స్థలాలను జేఎన్‌జే మాక్స్ హౌసింగ్ సొసైటీకి స్వాధీనం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పును అమలు చేయకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి జర్నలిస్టులకు అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును కాలరాసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేపట్టిన పోరాటానికి అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఇంటి స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా స్థలాలు స్వాధీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి కృతజ్ఞతగా అభినందనసభ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య


తారీఖ్ అలీ ఖాద్రీ (ఫైల్)

సంతోష్‌నగర్: ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామచంద్ర నగర్‌కు చెందిన తారీఖ్ అలీ ఖాద్రీ ఆలియాస్ బాబా ఖాన్ (36) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున అతను తన ఇంటి ముందు కూర్చుని ఉండగా అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై కత్తులతో దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబా ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఐ.ఎస్.సదన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. బాబా ఖాన్ సోదరుడు సాధిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్


పోలీసులు అదుపులో నిందితులు

చైతన్యపురి: మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నాగోలు చౌరస్తా సమీపంలో ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను భీమవరానికి చెందిన కునపరాజు లక్ష్మీనరసింహరాజు, హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన జలిమ్ శ్యామ్‌రాయ్ గా గుర్తించారు. వారి నుంచి నిషేధిత ఐదు గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, నాలుగు ఎల్ఎస్‌డి బ్లాట్స్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గోవాలో హబీబ్ అనే వ్యక్తి ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసి వినియోగించటమే కాకుండా నగరంలో అవసరమైన వారికి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం చైతన్యపురి పోలీసులకు అప్పగించగా, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలోనూ వీరిపై కేసులు ఉన్నాయని, ప్రధాన నిందితుడు, గోవాకు చెందిన హబీబ్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాడని..

- యువకుడిపై దాడి
- నిందితులపై కేసు నమోదు

బంజారాహిల్స్ : ద్విచక్ర వాహనం పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఓ యువకుడిని నిర్బంధించి దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాదాపూర్‌కు చెందిన సీహెచ్ అఖిల్ జూబ్లీహిల్స్ రిపీట్ అండ్ రివోల్ట్ పబ్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 11న డ్యూటీకి వచ్చిన అఖిల్ తన పల్సర్ బైక్‌ను పార్కింగ్‌లో ఉంచాడు. మరుసటి రోజు తన వాహనం కనిపించకపోవడంతో పబ్ అకౌంటెంట్స్ సాయితేజ, సాయి బండి రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. వారు స్పందించకపోవడంతో ఈ నెల 13న అఖిల్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించేందుకు పోలీసులు ప్రయత్నించగా అవి పనిచేయడం లేదని సాయి తేజ చెప్పాడు. దీంతో అఖిల్ సమస్యను పబ్ యజమాని దృష్టికి తీసుకెళ్లడంతో అతడిపై కక్ష్య పెంచుకున్న సాయితేజ, సాయి బండిరెడ్డి ఈ నెల 17న సోను అనే వ్యక్తిని పంపి అఖిల్‌ను పిలిపించారు. అనంతరం సోనూ, ఆంటోని, మున్నాలు కలిసి అతడిని సెల్లార్‌లోకి తీసుకురాగా అక్కడే ఉన్న సాయిబండిరెడ్డి, సాయితేజ అతనిపై దాడి చేశారు. వారి నుంచి తప్పించుకున్న అఖిల్ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు..

అత్తాపూర్ పీఎస్‌లో ట్రైనీ ఐపీఎస్‌లు


అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్ అధికారులు

అత్తాపూర్: శిక్షణలో భాగంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న పలువురు ఐపీఎస్ అధికారులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేయనున్నారు. ఢిల్లీకి చెందిన శృష్టి బట్, మధ్యప్రదేశ్‌కు చెందిన సిద్దార్థ్ సింగ్ పోలీసు విధి విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల నమోదు, స్టేషన్‌లో వసతులు, పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న వివిధ వృత్తి నిర్వహణపై వారికి అవగాహన కల్పించారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ హైలైఫ్ ఎగ్జిబిషన్ మంగళవారం హైటెక్‌సిటీలోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. ఈ నెల 21 వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శన ప్రారంభోత్సవానికి సినీనటి స్రవంతి చొక్కారపు, ఇంటర్నేషనల్ మోడల్, సినీనటి గీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో పండుగలు, వేడుకల్లో ధరించే వస్త్రాలు, వెడ్డింగ్ వెరైటీలు, ఆభరణాలను ప్రదర్శనకు ఉంచారు. కొత్త సంవత్సరం ఆరంభం సందర్భంగా ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేందుకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫ్యాషన్ వస్త్రాలు, ఆభరణాలు, డ్రెస్‌మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. హై లైఫ్ ఎగ్జిబిషన్ దేశవ్యాప్తంగా విశేషమైన ప్రాచుర్యం పొందిందని హైలైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ అబే డామినిక్ తెలిపారు.

ప్రేమ రామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారం


ప్రేమా రామమూర్తికి పురస్కారాన్ని అందజేస్తున్న శంకర్ జయంత్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో లతారాజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత విదూషి ప్రేమ రమామూర్తికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేశారు. మంగళవారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ మాట్లాడుతూ.... శాస్త్రీయ సంగీత కళలను కాపాడుకుంటూ ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సంగీతాన్ని స్వర పరుస్తూ గాత్ర వాయిద్యంలో పేరుగాంచిన ప్రేమ రామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ జయప్రద రమామూర్తి సారథ్యంలో నిర్వహించిన వేణుగానం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అశ్విని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు, విశ్రాంత ప్రొఫెసర్ కేవీ.అచలపతి, లతారాజ ఫౌండేషన్ ట్రస్టీ కేకే రాజ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వృత్తి విద్యా ఉపాధ్యాయ సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో విద్యాశాఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరిగా నియమితులైన బుర్ర వెంకటేశంను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అగస్టీన్ ప్రతినిధి బృందంతో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న, రిటైరైన దాదాపు 270 మంది వొకేషనల్/ క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ల మొదటి నియామకపు తేదీని పరిగణలోకి తీసుకుని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ..ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రెటరీ స్పందిస్తూ న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు శ్రీనివాసరావు, లక్ష్మణ్ రావు, ఆర్. నర్సింహారెడ్డి, నర్సింహారావు, అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు అభినందనలు



పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: బీసీ, సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని మంత్రి పొన్నం సూచించినట్లు సీఎన్‌రెడ్డి తెలిపారు. మన్సూర్, లింగమూర్తి, రామకృష్ణ, ఎక్బాల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక–2023 ఈనెల 30న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మంగళవారం వాల్‌పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. 1970 నుంచి 2020 వరకు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఈ మేఘా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొంటారన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ సపోర్ట్‌తో ప్రతి ఏటా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అశోక్ కుమార్, బాస్కర్, మేఘనాథ్, అభిజిత్, ముఖర్జీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఖైరతాబాద్: వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా సీసీరోడ్డు పనులు చేపట్టాలని కార్పొరేటర్ విజయారెడ్డి అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ డివిజన్ రాజ్‌నగర్ హనుమాన్ టెంపుల్ వద్ద జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు మంగళవారం విజయారెడ్డి పరిశీలించారు. న్యాచురల్ స్లోప్‌లో వర్షంనీరు వెళ్లేలా రోడ్డు పనులను చేపట్టాలని, అవసరంలేని నీటి పైప్‌లైన్‌ను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. జీహెచ్‌ఎంసీ అధికారులు చైతన్య, చరణ్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



పర్యటిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: నిరంతరం శ్మశానవాటికను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీ శాఖపై ఉందని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ తెలిపారు. మంగళవారం ఆమె వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ శ్మశానవాటిక, జవహర్‌నగర్, ఈస్ట్ రహమత్‌నగర్, యాదగిరినగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు పలువురు వారి సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. శ్మశానవాటికలో చెత్త రిక్షాల ఏర్పాటు, వ్యర్థాలను పారవేయడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రోడ్ల పక్కన కుప్పలుగా చేసిన వాటిని తొలగించడంలో ఆలస్యం జరుగుతుందని స్థానికులు వివరించారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ శ్మశానవాటికలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి గల్లీలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, రామ్‌కీ సంస్థ ఇన్‌చార్జ్ సిరాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వేణు, ఎస్ఎఫ్ఏలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజ్, పవన్‌ముదిరాజ్, కృష్ణ, సుశీల్, యాదగిరి తదితరులున్నారు.

కృష్ణస్వామి సేవలు మరువలేనివి



హిమాయత్‌నగర్: హైదరాబాద్ నగర తొలి మేయర్, స్వాతంత్ర సమరయోధులు కొర్వి కృష్ణస్వామిముదిరాజ్ సమాజానికి గొప్ప సేవలు అందించారని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. కృష్ణస్వామి 56వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కృష్ణస్వామి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 1957లో కృష్ణస్వామి నగర మేయర్‌గా ఎన్నికై నగరాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. హైదరాబాద్ చరిత్రను తెలుసుకునేందుకు కృష్ణస్వామి రచనలు ప్రామాణిక ఆధారాలుగా నిలబడతాయన్నారు. మేయర్, ఆంధ్ర మహాసభ నిర్వాహకుడు, రచయిత, జర్నలిస్ట్‌గా సేవలు అందించి ప్రజల మన్నలను అందుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోల్ల కరుణాకర్ ముదిరాజ్, అధికార ప్రతినిధులు ఆంజనేయులు, కోటికేరామముదిరాజ్, నాయకులు డాక్టర్ నెహ్రూనాయక్, శ్రీనివాస్, బోయిని ప్రదీప్, ప్రశాంత్, నరసింహగౌడ్ తదితరులున్నారు.

ఉపాధి కోల్పోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

హిమాయత్‌నగర్: మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచితబస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల జీవనోపాధి కోల్పోతున్న ఆటోడ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. హిమాయత్‌నగర్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జేఏసీ కన్వీనర్ బి. వెంకటేశం (ఏఐటీయూసీ) అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి మీటర్ చార్జీలు పెంచి, కొత్తఆటో పెర్మిట్లను జారీ చేయాలని కోరారు. ఆటోలకు ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే భరించి, యాక్సిడెంటల్ బీమా రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు పెంచాలన్నారు. జేఏసీ కో–కన్వీనర్లు కిరణ్, శ్రీకాంత్, మల్లేష్‌గౌడ్, ఎంఏ సలీం, మీర్జా రఫాత్ బైగ్, ఏఐటీయూసీ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు బాబు, జంగయ్య తదితరులున్నారు.



ఫిలింనగర్ కొత్త చెరువు పక్కన నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

నాలాల్లో పూడికతీత పనులు షురూ

● పెద్ద ఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలు ● తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: నాలాల్లో పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన, దుర్గంధంతో పరిసర ప్రాంతాల నివాసితులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. చాలా ప్రాంతాల్లో నాలాలన్నీ చెత్తాచెదారం, వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, బురదతో నిండిపోయి మురుగంతా ఇళ్లను ముంచెత్తుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రమైతే దోమలు స్వైరవిహారం చేస్తూ.. బస్తీవాసులు నరకం చూస్తున్నాయి. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీ మొదలుకుని అంబేడ్కర్‌నగర్, మహాత్మగాంధీనగర్, హకీంపేట, బసవతారకంనగర్ వరకు బస్తీలను ఆనుకుని భారీ నాలా పూర్తిగా మురుగు, బురదతో నిండిపోయింది. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భోలానగర్, ఖాజానగర్, చింతల్‌బస్తీ, ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్, రాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని నాలాలన్నీ వ్యర్థాలతో నిండిపోయాయి. ఎక్కడికక్కడ మురుగు తిష్టవేయడంతో దుర్వాసనలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మహాత్మగాంధీనగర్ బస్తీవాసులు దోమలతో గత రెండు దశాబ్దాల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్‌నగర్‌లో..

బంజారాహిల్స్‌రోడ్‌నెం.13లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో స్థానికుల ఫిర్యాదుల మేరకు నాలాల్లో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గత 6 నెలల నుంచి నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. తాజ్‌బంజారా చెరువులోకి దారితీసే ఈ నాలాలో భారీగా వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగుతో స్థానికులు సావాసం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎట్టకేలకు ఇంజినీర్లు స్పందించారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించడంతో పాటు ప్రత్యేక వాహనాల్లో వీటిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.



అంబేడ్కర్‌నగర్ బస్తీలో నాలాలో జేసీబీ సాయంతో పూడికతీత పనులు

పెట్టుబడులకు 'లియో' మంచి వేదిక



లియో యాప్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: ప్రత్యేక కార్యచరణ, సమావేశాలు, సహకారం కోసం అవకాశాలు మెరుగుపర్చుకోవడం, విజ్ఞానాన్ని పంచుకోవడం, వ్యక్తిగత కనెక్షన్లను విస్తరించుకోవడం లీడర్స్ ఫర్ ఇండియా (లియో) ఉద్దేశమని ఈ– ప్లాట్‌ఫామ్ ద్వారా లియో బజ్ అనే ఫ్లాగ్‌షిప్ ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు లియో సీఈఓ మోహన్ష్ ఎర్ర వెల్లడించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో లియో మొబైల్ అప్లికేషన్‌ను ఆయన ఆవిష్కరించారు. సౌకర్యవంతమైన నెట్‌వర్కింగ్ కోసం ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కొత్త సభ్యులను కలుసుకోవడానికి, పెట్టుబడులు, సహకారం, ఎదగడానికి ఇదొక మంచివేదిక అన్నారు. లియో హైదరాబాద్‌తో పాటు చెన్నై, ఇండోర్, బెంగళూరు, ముంబై, గుర్గావ్, లండన్‌లో కూడా తన కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించుకుందన్నారు. వచ్చే మూడేళ్లలో వేయి మంది సభ్యులతో శక్తివంతమైన సంఘాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

బీజేపీ నేతల పదవులకు రాజీనామా

పార్టీ ఓటమితో నైతిక బాధ్యత వహిస్తున్నామని వెల్లడి



అరుణ్‌కుమార్



మహిపాల్‌రెడ్డి

బంజారాహిల్స్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ.. బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఫిలింనగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఈ మేరకు నగర అధ్యక్షుడు సందీప్‌యాదవ్‌కు రాజీనామా లేఖను అందజేశారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీజేపీ మూడో స్థానంలో నిలిచినందుకు నైతిక బాధ్యత వహిస్తూ.. రాజీనామా చేసినట్లు వివరించారు.

డివిజన్ అధ్యక్షుడు సైతం..

జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి తిరుపతియాదవ్, ఉపాధ్యక్షుడు శశిశేఖర్, బీజేవైఎం ఐటీ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్‌రాజ్, దొడ్డి మల్లేష్‌యాదవ్ తదితరులు బీజేపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ.. తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు మహిపాల్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావుకు తన రాజీనామా లేఖను అందజేశారు. బీజేపీ ఓటమి తనను బాగా కలచివేసిందన్నారు.

తెలి దేవర భానుమూర్తికి సత్కారం



రచయిత, సీనియర్ పాత్రికేయులు భానుమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పంజగుట్ట: వ్యంగ్య పుస్తకాలు రాయడంలో ఆరితేరిన రచయిత తెలి దేవర భానుమూర్తి అని పలువురు వక్తలు అన్నారు. భానుమూర్తి రచించిన 'లత్కోర్‌సాబ్' గ్రంథ పరిచయ సభ మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత సాహిత్య కళా పరిశోధకులు డాక్టర్ జయధీర్ తిరుమల రావు, ఆత్మీయ అతిథిగా మందలపర్తి కిషోర్, గ్రంథ పరిచయం, సీనియర్ పాత్రికేయులు తెల్లా వజ్జల, వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కె.లక్ష్మణ రావు, సభాధ్యక్షత వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షులు వ్యవహరించారు. వారు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ప్రస్తుతం వారు చెప్పే హామీలు, వాగ్దానాలు, నేతల కోతలు వ్యంగ్యంగా ఈ పుస్తకంలో చక్కగా చెప్పారని అభిప్రాయపడ్డారు. ఒక్కో అధ్యాయం ఒక చిన్న నాటకం మాదిరి చెయ్యవచ్చని, ఈ పుస్తకం నుంచి ఎంతో ఔట్‌లెట్ వస్తాయన్నారు.

నిలుద్దాం.. కలిసి నడుద్దాం..!

రేపు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ ఉద్యమ జర్నలిస్టుల సమావేశం

లక్డీకాపూల్: మన హక్కులు మన సంక్షేమమే ధ్యేయంగా నిలుద్దాం.. కలిసి నడుద్దాం నినాదాంపై కదలిరావాల్సిందిగా ఉద్యమ జర్నలిస్టుల సమన్వయకర్త ఎం.ఎం రహమాన్ కోరారు. స్వరాష్ట్రం సాధించి దశాబ్దమైనా గుర్తింపులేని నేపథ్యంలో నూతనంగా ఏర్పడుతున్న మరో వేదికపై ఏకతాటిగా ముందుకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈనెల 21న ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి సుప్రీంకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, పాత్రికేయులు కె.శ్రీనివాస్, సింగరేణి సకలజనుల సమ్మె కన్వీనర్ యం.డీ. మునీర్‌లు పాల్గొనున్నారని చెప్పారు.

సబ్ ప్లాన్ నిధులను సంరక్షించాలి

లిబర్టీ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు యాదగిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయకుండా సంక్షేమానికి వినియోగించకుండా వివిధ పథకాలకు ఖర్చుచేసి దళితుల అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్ శుద్ధికోసం హైదరాబాద్ నగర సుందరీకరణ కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీలకు ఖర్చు చేయకుండా ఆయా పథకాలను దారి మళ్లించిందని యాదగిరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆ వర్గాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసేలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దారి మళ్లించకుండా చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

లిబర్టీ: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జన సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆరు గ్యారంటీలను అమలుచేసి ప్రజల ఆదరణ పొందాలని సూచించారు. మంగళవారం లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు హామీలు అమలు చేస్తూనే ప్రజలు విశ్వసిస్తారన్నారు. కొత్త పథకాలు అమలు కోసం ఆర్థిక వనరులు సమీకరించుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంటుందన్నారు. పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు వేగంగా అమలు చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. విద్య, వైద్యం రోడ్లు తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గం

హిమాయత్‌నగర్ : పార్లమెంటులో భద్రత వైఫల్యాలపై కేంద్రహోంమంత్రి సమాధానం చెప్పాలని ప్రతిపక్ష ఎంపీ లోక్‌సభ, రాజ్యసభలలో ప్రశ్నిస్తే, సమాధానాలు చెప్పలేకనే ఉభయ సభల నుంచి 92 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ అన్నారు. పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్‌కు నిరసనగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పార్లమెంటు బయట నిరసనలను ఉక్కుపాదంతో అణచి వేస్తున్నారన్నారు. మరోవైపు పార్లమెంటులో కూడా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న ఎంపీలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేస్తున్నారన్నారు. కనీసం బిల్లులపై చర్చలు, సవరణలు లేకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను, సాంప్రదాయాలను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నియంతత్వ ధోరణితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలీం, పడాల నళిని, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఇన్‌సైడర్ ఎక్స్ ప్రదర్శన

బంజారాహిల్స్: విద్యార్థులు, ప్రస్తుత డిజైనర్లకు తాము నిర్వహించే ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్–2024 వారి ఉన్నతికి దోహదం చేస్తుందని హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ పల్లవి అంచూరి అన్నారు. మంగళవారం 5వ ఎడిషన్‌ను జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో ఆవిష్కరించారు. వచ్చే ఏడాది జూన్ 28 నుంచి 30 వరకు ఈ ఈవెంట్ జరుగుతుందన్నారు. థీమ్ డిజైన్ స్ట్రీట్ డిజైనర్లు, విద్యార్థులు, ఆర్కిటెక్ట్‌ల కోసం కళలు, చేతి పనులు, విద్యా వర్క్‌షాప్‌ల ప్రత్యేకమైన సమ్మేళనంగా ఉంటుందన్నారు. వృత్తి టార్చ్ బేరర్లు సెట్‌చేసిన సృజనాత్మక ఉదాహరణలను ముందుకు తీసుకెళ్లడానికి వారిని ప్రోత్సహించేందుకు ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. దీనికి పాండ్యా నుంచి 3 వేలమంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డిజైన్ సంబంధిత వాణిజ్య నిపుణులు, బిల్డర్లు ఉంటారన్నారు. ఇది వాణిజ్య ప్రదర్శన దేశ వ్యాప్తంగా ఉన్న హోమ్ చాప్టర్లలో ప్రముఖమైందన్నారు. 150 మంది ఎగ్జిబిటర్లు, 300లకు పైగా బ్రాండ్ల భాగస్వామ్యంతో డిజైన్‌పరిశ్రమలో సరికొత్త ట్రెండ్లను ప్రదర్శిస్తుందన్నారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ నిరూప్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ రాకేష్‌వాసు, కో–కన్వీనర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న టీటీడీ ప్రతినిధులు

బంజారాహిల్స్: టీటీడీ దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా హిమాయత్‌నగర్ టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం భగవద్గీత పోటీలను నిర్వహించారు. 6,7 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి జె. త్రిపుర, ద్వితీయ బహుమతి వంశీదత్త, తృతీయ బహుమతి కీసరగుట్ట టీటీడీ వేద పాఠశాలకు చెందిన కశ్యప్, 8,9 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి భవన్స్‌స్కూల్‌కు చెందిన అక్షయకృష్ణ, తృతీయ బహుమతి శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన శ్రీస్తుతి పురోహిత్, తృతీయ బహుమతి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.మనస్విని గెలుచుకున్నారు. 18 ఏళ్ల లోపు, పైబడిన వారికి బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా విశ్వేశ్వర్‌రావు, కేశవమూర్తి, సదాశివరావు, పినాకిపానిశర్మ, డాక్టర్ సృజనా రంగి సత్యనారాయణ వ్యవహరించారు. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్‌కుమార్, లోకల్ అడ్వయిజరీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ త్రినాథ్‌బాబు, సభ్యుడు రంగు వెంకటేష్‌గౌడ్, సహాయ కార్యనిర్వహణాధికారి చతుర్వేదుల సత్యనారాయణ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ గూడూరు హరినాథ్ ప్రదానం చేశారు.

కబ్జాపై చర్యలు తీసుకోండి



ఎన్బీటీనగర్ అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఇలా..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ అయ్యప్ప దేవాలయానికి చెందిన 900 గజాల దేవాదాయ శాఖ భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు కూల్చివేయాలని ఎన్బీటీనగర్ అయ్యప్ప సేవా సమితి టెంపుల్ సొసైటీ ప్రతినిధులు సికింద్రాబాద్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా ఈ దేవాలయానికి చెందిన ఖరీదైన స్థలాన్ని జీహెచ్‌ఎంసీ సివిల్ కాంట్రాక్టర్ పి.అంజయ్య కబ్జా చేస్తున్నారని, ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు కూడా చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల రాళ్లతో ప్రహరీ నిర్మిస్తూ.. ఆటంకాలు సృష్టించడమే కాకుండా భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని హనుమాన్ దేవాలయం, నాగదేవతా ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా అయ్యప్ప స్వామి ఆలయ స్థలమేనని గతేడాది ఆర్‌జేసీకి కూడా తాము లేఖ రాశామన్నారు. జరిగిందన్నారు.

వైద్యసేవలకు బెడ్లు సిద్ధం

వెంగళరావునగర్: కోవిడ్ మరోసారి తెలంగాణాలో విజృంభిస్తే దాన్ని తట్టుకునేందుకు రోగులకు సంపూర్ణంగా వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకమైన బెడ్లు సిద్ధం చేస్తున్నామని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో మంగళవారం చెస్ట్ ఆసుపత్రి వైద్యులు, వైద్యేతర సిబ్బందితో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. గతంలో మాదిరిగానే తమ ఆసుపత్రి సమర్థవంతంగా కోవిడ్‌ను ఎదుర్కొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోగులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఇక్కడ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

- ఆసుపత్రిలో మొత్తం 20 బెడ్లను ఆడ,మగవారికి ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అవసరాన్ని బట్టి ఈ బెడ్లను మరింతగా పెంచుతామని పేర్కొన్నారు.
- రెగ్యులర్ శ్వాసకోశ వ్యాధిగ్రస్తులకు 280 బెడ్స్ నిరంతరం ఉంటున్నాయని, కాగా కోవిడ్ రోగులు, సాధారణ రోగులకు సేవలు అందించేందుకు 60 మంది వైద్యులు, 120 మంది నర్సులు, 400 వరకు ఇతర సిబ్బంది పీపీకిట్స్, ఆర్టీపీసీఆర్ కిట్స్, మందులు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సప్లై తదితర వైద్యసేవలు అందించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహబూబ్‌ఖాన్

స్పా ముసుగులో అశ్లీల కార్యకలాపాలు

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడి

హిమాయత్‌నగర్: మసాజ్ సెంటర్ పేరుతో చట్ట విరుద్ధ కార్యకలపాలకు పాల్పడుతున్న మసాజ్‌సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. అడ్మిన్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం.9 లోని ఎల్‌కేఆర్ ఆర్కేడ్ ఫ్లాట్ 402లో నిబంధనలకు విరుద్ధంగా 'వేదిక బ్యూటీ కేర్, డే స్పా' పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు మంగళవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం వచ్చింది. వెంటనే ఎస్సై శిరీష ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మసాజ్ సెంటర్‌లో తనిఖీలు చేశారు. నిర్వాహకుడు రాహుల్ సందీప్, రిసెప్షనిస్ట్ మాధురితో కలిసి ఈ స్పాను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా స్పా పేరుతో క్రాస్ మసాజ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పలు ఆధారాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు రాహుల్ సందీప్, రిసెప్షనిస్ట్‌లతో పాటు ముగ్గురు యువతులు, మరో ఇద్దరు కస్టమర్లను అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వక్ఫ్‌భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని మైనారిటీ హక్కుల ఫోరం జేఏసీ చైర్‌పర్సన్ హజ్రా బేగం విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు మహమ్మద్ షాహిద్‌తో కలిసి ఆమె మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలం, వెల్పూర్ గ్రామంలోని సర్వేనంబరు 1299/1, 1299/2, 1299/3లలోని ఈద్గా శ్మశానవాటికకు చెందిన 4 ఎకరాల 12 గుంటల భూమిని కబ్జాదారులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వెల్పూర్ గ్రామంలోని వక్ఫ్‌భూమికి సరిహద్దు గోడ లేకపోవడంతో ఆక్రమణదారులు లాక్కొనేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వక్ఫ్‌బోర్డు అధికారులు సదరు భూమిని సందర్శించి సర్వే చేయించాలన్నారు. ఆ భూమి రక్షణ కోసం కేటాయించిన రూ.8 లక్షలతో భూమిని కాపాడేందుకు వెంటనే సరిహద్దు గోడను నిర్మించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఈ భూముల విషయంలో తగిన చర్యలు తీసుకొని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు.

అసైన్డ్ భూములకు హక్కులపై మరింత స్పష్టత

- హక్కుల కల్పన ఆలస్యమవకుండా ప్రభుత్వం చర్యలు
- అన్ని అంశాలపైనా రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలిస్తూ జీవో నంబర్ 596 జారీ

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చింది. పలు కారణాలతో హక్కులు కల్పించేందుకు వెనుకాడుతున్న నేపథ్యంలో వాటన్నింటిపైనా ఎలా ముందుకెళ్లాలో తెలియజేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం జీవో నంబర్ 596 జారీ చేశారు. పలు జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో ఇటీవల నిర్వహించిన వర్క్‌షాప్‌లో చర్చించిన మీదట అసైన్డ్ భూములపై ఆంక్షలు తొలగించే అంశాలపై తాజా ఆదేశాలు జారీ చేశారు. చుక్కల భూములు, ఈనాం భూములు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, ప్రొవిజనల్ పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ భూములకు సంబంధించి స్పష్టత ఇచ్చారు.

ఈ కేసుల్లో యాజమాన్య హక్కులివ్వాలి

- డీకేటీ రిజిస్టర్, డీకేటీ పట్టా ఆఫీస్ కాపీ, అసైన్‌మెంట్ కమిటీ మినిట్స్ లేకపోయినా వెబ్ లాండ్ అడంగల్, పీఓఎల్ఆర్, పాత అడంగల్, 10 (1) రిజిస్టర్ వంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డులో సంబంధిత రైతు పేరు ఉన్నా, 2017 22ఏ జీవోలు లేక 20 సంవత్సరాల క్రితం జారీ అయిన పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగానైనా సంబంధిత భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి.
- భూ బదలాయింపు (లాండ్ కన్వర్షన్) జరిగి, అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు పూర్తయిన జల వనరుల పోరంబోకు భూములపై యాజమాన్య హక్కులివ్వాలి.
- భూ బదలాయింపు జరగకపోయినప్పటికీ, సుప్రీంకోర్టు ఉత్తర్వులు, హైకోర్టు రిట్ పిటషన్ 140/2022 ఆదేశాల ప్రకారం మినహాయింపు పొందిన భూములకు హక్కులు కల్పించాలి.
- డి పట్టా జారీ అయినా, రికార్డుల్లో ఆ సర్వే నంబర్‌తో సరిపోలకపోతే, వారి ఆధీనంలో ఉన్న భూమి సర్వే నంబర్‌ను నమోదు చేయాలి. అలాంటి భూములకు యాజమాన్య హక్కులు ఇవ్వడం కోసం వారికి భూమి అసైన్ చేసిన పాత తేదీని పరిగణనలోకి తీసుకోవాలి.
- ఖాతా నంబర్ 10 వేల లోపు ఉండి, మిగులు భూమిగా రికార్డయి, అసైన్డ్ భూములుగా నమోదవని వాటిని అసైన్‌మెంట్ రీ వెరిఫికేషన్‌కు పంపాలి.
- అసైన్డ్ భూములైనా ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదుకాని భూములను అసైన్డ్ భూముల జాబితాలో చేర్చేలా దరఖాస్తులను స్వీకరించడానికి ఏపీ సేవా పోర్టల్‌లో ఆప్షన్ ఉంది. ఇలాంటి కేసులను సుమోటోగా స్వీకరించేందుకు జేసీల లాగిన్‌లో అవకాశం కల్పిస్తాం. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఆ భూములకు హక్కులు ఇవ్వాలి.
- ఆర్ఎస్ఆర్‌లో అటవీ భూమిగా నమోదైన భూమి అసైన్‌మెంట్ జరిగి ఆర్ఓఆర్ రికార్డుల్లోనూ నమోదై ఉంటే.. ఆ భూమిని అటవీ చట్టంలోని సెక్షన్ 4(1) కింద నోటిఫికేషన్ జారీ చేయకపోతే హక్కులివ్వొచ్చు.

అప్పులంటూ పచ్చ డప్పు



ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ ధ్వజం

- అనధికారిక డిపాజిట్లు మార్గదర్శిలోనే ఉంటాయ్ రామోజీ!
- ప్రభుత్వాలకు అనధికారిక అప్పులుండవనే ఇంగితం లేదా?
- తప్పుడు కథనాలతో మరోసారి అజ్ఞానాన్ని చాటుకున్నారు
- అప్పులు, పెండింగ్ బిల్లులంటూ ఊహాజనిత ప్రచారాలు
- టీడీపీ హయాం కన్నా ఇప్పుడు అప్పులు తక్కువే..
- ఆస్తుల కల్పనకు వెచ్చించే మూలధన వ్యయం ఇప్పుడు అధికం

సాక్షి, అమరావతి: రాష్ట్ర అప్పులపై ఈనాడు రామోజీ అట్టడుగు స్థాయికి దిగజారి నిరాధార గణాంకాలతో తప్పుడు కథనాలను ప్రచురించారని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ తీవ్రంగా మండిపడ్డారు. అప్పులపై పదేపదే దుష్ప్రచారం చేస్తూ టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ భయపడిందని, కేంద్ర ఆర్థిక శాఖ హెచ్చరించిందని, స్టాక్ ఎక్స్ఛేంజ్ మదుపరులను అప్రమత్తం చేసిందని, ఆర్థిక దిగ్గజాలు భయపడుతున్నారని, ఏపీ అప్పులను చూసి యావత్తు దేశం ఆశ్చర్యపోతోందంటూ వండి వార్చిన కథనాలను చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఆ పత్రికకు ఉన్న ద్వేషం, కక్ష అర్థం అవుతోందన్నారు. ఈనాడు కథనంలో డొల్లతనాన్ని నిరూపిస్తూ.. ఆర్బీఐ, కాగ్ అధికారిక నివేదికలను ఉటంకిస్తూ దువ్వూరి కృష్ణ మంగళవారం సచివాలయంలో మీడియాకు వాస్తవాలను వివరించారు.

అబద్ధాలే.. ఆధారాలేవి?

ఊహాజనిత గణాంకాలతో, లేని అప్పులు ఉన్నాయంటూ ఈనాడు నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలను అచ్చు వేసింది. పచ్చి అబద్ధాల రుణ కంతుడిగా రామోజీ దిగజారిపోయారు. రాష్ట్ర అప్పులు ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక శాఖ నిబంధనల మేరకు పరిమితికి లోబడే ఉన్నాయి. కోవిడ్ ఇబ్బందులు ఎదురైనప్పటికీ టీడీపీ హయాంలో కన్నా ఇప్పుడే రాష్ట్ర ప్రభుత్వ అప్పుల వృద్ధి తక్కువగా ఉంది. మార్కెట్ రుణాలతో పాటు నాబార్డు, విద్యుత్ సంస్థలు.. వివిధ కార్పొరేషన్లు, బాండ్ల గ్యారెంటీతో పాటు గ్యారెంటీ ఇవ్వకుండా తీసుకున్న మొత్తం అప్పులు రూ.6.38 లక్షల కోట్లు మాత్రమే ఉండగా రూ.10.11 లక్షల కోట్ల అప్పులున్నట్లు ఈనాడు ఏ అధికారిక నివేదిక ప్రాతిపదికన రాసిందో చెప్పాలి. ధైర్యం ఉంటే కాగ్, ఆర్బీఐ అధికారిక నివేదికల ప్రకారం నేను వెల్లడించిన గణాంకాలను ప్రచురించాలి. లేదంటే ఈనాడు గణాంకాలకు అధికారిక ఆధారాలు చూపాలని సవాల్ చేస్తున్నా.

పెండింగ్ బిల్లులపై సొంత లెక్కలా?

పెడింగ్ బిల్లులు రూ.21 వేల కోట్లు మాత్రమే ఉన్నాయని ఇటీవల అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రకటించగా రూ.1.70 లక్షల కోట్లు పెండింగ్ బిల్లులున్నట్లు రామోజీ పచ్చి అవాస్తవాలు ఎలా ప్రచురిస్తారు? ప్రభుత్వం బడ్జెట్‌లో చేసే అప్పులతో పాటు గ్యారెంటీతో చేసిన అప్పులు, గ్యారెంటీ ఇవ్వని అప్పులన్నీ కూడా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల మేరకు అసెంబ్లీకి సమర్పించాం. ఈనాడు తనకు నచ్చిన ఊహాజనిత గణాంకాలతో అప్పులపై తప్పుడు కథనాలు రాస్తోంది. అప్పులపై ఎన్నిసార్లు వాస్తవాలు వెల్లడించినా పదేపదే దుష్ప్రచారానికి పాల్పడుతూ టీడీపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోంది.

హెచ్చరికలంటూ అవగాహనారాహిత్యం..

ఆర్బీఐగానీ కేంద్ర ఆర్థికశాఖగానీ అప్పులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించలేదు. నిబంధనల మేరకు అప్పులకు అనుమతిస్తారు. అంతకు మించితే అప్పులు ఇవ్వడం నిలిపేస్తారు. అంతేగానీ హెచ్చరికలు ఉండవు. కనీస అవగాహన లేకుండా రామోజీ రాతలున్నాయి. కేంద్రానికి గానీ రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ అనధికారిక అప్పులు ఉండవనే సంగతి తెలియకపోవడం రామోజీ అవగాహనారాహిత్యానికి నిదర్శనం.

అనధికారిక అప్పులా?

మార్గదర్శి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అనధికారిక డిపాజిట్లు సేకరించడం రామోజీకే చెల్లింది. ప్రభుత్వాలకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అనధికారిక అప్పులు ఇవ్వరనే కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదా? మార్వాడీ వద్దకు వెళ్లి తాకట్టు పెట్టి అప్పులు తీసుకోవడం కేంద్రంతో పాటు ఏ రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యం కాదు. ప్రభుత్వానికి అప్పులు చెల్లించే ఉద్దేశం లేదంటూ మరో అబద్ధాన్ని ఈనాడు అచ్చేసింది. అప్పులను వాయిదాల ప్రకారం ప్రభుత్వాలు తీరుస్తూ ఉంటాయి. ఆర్బీఐ కన్సాలిడేట్ ఫండ్ నుంచి తీసుకుంటుందనే అవగాహన లేకుండా రామోజీ కథనాలున్నాయి.

గత అప్పులకు ఇప్పుడు కోత

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు తక్కువే ఉన్నాయి. వాస్తవానికి గత సర్కారు నిబంధనల కంటే ఎక్కువగా అప్పులు చేస్తే వాటిని ఇప్పుడు కేంద్రం తగ్గిస్తోంది. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ బాండ్ల జారీ ద్వారా రుణం తీసుకోవడానికి సెబీ అనుమతించింది. అయితే అవసరం లేనందున రుణం తీసుకోలేదు. దీన్ని కూడా వక్రీకరిస్తూ రాజ్యాంగ విరుద్ధం అన్నట్లు తప్పుడు కథనాలు ప్రచురించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పరిమితికి లోబడే గ్యారెంటీలు

గ్యారెంటీలు రాష్ట్ర ఆదాయంలో 80 శాతమే ఉన్నాయి. ఇవి నిబంధనల కన్నా తక్కువగానే ఉన్నాయి. పెండింగ్ బిల్లుల విషయంలో ఈనాడు పచ్చి అబద్ధాలను ప్రచురించింది. జీతాలు గానీ పెన్షన్లు గానీ ఆగలేదు. అలాంటప్పుడు ఇన్ని పెండింగ్ బిల్లులు ఎలా ఉంటాయి? కోవిడ్ కారణంగా రాష్ట్రం రూ.66 వేల కోట్లు ఆదాయం కోల్పోయినప్పటికీ టీడీపీ హయాంతో పోలిస్తే తక్కువగానే అప్పులు చేసింది. గత సర్కారు హయాంతో పోల్చి తే ఆస్తుల కల్పనకు వెచ్చించే మూల ధన వ్యయం ఇప్పుడే ఎక్కువగా ఉంది.



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో భాగంగా శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామివారికి తిరుప్పావై నివేదించిన అనంతరం శ్రీవారి మూలవిరాట్టును పట్టు పరదాలతో కప్పివేశారు. ఉదయం ఆరు గంటలకు ఆలయ శుద్ధి కార్యక్రమం జరిపారు. తర్వాత పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అష్టదళ పాదపద్మారాధన సేవ రద్దయింది.

రాష్ట్రం గజగజ

- ఏపీలో అన్ని జిల్లాల్లోనూ పెరిగిన చలి తీవ్రత
- సగటున 2 డిగ్రీలు తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చలి పెరుగుతోంది. అన్ని జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో ఉత్తరాంధ్రలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఈసారి ఉత్తరాంధ్రతోపాటు అన్ని జిల్లాల్లోనూ 2 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల 9 నుంచి 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కుంతలంలో 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ ఇంకా తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అరకు ఏజెన్సీలో ఈ నెలాఖరుకు ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గుతాయని, జనవరి మొదటి, రెండు వారాల్లో 4 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గుతాయని, దీని వల్ల చలి తీవ్రత ఇంకా పెరిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

పగటి ఉష్ణోగ్రతలు సైతం తక్కువగానే...

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా చాలా వరకు తగ్గాయి. సాధారణంగా ఈ సమయంలో 26 నుంచి 28 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు ఉండాలి. ఇప్పుడు 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గాయి. ఉపరితల ఆవర్తనాల వల్ల చలి ప్రభావం ఇంకా పెరుగుతోంది. లక్షద్వీప్, తమిళనాడుతోపాటు అరేబియా సముద్రంలో ఆవర్తనాల వల్ల దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. ఈ ఆవర్తనాల ప్రభావంతో కర్ణాటక, పుదుచ్చేరి, తమిళనాడు ప్రాంతాల్లో వర్షాలు పడతాయని, రాయలసీమలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని పేర్కొంటున్నారు. కాగా, ఈ నెలాఖరులో బంగాళాఖాతంలో తమిళనాడులోని మహాబలిపురం వద్ద తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జనవరి 4వ తేదీన బంగాళాఖాతంలో మరో తుపానుకు అవకాశం ఉందని వెల్లడించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

నగర వార్తలు

సృజనాత్మకతను వెలికితీసేందుకే చిత్రలేఖన పోటీలు



బంజారాహిల్స్: దివ్యాంగులకు ప్రత్యేకంగా బంజారా హిల్స్‌లోని ముఫకంజా కాలేజీలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటేషన్‌లో నగరంలోని 8 పాఠశాలలకు చెందిన దివ్యాంగ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. డెఫ్ ఎనేబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 110 మంది దివ్యాంగ(బధిర) విద్యార్థులు పాల్గొని పెయింటింగ్స్ వేసి అబ్బురపరిచారు. ఆలోచనాత్మకమైన చిత్రాలతో ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఫౌండర్ సందీప్, డైరెక్టర్ రమ్య తెలిపారు. ఉత్తమ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ కేన్సర్ సెంటర్‌లో అత్యాధునిక చికిత్స

గచ్చిబౌలి: కాంటినెంటల్ కేన్సర్ సెంటర్‌లో కేన్సర్ బాధితులకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నామని కాంటినెంటల్ హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గురు ఎస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో అతి ఖరీదైన కేన్సర్ చికిత్సను తమ ఆస్పత్రిలో అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే జనవరిలో కేన్సర్‌కు సంబంధించి మరో ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. పేద రోగులను ఆదుకునేందుకు మార్చిలో కాంటినెంట్ హెల్త్ ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం కాంటినెంటల్ కేన్సర్ సెంటర్ డాక్టర్ల బృందం పేషెంట్లకు ఎలాంటి చికిత్స అందించాలో నిర్ణయిస్తుందన్నారు. మెడికల్ ఆంకలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ ఇటీవల ఓ యువతి మెదడు కేన్సర్‌తో బాధపడుతూ తమ సెంటర్‌కు వచ్చిందన్నారు. జన్యు పరివర్తనలో వచ్చిన మార్పుల కారణంగా మెదడులో బయాప్సీ చేయలేని 'గ్లియోబ్లాస్టోమా' ట్యూమర్ ఉందని డాక్టర్ల బృందం గుర్తించిందన్నారు. మెదడు ద్రవంలో ఉన్న కేన్సర్ కణాలు, రోగ నిరోధక కణాలను సేకరించి రెగ్యులేటరీ ఆమోదించిన పద్ధతిలో వ్యాక్సిన్ తయారు చేశామన్నారు. డెండ్రీటిక్ సెల్ థెరపీ ద్వారా అందించిన సరికొత్త చికిత్స ఆమెకు మంచి ఫలితాన్నిచ్చిందన్నారు. చికిత్స అనంతరం రోగి నాణ్యమైన జీవితాన్ని గడిపేందుకు వీలుంటుందన్నారు. పెద్ద ప్రేగు, అండాశయం, ప్రోస్టేట్, ఊపిరితిత్తుల కేన్సర్‌కు రూ.6 నుంచి రూ.8 లక్షల లోపు ఈ థెరపీని అందిస్తామన్నారు. సర్జికల్ ఆంకలజిస్ట్ డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ ఓ వివాహితకు కడుపులో ట్యూమర్‌తో బాధపడుతూ తమ దగ్గరకు వచ్చిందన్నారు. ఆమె గర్భ సంచికి ఇబ్బంది లేకుండా 15 కిలోల జాయింట్ రియోమైలోమా ట్యూమర్‌ను తొలగించినట్లు తెలిపారు. ఆమె ఊపిరితిత్తుల్లోనూ ట్యూర్ అనవాళ్లు ఉన్నాయని, వాటి వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వారం రోజుల్లో పేషెంట్ పూర్తిగా కోలుకుందన్నారు. సమాజంలో కేన్సర్ పట్ల ఉన్న భయాన్ని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అజయ్ రెడ్డి, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ గురు ఎస్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, జగన్నాథ్ తదితరులు

సికింద్రాబాద్‌లో ఫెర్నాండెజ్ ఆసుపత్రి ప్రారంభం

బన్సీలాల్‌పేట్: మహిళా, నవజాత శిశు సంరక్షణ వైద్య రంగంలో ప్రసిద్ధిగాంచిన ఫెర్నాండెజ్ ఆసుపత్రి సికింద్రాబాద్‌లో మరో ఆసుపత్రిని ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూఎస్ కాన్సులేట్ జెన్నిఫర్ లార్సన్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్‌తో కలిసి మంగళవారం ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఎంతో మంది తల్లులు, నవజాత శిశు సంరక్షణ కోసం మెరుగైన వైద్య సేవలను అందిస్తూ నగరంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళలు, నవజాత శిశు సంరక్షణ సేవలో 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్, ఆమె బృందాన్ని అభినందించారు. డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ అధునిక వైద్య ఆరోగ్య సేవలతో ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఎంతో మంది మహిళలు, నవజాత శిశువులకు కొత్త జీవితాన్ని ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన వైద్య సేవలతో ఎంతో మంది రోగుల ఆదరాభిమానాలను చూరగొన్నట్లు తెలిపారు. నిష్ణాతులైన వైద్య సిబ్బంది అంకితభావంతో రోగులకు సకాలంలో మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. రానున్న కాలంలో అత్యంత నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి సికింద్రాబాద్‌లో ఫెర్నాండెజ్ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఆధునాతనమైన యూఎస్‌జీ వైద్య పరికరాలు, డాప్లర్, సిమ్యులేటర్, ఎన్ఐబీపీ, ఎలక్ట్రోథెరపి మెషీన్, బాడీ కంపోజిషన్ ఎనలైజర్, ఆప్తాల్మాలజీ, డెంటల్ కేర్ వంటి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పిడియాట్రిషన్ డాక్టర్ ప్రమోద్ గద్దం తదితరులు పాల్గొన్నారు.



ఫెర్నాండెజ్ ఆసుపత్రిని ప్రారంభించిన యూఎస్ కాన్సొలెట్ జెన్నిఫర్ లార్సన్

ఆకట్టుకున్న 'వీల్ చైర్ సల్సా'

- విభిన్న కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న పేషెంట్లు
- చక్రాల కుర్చీలో కూర్చునే రోగుల ఆటపాటలు

గచ్చిబౌలి: దీర్ఘకాల చికిత్సలు అవసరమైన, వైకల్యం ఉన్న వారిలో పెరిగే డిప్రెషన్‌ను అధిగమించి వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఉచ్చ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ సంస్థ తమ గచ్చిబౌలి కేంద్రంలో మంగళవారం 'వీల్ చైర్ సల్సా' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫిజియోథెరపీ తీసుకురాగల సానుకూల మార్పులను ఆహ్వానించేలా, . ఫిజియోథథెరపీతో పాటు నృత్యాన్ని కూడా కలగలిపి ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేయడం విశేషం. దీనితో పాటూ క్రిస్మస్ వేడుకలను కూడా నిర్వహించారు. దీనిలో భాగం అక్కడ ఆశ్రయం పొందుతున్నవారిని ఆప్యాయంగా పలుకరిస్తూ కరచాలనం చేస్తూ శాంతాక్లాజ్ సరదాగా సందడి సృష్టించింది. ఈ సందర్భంగా ఉచ్చ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ డైరెక్టర్, డాక్టర్ విజయ్ బత్తిన మాట్లాడుతూ సాధారణంగా రోగులు వేసుకునే లేత నీలిరంగు, ఇతర దుస్తులు కాకుండా తమ కిష్టమైన రంగురంగుల దుస్తులు వేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొని తమ టాలెంట్‌ను బయటపెట్టారన్నారు. సల్సా డ్యాన్స్, చిన్న చిన్న గేమ్స్ ఆడటం, పాటలు పాడటం లాంటివన్నీ చక్రాల కుర్చీలో కూర్చునే చేయడం విశేషమన్నారు. ఫిజియో. థెరపీ అంటే ఒకే రకమైన వ్యాయామాలు పదేపదే చేయిస్తుంటారని, దానితో పండుగలు ఇతర వేడుకల్లో పాల్గొనలేక నలుగురితో కలవకపోవడంతో డిప్రెషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆ మూస దోరణి అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు.



'వీల్ చైర్ సల్సా' కార్యక్రమంలో పాల్గొన్న పేషెంట్లు

'ఫాసిస్టు పాలనలో మనిషిని మనిషిగా గుర్తించరు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఫాసిస్టు పాలనలో మనిషిని మనిషిగా గుర్తించరని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించకపోతే మళ్లీ ఫాసిస్టు పాలన వస్తుందన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మతతత్వ శక్తులు అధికారంలోకి వస్తే వ్యవస్థీకృతమైన నియంతృత్వం ఉంటుందన్నారు. బీజేపీ పాలనలో వచ్చాక దళితులు, మైనార్టీలకు రక్షణ రువైందని, తినే ఆహారం మీద కూడా ఆంక్షలు విధిస్తూ దాడులు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రజల పక్షాన పోరాడే పౌర హక్కుల సంఘం నేతలు, కవులు, కళాకారులపై ఉపా లాంటి దేశద్రోహం కేసులు బనాయించి చిత్ర హింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వరవరరావు, సాయిబాబా తదితర మేధావులు నేటికి జైలులో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాసిస్టు నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్లు రవిచందర్, అంబటి నాగయ్య, జ్యోతి, కన్నగంటి రవి, ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, ప్రొఫెసర్ వినయ్, ప్రొఫెసర్ డి.నర్సింహ్మారెడ్డి, ప్రముఖ సైంటిస్టు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధిని కాపాడాలి

- 'మహాలక్ష్మి' పథకంపై పునరాలోచించాలి
- బీఎంఎస్ జాతీయ కార్యదర్శి అల్లూరి రవిశంకర్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంపై పునరాలోచన చేయాలని, ఆటో డ్రైవర్ల ఉపాధిని కాపాడాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి అల్లూరి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంగళవారం మహాలక్ష్మి పథకాన్ని నిరసిస్తూ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ ఎదుట తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. అనంతరం యూనియన్ నేతలు బస్‌భవన్‌లో ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్లూరి రవిశంకర్ మాట్లాడుతూ ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆటో డ్రైవర్ల పొట్టగొట్టిందని ఆరోపించారు. వెంటనే ఈ పథకాన్ని రద్దు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఓలా, ఉబర్, రాపిడో బైకుల కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించేందుకు వివిధ ప్రభుత్వం విభాగాల్లో ఆటోలను వినియోగించుకోవాలని కోరారు. లేదా వారికి రోజు రూ.వెయ్యి సంపాదించుకునేలా ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెహికిల్ స్క్రాప్ పాలసీని అమలు చేసి అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ టాక్సీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు నందకిషోర్, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

గూగుల్ కంటే గురువే ముఖ్యం

మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు

రాయదుర్గం: విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని స్పర్శ్ హాస్పిస్ ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో 'ఇన్‌స్పైరింగ్ యంగ్ లీడర్స్ ఫర్ ఏ బ్రైట్ టుమారో' అంశంపై విద్యార్థులు, యువతతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న తర్వాత తమకు అందుబాటులో ఉండే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను స్ఫూర్తిగా తీసుకుని వారిలోని మంచితనాన్ని అలవర్చుకోవాలన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో తమ పార్టీ అధికారంలో లేదని, ఆ తర్వాత ఒక సిద్ధాంతం కోసం రాజకీయాల్లో కొనసాగుతూ అధ్యక్ష స్థానం వరకు ఎదిగానన్నారు. ఉప రాష్ట్రపతిగా పదవీవిరమణ చేశాక రాజకీయాలకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాజకీయాల్లో పార్టీలు మారే సంస్కృతి పోవాలని, ఒక పార్టీలో ఉండి గెలిస్తే అందులోనే కొనసాగే సిద్ధాంతం రావాలన్నారు. పల్లెటూరులో పుట్టిన తాను నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెలుగు మీడియంలో చదువుకుని భారత ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగానన్నారు. మాతృభాషనే పునాది అని దానిని ఎప్పుడూ మరిచిపోరాదని సూచించారు.



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు

గురువును గౌరవించాలి...

ప్రస్తుతం అంతటా ప్రాధాన్యత సంతరించుకున్న గూగుల్ కంటే గురువే ఎంతో ముఖ్యమని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. చదువు చెప్పిన గురువు, జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి, మాతృదేశాన్ని, మాతృభాషను ఎప్పుడూ మరిచిపోరాదని సూచించారు. ఎంత స్థాయికి ఎదిగినా ఈ అంశాలను మరిచిపోకూడదనే భావన అందరిలోనూ ఉండాలన్నారు. రాబోయే రాజుల్లో నాలెడ్జి ఎకానమికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెలివి ఉంటేనే సంపాదన వస్తుందన్నారు. తెలివిని, విషయ పరిజ్ఞానాన్ని ఆర్జించిన తర్వాతే సంపాదనపై దృష్టి పెట్టాలని, అప్పుడే ఆర్థికంగా శక్తి వంతంకావడానికి, సొంత కాళ్లపై నిలబడేందుకు అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు, యువత విదేశాలకు వెళ్ళండి, నేర్చుకోండి, సంపాదించండి, తిరిగి మాతృదేశానికి రండని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్,టివిరెడ్డి, నీరజా రామారావుతోపాటు పలువురు డాక్టర్లు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 20-12-2023

పాతికేళ్లకు పైగా ఫిట్‌నెస్ రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు యాస్మిన్ కరాచీవాలా. బాలీవుడ్ తారలకు ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఉన్న యాస్మిన్‌కి ముంబైతో పాటు విదేశాల్లోనూ ఫిటెనెస్ స్టూడియోలు ఉన్నాయి. ఫిట్‌నెస్‌కు సంబంధించిన తన అనుభవాలను పుస్తకాల రూపంలో తీసుకు వచ్చి రైటర్‌గానూ గుర్తింపు పొందారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రివల్యూషనైజ్ యువర్ వర్కౌట్ కార్యక్రమానికి వచ్చిన ఈ ముంబై ఫిట్‌నెస్ ట్రైనర్ '53 ఏళ్ల వయసులోనూ చాలా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నారు ఆ సీక్రెట్ ఏంటో మాకూ చెప్పండి' అంటే ఎన్నో విషయాలను మన ముందుంచారు.


యాస్మిన్ కరాచీవాలా

ఫిట్‌నెస్ మ్యాజిక్ పిల్ ఏమీ కాదు

''(నవ్వుతూ) నాకు ముగ్గురు పిల్లలున్నారు. పెద్దబ్బాయికి 26, చిన్నబ్బాయికి 23 ఏళ్లు. అమ్మాయికి పెళ్లైంది. 26 ఏళ్లుగా వ్యాయామంపై దృష్టి పెడుతున్నాను. వ్యాయామాలు నేర్పిస్తున్నాను. సరైన ఆహారం, సరైన వ్యాయామం, సరైన జీవనశైలిని అలవర్చుకుంటే ఎవ్వరైనా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉండచ్చు. ఫిట్‌నెస్ అనేది కేవలం బరువు తగ్గించుకోవడానికి ఉపయోగించే మ్యాజిక్ పిల్ కాదు షాప్‌కి వెళ్లి కొనుక్కోవడానికి. ఫిట్‌గా మారాలంటే కృషి చేయాల్సిందే.



■ కృషికి మూలం

నన్ను చూసి మా అబ్బాయిలు ఇద్దరూ ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి పెంచుకున్నారు. వాళ్లు ఈ రంగంలో బిజీగా ఉన్నారు. నచ్చింది చేయడం మన జీవనశైలి అవుతుంది. ఇష్టం లేనిది చేయడం భారం అనిపిస్తుంది. ఫిట్‌నెస్ అనేది ట్రెండ్ కాదు. అదొక జీవన విధానం. మనం దానిని ఎలా తీసుకుంటే, అది మనల్ని అలా మార్చేస్తుంది. నేను ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఉండాలని ఎప్పుడూ ప్లాన్ చేసుకోలేదు. నా చిన్నతనం నుంచి నేను గమనించినవాటిలో మా నాన్న రోజూ వాకింగ్, అమ్మ యోగా చేయడం చూసేదాన్ని. కానీ, (నవ్వుతూ) నేను మాత్రం చేసేదాన్ని కాదు. ఎవ్వరూ ఇష్టపడని బద్ధకిష్టులలో నేనూ ఒకరిగా ఉండేదాన్ని. డిగ్రీ పూర్తయిన కొన్నాళ్లకు ఓ రోజు నా ఫ్రెండ్ హెల్త్ క్లబ్‌కి తీసుకెళ్లింది. అయిష్టంగానే అక్కడికి వెళ్లాను. ఆ హెల్త్‌క్లబ్‌కు వెళ్లే ముందు వరకు ఎన్నడూ వ్యాయామం చేసింది లేదు. ఏదో ఒక సాకుతో ఫిట్‌నెస్ యాక్టివిటీస్‌కి దూరంగా ఉండేదాన్ని. అలాంటిది సరదాగా హెల్త్ క్లబ్‌లో చేసిన ప్రయత్నాలు దారిలో పడేలా చేశాయి. అప్పటినుంచి ఇన్నేళ్లుగా నన్ను నేను మలుచుకుంటూ ఇంకొందరిని మారుస్తున్నాను.

■ చురుకైనా మార్పులంటే..

ఫిట్‌గా ఉండటానికి, వ్యాయామం ప్రారంభించాలంటే ముందు మన శరీర బలాన్ని అదేవిధంగా పరిమితులను అర్థం చేసుకోవాలి. తప్పనిసరిగా కృషి చేయాలనే జిజ్ఞాసను, నిబంధననూ బ్రెయిన్‌కు అందించాలి. మనల్ని మనం ఎలా చూసుకోవాలనుకుంటున్నామో ముందు దానిని గుర్తించాలి. అప్పుడు సరైన కృషి చేయగలం. కొందరు జిమ్‌కి వెళితే వ్యాయామం సాధ్యం అనుకుంటారు. ఇంకొందరు నాకు సినిమా తారల్లాంటి శరీరం కావాలి అని కలలు కంటుంటారు. ఇలాంటివారు తమ రోజువారి యాక్టివిటీలో మార్పులు చేసుకోవాలి. బద్ధకం పోవడానికి, చురుగ్గా మారడానికి స్పోర్ట్స్ హాబీని పెంచుకోవాలి. ఫిట్‌నెస్, వాకర్స్ .. వంటి గ్రూపుల్లో చేరాలి. ఏదోవిధంగా ప్రతిరోజూ చురుగ్గా ఉండేలా మార్పులు చేసుకోవాలి. వీటితోపాటు రోజువారీ వదుల్చుకోలేని కొన్ని విషాలకు దూరంగా ఉండాలి.

■ ఎలాంటి విషాలు..

చక్కెర క్యాన్సర్‌కు ఆహారం. అంతేకాదు, అనేకవ్యాధులకు ప్రధాన కారణం కూడా. చాలా మంది ఉదయాన్నే షుగర్ కలిపిన టీ లేదా కాఫీతో రోజును మొదలుపెడతారు. అదే అనారోగ్యాలకు దగ్గర చేస్తుంది. అందుకని, ముఖ్యంగా రిఫైన్డ్ షుగర్‌ని పూర్తిగా దూరం పెట్టాలి. దీనికి బదులు బెల్లం, తేనె తీసుకోవచ్చు. ఇక నూనెలో వేయించిన సమోసాలు, బోండాలు.. వంటి వేపుడు పదార్థాలు తీసుకోకూడదు. వేడుకల సమయాల్లో 'ఏముందిలే, ఈ ఒక్కరోజుకు అంటూ ఐస్‌క్రీమ్, షుగర్ బేస్ట్ వంటి ఎన్నో పదార్థాలు తీసుకుంటూ ఉంటారు. ఇవన్నీ శరీరానికి హాని చేసేవే.

■ సవాళ్లను అధిగమించాలంటే..

నాకు ముంబై, గుర్గావ్, ఢిల్లీ, ఇండోర్, ఢాకా, దుబాయ్‌లలో ఫిట్‌నెస్ స్టూడియోలు ఉన్నాయి. ఇంకా మరి కొన్ని ఫిట్‌నెస్ స్టూడియోలు ప్రారంభించాలనే లక్ష్యంగా ఉన్నాను. వ్యాయామం మొదలుపెట్టిన రోజున ఇవేవీ అప్పుడు అనుకోలేదు. బలం ఎంత అనేది బరువులు ఎత్తడంలో మాత్రమే కాదు మన లోపల ఉన్న శక్తిని గుర్తించాలి. అప్పుడు సవాళ్లను అధిగమించడం కూడా సులువు అవుతుంది. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ మనల్ని శక్తి-అభివృద్ధి వైపుగా నడిపిస్తుంది. ఒక్కరోజులో ఏదీ మారదు. మనం ఎంచుకున్న మార్గంలో నిరంతరం కృషి చేస్తుంటే విజయం సొంతం అవుతుంది. శారీరక వ్యాయామం మైండ్‌ను కూడా చురుగ్గా ఉంచుతుంది కాబట్టి వాయిదా వేయకుండా ఈ రోజే దినచర్యలో భాగం చేసుకోండి'' అని వివరించారు ఈ ఫిట్‌నెస్ ట్రైనర్.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: నోముల రాజేష్ రెడ్డి

నంబర్ వన్ ట్రైనర్

కత్రీనా కైఫ్, దీపికా పదుకొణె, కరీనా కపూర్.. వంటి ప్రముఖ బాలీవుడ్ తారలకు నంబర్‌వన్ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా. జర్మన్ పిలేట్స్ కాన్సెప్ట్‌ను మన దేశంలో మొదటిసారి ప్రవేశపెట్టి, బీఎఎస్‌ఐ సర్టిఫికెట్ పొందింది. ఎన్నో ఫ్యాషన్ అండ్ బ్యూటీ అవార్డ్‌లను సొంతం చేసుకోవడంతో పాటు వరల్డ్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డ్‌ను అందుకున్న ఘనత యాస్మిన్‌ది. స్కల్ప్ అండ్ షేప్, పర్‌ఫెక్ట్ 10 పేరుతో తీసుకొచ్చిన పుస్తకాలు పాఠకులకు ఫిట్‌నెస్ జ్ఞానాన్ని అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

● ముగ్గు-ముచ్చట


కె.అలేఖ్య
మదీనగూడ
హైదరాబాద్


18 చుక్కలు
10 వచ్చేవరకు


9 చుక్కలు
ఎదురు చుక్క 1 వచ్చేవరకు


ఎం. విజయలక్ష్మి
ముంగమూరు డొంక
ఒంగోలు

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

మేం రాణిస్తాం



'అనుకున్న టైమ్‌కి షూటింగ్ పూర్తి కావాల్సిందే... ప్లాన్ తప్పకూడదు' అని హుకుం జారీ చేయాలంటే చేసే పని మీద ప్రేమ, శ్రద్ధ... ఈ రెంటికీ మించి ధైర్యం, ఆత్మవిశ్వాసం లాంటివి కూడా ఉండాలి. ముఖ్యంగా 'మేల్ డామినేటెడ్' ఇండస్ట్రీస్‌లో ఒకటైన సినిమా పరిశ్రమలో 'ఫీమేల్ ప్రొడ్యూసర్' రాణించాలంటే తెగువ కావాలి. అవసరమైనప్పుడు రాణిలా హుకుం జారీ చేయాలి. సున్నితంగా పనులు చక్కబెట్టడంతో పాటు కఠినంగానూ ఉండాలి. అలా రెండు రకాలుగా ఉంటూ... 'మేం రాణిస్తాం' అంటూ ఈ ఏడాది నిర్మాణ రంగంలోకి వచ్చిన కొందరు ఫీమేల్ ప్రొడ్యూసర్ క్వీన్స్ గురించి తెలుసుకుందాం.




● సమంత

హీరోయిన్‌గా యాభైకి పైగా సినిమాలు చేశారు సమంత. అగ్రశ్రేణి నటిగా ప్రేక్షకులు కితాబులిచ్చారు. ఇప్పుడు 'ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారామె. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, అర్థవంతమైన కథలను ఈ నిర్మాణ సంస్థ వేదికగా ప్రేక్షకులకు చెప్పాలనుకుంటున్నామని సమంత పేర్కొన్నారు.


● విద్య

● ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు కుమార్తె హన్షితా రెడ్డి తండ్రి బాటలో నిర్మాత అయ్యారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు ఇప్పటికే 50కి పైగా సినిమాలు నిర్మించారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రాల నిర్మాతగా ఆయనకు పేరుంది. ఇక 'దిల్'రాజు ప్రొడక్షన్స్ స్థాపించి 'ఏటీఎమ్' వెబ్ సిరీస్ నిర్మించిన హన్షిత తొలిసారి 'బలగం' సినిమా నిర్మించి, బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా హాస్యనటుడు వేణు యెల్దండి దర్శకునిగా మారారు. ఈ ఏడాది మార్చి 3న విడుదలైన ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. అన్నట్లు.. 'బలగం'కి హర్షిత్ రెడ్డి మరో నిర్మాత. ఇక ఆ మధ్య రెండు చిత్రాలు ఆరంభించిన ఈ నిర్మాతలు మంగళవారం మరో చిత్రాన్ని ఆరంభించారు.

● ప్రముఖ నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) కుమార్తె హారిక సూర్యదేవర 'మ్యాడ్' చిత్రంతో నిర్మాతగా పరిచయమయ్యారు. రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, శ్రీ గౌరీప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ కీలక పాత్రల్లో నటించారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ అక్టోబర్ 6న రిలీజై, హిట్‌గా నిలిచింది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను బాగా నవ్వించింది. తొలి చిత్రంతోనే అభిరుచి ఉన్న నిర్మాత అనిపించుకున్నారు హారిక.

● తండ్రి నిమ్మగడ్డ ప్రసాద్ సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మేన్. ఇక కూతురికి సినిమాలంటే ప్యాషన్. ఆ ఇష్టంతో 'మంగళవారం' సినిమాతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి, తొలి విజయం అందుకున్నారు స్వాతీ రెడ్డి. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, ఎం. సురేష్ వర్మ నిర్మించిన ఈ సినిమా గత నెల 17న విడుదలై హిట్‌గా నిలిచింది.



● మెగా కుటుంబం నుంచి వచ్చిన నిహారిక (నాగబాబు కుమార్తె) అటు నటన, ఇటు ప్రొడక్షన్ రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకూ పలు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ నిర్మించిన ఆమె తొలి సారి ఫీచర్ ఫిల్మ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా యాదు వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. అంతేకాదు.. పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లు పరిచయమవుతుండటం విశేషం. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్నారు.


● నిహారిక

● శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'బన్నీ' వాసుతో కలిసి విద్యా కొప్పినీడి నిర్మించారు. నవంబరు 24న విడుదలైన ఈ పొలిటికల్, పోలీస్ బ్యాక్‌డ్రాప్ మూవీ హిట్‌గా నిలిచింది.



● నటిగా, గాయనిగా, నర్తకిగా గుర్తింపు తెచ్చుకున్న రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మాతగా మారి, 'కలశ' చిత్రాన్ని నిర్మించారు. భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కొండ రాంబాబు దర్శకుడు. ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. చిన్న బడ్జెట్ చిత్రమైనా కాన్సెప్ట్ బాగుందనిపించుకుంది.



● పాయల్ సరాఫ్‌కి సినిమా నేపథ్యం లేదు. అయితే నిర్మాత కావాలన్నది ఆమె కల. 'భరతనాట్యం' చిత్రంతో నిర్మాతగా మారారామె. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో సూర్యతేజ ఏలే హీరోగా, మీనాక్షీ గోస్వామి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ''షూటింగ్ లొకేషన్‌లో అమ్మాయిలు తక్కువగా ఉంటారు. మనం అమ్మాయి అనే విషయాన్ని మరచిపోయి మన పని మనం శ్రద్ధ చేయగలిగితే సక్సెస్ గ్యారంటీ'' అంటున్నారు పాయల్ సరాఫ్.

సినిమా

హనుమంతుడిని మించిన స్టార్ లేరు

– ప్రశాంత్ వర్మ

''హను-మాన్' కంటెంట్ పరంగా పెద్ద సినిమా. మా సినిమాలో స్టార్స్ లేరు. మా దగ్గర ఉన్న ఒకే ఒక్క స్టార్ హనుమంతుడు. ఇంతకంటే పెద్ద స్టార్ ఇండియాలో లేరని నమ్ముతున్నాం. పాన్ ఇండియా కాదు.. పాన్ వరల్డ్ స్టార్‌తో సినిమా చేస్తున్నాం. హనుమంతుడే 'హను-మాన్' సినిమాను మాతో చేయిస్తున్నారని నమ్ముతున్నాం'' అన్నారు ప్రశాంత్ వర్మ. తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'హను-మాన్'. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్ కీలక పాత్రధారులు. కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తేజా సజ్జా మాట్లాడుతూ– ''ఓ సాధారణ కుర్రాడికి దేవుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే, ఆ కుర్రాడు చేసే అసాధారణ పనులు ఏంటి? అనేది 'హను-మాన్' చిత్రం'' అన్నారు. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ –''హను-మాన్' టీజర్ విడుదల తర్వాత సినిమాపై హైప్ వంద రెట్లు పెరిగిపోయింది. ఇక ట్రైలర్ కంటే సినిమా పది రెట్లు అద్భుతంగా ఉంటుంది. తెలుగులో దాదాపు 400 థియేటర్స్‌లో, హిందీలో దాదాపు 1500 థియేటర్స్‌లో మా సినిమా విడుదలవుతుంది. 'హను-మాన్'తో మొదలైన ఈ యూనివర్స్ ఆ తర్వాత 'అధీరా', ఇంకా కొందరు సూపర్ హీరోలని కూడా బిల్డ్ చేశాం. జనవరి 12న 'గుంటూరు కారం' సినిమా విడుదలవుతోంది. మహేశ్‌బాబుగారు నా ఫేవరెట్ స్టార్ హీరో. త్రివిక్రమ్ గొప్ప దర్శకులు. ఆ సినిమాని నేను ఫస్ట్ డే చూస్తాను'' అన్నారు. ''జనవరి 12న థియేటర్స్‌లో కలుద్దాం'' అన్నారు కె. నిరంజన్ రెడ్డి.


● ప్రశాంత్ వర్మ, వరలక్ష్మి, అమృతా అయ్యర్, తేజా సజ్జా, నిరంజన్ రెడ్డి

తొలి సినిమా అనుభూతి కలిగింది

– సుహాసినీ మణిరత్నం

''నా తొలి సినిమా విడుదలై 43 ఏళ్లవుతోంది. 44వ ఏడాదిని 'మహతి' చిత్రంతో ఆరంభిస్తున్నా. తొలి చిత్రం చేస్తున్న అనుభూతితో ఈ సినిమా చేస్తున్నాను'' అన్నారు నటి సుహాసినీ మణిరత్నం. సందీప్ మాధవ్, దీప్సిక జంటగా సుహాసిని కీలక పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'మహతి'. స్వీయ దర్శకత్వంలో శివ ప్రసాద్ బూర్లె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి పద్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, చంద్రమౌళి క్లాప్ కొట్టారు. రాజా రవీంద్ర గౌరవ దర్శకత్వం వహించగా, సుహాసిని స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. శివ ప్రసాద్ బూర్లె మాట్లాడుతూ– ''సుహాసినిగారు, సందీప్‌లకు ఈ కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. వారితో పాటు నా టీమ్ నమ్మకాన్ని నిలబెడతాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ చిత్రంలో నా పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి'' అన్నారు సందీప్ మాధవ్. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర.


● సుహాసిని, దీప్సిక, సందీప్ మాధవ్, శివప్రసాద్

కొత్త ప్రారంభం

'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్, సంకీర్తనా విపిన్ జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది.


● సుహాస్, సంకీర్తనా విపిన్, ప్రశాంత్ నీల్

తొలి సీన్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు ప్రశాంత్ నీల్ క్లాప్ ఇచ్చారు. దర్శక-నటుడు 'బలగం' వేణు గౌరవ దర్శకత్వం వహించారు. ''త్వరలో ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్, మురళీ శర్మ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్.

పొలిటికల్ డ్రామా ప్లాన్ చేస్తున్నాం

– నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి


● యశ్వంత్, శ్రీరామ్, సాయికిరణ్

''సినిమా బాగుంటే చిన్న సినిమా అయినా ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని మా 'పిండం' మరోసారి రుజువు చేసింది. మా కళాహి మీడియా బ్యానర్‌లో వచ్చిన తొలి సినిమా 'పిండం' హిట్ అయింది. ఈ మూవీ దర్శకుడు సాయికిరణ్‌తోనే మా ద్వితీయ సినిమాను పొలిటికల్ డ్రామాగా నిర్మిస్తాం'' అని యశ్వంత్ దగ్గుమాటి అన్నారు. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించిన చిత్రం 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో శ్రీరామ్ మాట్లాడుతూ–''పదిహేనేళ్ల తర్వాత 'పిండం'తో నాకు సోలో విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు.

దుబాయ్‌లో గామా అవార్డ్స్


● వీఎన్ ఆదిత్య, కోటి, శ్రీలేఖ

''దుబాయ్‌లో మార్చి 3న 'గల్ఫ్ తెలుగు సినీ అవార్డ్స్' (గామా అవార్డ్స్) వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం'' అని 'గామా' అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ– ''2024 మార్చి 3న నిర్వహించనున్న గామా అవార్డ్స్‌లో అల్లు అర్జున్‌కి 'గామా నేషనల్ ఐకాన్ అవార్డ్' అందిస్తాం. 2021, 2022, 2023 సంవత్సరాల్లోని ఉత్తమ చిత్రాలు, నటులు, దర్శకులు, సంగీతం.. వంటి విభాగాల్లో ఈ అవార్డ్స్ అందజేస్తాం'' అన్నారు. ''ఈ అవార్డు వేడుకకు పలువురు దర్శకులు, నిర్మాతలు, నటీనటులు, సంగీత దర్శకులు హాజరవుతారు'' అన్నారు 'గామా' అవార్డ్స్ జ్యూరీ సభ్యుడు, గౌరవ సలహాదారుడు, దర్శకుడు వీఎన్ ఆదిత్య. ''గామా అవార్డ్స్ ఆస్కార్ స్థాయికి చేరుకోవాలి'' అన్నారు జ్యూరీ చైర్మన్, సంగీత దర్శకుడు కోటి. ''గామా' అవార్డ్స్ దర్శకుడు ప్రసన్న పాలంకి, జ్యూరీ సభ్యురాలు, సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ పాల్గొన్నారు.

“నిజంగానే షాక్‌కు గురయ్యాను. ఇంత మొత్తాన్ని అసలు ఊహించలేదు. ఎనిమిదేళ్ల తర్వాత ప్రపంచంలోని అత్యుత్తమ టి20 లీగ్‌లో మళ్లీ ఆడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు విలువ పెరిగినా నా ఆటతీరు ఎప్పుడూ మారలేదు. భారీ మొత్తం కాబట్టి ఒత్తిడి సహజమే అయినా... నాకున్న అనుభవంతో మంచి ఫలితాలు సాధిస్తాననే నమ్మకం ఉంది. -మిచెల్ స్టార్క్

సన్‌రైజర్స్‌తో జత కట్టేందుకు అమితోత్సాహంతో ఉన్నా. ఆరెంజ్ ఆర్మీ గురించి చాలా విన్నా. హైదరాబాద్‌లో కూడా మ్యాచ్‌లు ఆడా. నాకు బాగా నచ్చింది. నాతో పాటు హెడ్ కూడా ఉన్నాడు. విజయాలతో సీజన్ సాగాలని ఆశిస్తున్నా. -ప్యాట్ కమిన్స్

మిచెల్ స్టార్క్ రెండు సార్లు మాత్రమే ఐపీఎల్‌లో (2014-15) అదీ బెంగళూరు జట్టు తరఫునే ఆడాడు. 27 మ్యాచ్‌లలో 7.16 ఎకానమీతో 34 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత వేర్వేరు కారణాలతో అతను ఎనిమిది సీజన్ల పాటు లీగ్‌కు దూరంగా ఉన్నాడు. 2018లో కోల్‌కతా అతడిని ఎంచుకున్నా... గాయంతో టోర్నీకి ముందే తప్పుకున్నాడు.

ప్యాట్ కమిన్స్ ఢిల్లీ తరఫున 12 మ్యాచ్‌లు, కోల్‌కతా తరఫున 30 మ్యాచ్‌లు ఆడి మొత్తం 45 వికెట్లు పడగొట్టాడు. 2020 వేలంలో కేకేఆర్ అతనికి రూ. 15.50 కోట్లు ఇచ్చింది. అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా 2023 సీజన్‌లో కమిన్స్ ఆడలేదు. వరల్డ్ కప్‌లో జట్టును విజేతగా నిలిపి అతను మళ్లీ ఇక్కడ అడుగు పెట్టాడు.

నీకు రూ. 20.50 కోట్లు... నాకు రూ. 24.75 కోట్లు

వేలంలో టాప్-10 వీరే...

1. స్టార్క్ (కోల్‌కతా) రూ. 24.75 కోట్లు
2. కమిన్స్ (హైదరాబాద్) రూ. 20.50 కోట్లు
3. మిచెల్ (చెన్నై) రూ. 14 కోట్లు
4. హర్షల్ పటేల్ (పంజాబ్) రూ. 11.75 కోట్లు
5. జోసెఫ్ (బెంగళూరు) రూ. 11.50 కోట్లు
6. స్పెన్సర్ జాన్సన్ (గుజరాత్) రూ. 10 కోట్లు
7. సమీర్ రిజ్వీ (చెన్నై) రూ. 8.40 కోట్లు
8. రిలీ రోసో (పంజాబ్) రూ. 8 కోట్లు
9. షారుఖ్ (గుజరాత్) రూ. 7.40 కోట్లు
10. పావెల్ (రాజస్తాన్) రూ. 7.40 కోట్లు

- ఐపీఎల్ వేలంలో స్టార్క్, కమిన్స్ కొత్త రికార్డులు నమోదు
- కోల్‌కతా చెంతకు స్టార్క్... హైదరాబాద్‌కు కమిన్స్
- ఆరుగురికి రూ.10 కోట్లకంటే ఎక్కువ మొత్తం
- భారీ మొత్తంతో యువ ఆటగాళ్లు సమీర్ రిజ్వీ, కుమార్ కుశాగ్ర సంచలనం



ఐపీఎల్ వేలం షురూ... ముందుగా బ్యాటర్ల జాబితా... అది ముగిసిన తర్వాత రెండో సెట్ క్యాప్డ్ బౌలర్ల జాబితా ముందుకు వచ్చింది... నాలుగో ఆటగాడిగా ప్యాట్ కమిన్స్ పేరు వినిపించింది... రూ.2 కోట్ల కనీస విలువతో వేలం మొదలైంది... చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ముందుగా పోటీ పడగా, ఆపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వచ్చి చేరింది. రూ.7.80 కోట్ల వద్ద సన్‌రైజర్స్ బరిలోకి దిగింది.. ఆపై మిగతా జట్లు తప్పుకోగా... రైజర్స్, ఆర్‌సీబీ మాత్రమే వేలం మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లాయి... రూ.20.25 కోట్ల వద్ద రెండు టీమ్‌లు ఆగాయి... దానికి మరో రూ.25 లక్షలు సన్‌రైజర్స్ జోడించాక బెంగళూరు స్పందించలేదు. రూ.20.50 కోట్లతో కమిన్స్ హైదరాబాద్ చెంత చేరడంతో ఐపీఎల్‌లో కొత్త రికార్డు నమోదైంది.

కానీ సినిమా అంతటితో ముగిసిపోలేదు... గంట సేపటి తర్వాత మిచెల్ స్టార్క్ పేరు వేలంలోకి వచ్చింది... ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ మొదలు పెట్టింది. ఆపై ముంబై, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) సీన్‌లోకి వచ్చేశాయి. కోల్‌కతా, గుజరాత్ టైటాన్స్ పోటీ పడి స్టార్క్ విలువను రూ.20 కోట్లు దాటించేశాయి... అయినా ఇరు జట్లు వెనక్కి తగ్గలేదు. ఆసీస్ పేసర్ కోసం పోటీని కొనసాగించాయి... మరింత వేగంగా ఈ మొత్తం రూ.24.50 కోట్లకు చేరింది... ఈ దశలో కోల్‌కతా మరో అడుగు ముందుకేసింది... **గుజరాత్** ఇక చాలనుకుకోవడంతో రూ.24.75 కోట్లతో స్టార్క్ తన సహచరుడు కమిన్స్ **రికా**ర్డును కొద్ది సేపటికే బద్దలు కొట్టేశాడు. ఇద్దరు స్టార్ ఆసీస్ పేసర్లు కలిసి **ఐపీఎల్ ద్వారా** రూ. 45.25 కోట్లతో పండగ చేసుకున్నారు!


ఐపీఎల్ వేలం ఎప్పటిలాగే అంచనాలకు భిన్నంగా ఊహించని రీతిలో సాగింది. **పేరుకే మినీ** వేలం అయినా ఆటగాళ్లకు లభించిన మొత్తాలు మెగా వేలంలా అనిపించాయి. **పెద్దగా గుర్తింపు** లేని, టి20 ఫార్మాట్‌లో అంతగా అద్భుతాలు చూపించని ఆటగాళ్లపై కూ**డా కానుల వాన కురవగా,** ఇప్పటికే తమ ఆటతో సత్తా నిరూపించుకున్న కొందరికి ఆశ్చర్యకరంగా **తక్కువ విలువే దక్కింది. వన్డే వరల్డ్ కప్** ఫైనల్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ట్రవిస్ హెడ్, న్యూజిలాండ్ ప్లేయర్ డరైల్ **మిచెల్, విండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్, హరి**యాణా బౌలర్ హర్షల్ పటేల్ భారీ సొమ్మును తమ ఖాతాలో వేసుకోగా... అన్‌క్యాప్డ్ భారత ఆటగాడు సమీర్ రిజ్వీ (ఉత్తరప్రదేశ్), కుమార్ కుశాగ్ర (జార్ఖండ్) భారీ విలువ పలికి సంచలనం సృష్టించడం వేలంలో హైలైట్.

72 మంది ఆటగాళ్లతో...



దుబాయ్: ఐపీఎల్–2024 కోసం మంగళవారం జరిగిన వేలం ముగిసింది. మొత్తం 332 మంది ఆటగాళ్లు వేలంలో అందుబాటులోకి రాగా... 10 ఫ్రాంచైజీలు కలిసి 72 మందిని ఎంచుకున్నాయి. ఇందులో 30 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. వేలంలో గరిష్టంగా 77 మందిని తీసుకునే అవకాశం ఉన్నా... కోల్‌కతాలో 2 ఖాళీలు, రాజస్తాన్‌లో 3 ఖాళీలు ఉండిపోయాయి. తొలిసారి విదేశీ గడ్డపై జరిగిన ఐపీఎల్ వేలంను మొదటిసారి ఓ మహిళ (మల్లిక సాగర్) నిర్వహించడం విశేషం. మధ్యాహ్నం 1 గంటకు మొదలైన వేలం స్వల్ప విరామాలతో రాత్రి 9 గంటల వరకు సాగింది. ఈ వేలం కోసం అన్ని ఫ్రాంచైజీలు కలిపి రూ.230 కోట్ల 45 లక్షలు వెచ్చించాయి. ఆసీస్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ రూ. 24.75 కోట్లతో కొత్త రికార్డు నెలకొల్పగా... 24 మంది క్రికెటర్లను కనీస విలువ రూ.20 లక్షలతో జట్లు సొంతం చేసుకున్నాయి. వచ్చే సీజన్ ఐపీఎల్ మార్చి 22 నుంచి మే 26 జరిగే అవకాశం ఉంది.

ఐపీఎల్ వేలం విశేషాలు...



- విండీస్ ప్లేయర్ రావ్‌మన్ పావెల్ కోసం రాజస్తాన్ భారీ మొత్తం (రూ.7.40 కోట్లు) వెచ్చించింది. గతంలో ఢిల్లీ తరఫున ఏమాత్రం ప్రభావం చూపలేకపోయినా... కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో తమ జట్టు బార్బడోస్ రాయల్స్‌కు అతను కెప్టెన్ కావడమే ప్రధాన కారణం.
- హ్యారీ బ్రూక్‌ను చాలా తక్కువ మొత్తం (రూ.4 కోట్లు)కే ఢిల్లీ సొంతం చేసుకుంది. గత ఏడాది సన్‌రైజర్స్ బ్రూక్‌కు రూ. 13.25 కోట్లు ఇచ్చింది.
- బెంగళూరు తరఫున 3 సీజన్లలో ఆకట్టుకున్న లెగ్‌స్పిన్నర్ హసరంగను సన్‌రైజర్స్ చాలా తక్కువ మొత్తానికి (రూ. 1.50 కోట్లు) సొంతం చేసుకుంది.
- వన్డే వరల్డ్‌కప్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చినా న్యూజిలాండ్ ఆటగాడు రచిన్ రవీంద్రకు తక్కువ మొత్తమే (రూ.1.80కోట్లు) దక్కింది. అతని సహచరుడు డరైల్ మిచెల్ కోసం మాత్రం చెన్నై చాలా మొత్తం (రూ.14 కోట్లు) ఖర్చు చేసింది.
- ఫామ్ కోల్పోయి భారత జట్టులో స్థానం చేజార్చుకోవడంతో పాటు ఐపీఎల్‌లోనూ భారీగా పరుగులిస్తూ వచ్చిన హర్షల్ పటేల్ కోసం పంజాబ్ కింగ్స్ ఏకంగా రూ.11.75 కోట్లు వెచ్చించింది.
- విండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ కోసం బెంగళూరు అనూహ్యంగా చాలా పెద్ద మొత్తం (రూ.11.50 కోట్లు) చెల్లించింది.
- ఒకే ఒక అంతర్జాతీయ వన్డే, 2 టి20లు ఆడిన ఆస్ట్రేలియా పేసర్ స్పెన్సర్ జాన్సన్‌కు రూ. 10 కోట్లు దక్కడం అనూహ్యం.
- వేలంలో ముందుగా పేరు వచ్చినప్పుడు రిలీ రోసో (దక్షిణాఫ్రికా)ను ఎవరూ పట్టించుకోలేదు కానీ చివర్లో పంజాబ్ కింగ్స్ రూ. 8 కోట్లకు అతడిని కొనుగోలు చేయడం విశేషం.

ఎవరెవరు ఏ జట్టులో...



కోల్‌కతా నైట్‌రైడర్స్ (10)

మిచెల్ స్టార్క్ (రూ. 24 కోట్ల 50 లక్షలు; ఆస్ట్రేలియా), ముజీబ్ రెహ్మాన్ (రూ. 2 కోట్లు; అఫ్గానిస్తాన్), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (రూ. కోటీ 50 లక్షలు; వెస్టిండీస్), అట్కిన్‌సన్ (రూ. 1 కోటీ; ఇంగ్లండ్), మనీశ్ పాండే (రూ. 50 లక్షలు; భారత్), కేఎస్ భరత్ (రూ. 50 లక్షలు; భారత్), చేతన్ సకారియా (రూ. 50 లక్షలు; భారత్), అంగ్‌క్రిష్ రఘువంశీ (రూ. 20 లక్షలు; భారత్), రమణ్‌దీప్ సింగ్ (రూ. 20 లక్షలు, భారత్), సకీబ్ హుస్సేన్ (రూ. 20 లక్షలు; భారత్).

ఢిల్లీ క్యాపిటల్స్ (9)

కుమార్ కుశాగ్ర (రూ. 7 కోట్ల 20 లక్షలు; భారత్), జై రిచర్డ్‌సన్ (రూ. 5 కోట్లు; ఆస్ట్రేలియా), హ్యారీ బ్రూక్ (రూ. 4 కోట్లు; ఇంగ్లండ్), సుమిత్ కుమార్ (రూ. 1 కోటీ; భారత్), షై హోప్ (రూ. 75 లక్షలు; వెస్టిండీస్), ట్రిస్టన్ స్టబ్స్ (రూ. 50 లక్షలు; దక్షిణాఫ్రికా), రికీ భుయ్ (రూ. 20 లక్షలు; భారత్), స్వస్తిక్ చికారా (రూ. 20 లక్షలు; భారత్), రసిక్ ధార్ (రూ. 20 లక్షలు; భారత్).

గుజరాత్ టైటాన్స్ (8)

స్పెన్సర్ జాన్సన్ (రూ. 10 కోట్లు; ఆస్ట్రేలియా), షారుఖ్ ఖాన్ (రూ. 7 కోట్ల 40 లక్షలు; భారత్), ఉమేశ్ యాదవ్ (రూ. 5 కోట్ల 80 లక్షలు; భారత్), రాబిన్ మింజ్ (రూ. 3 కోట్ల 60 లక్షలు; భారత్), సుశాంత్ మిశ్రా (రూ. 2 కోట్ల 20 లక్షలు; భారత్), కార్తీక్ త్యాగి (రూ. 60 లక్షలు; భారత్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (రూ. 50 లక్షలు; అఫ్గానిస్తాన్), మానవ్ సుథర్ (రూ. 20 లక్షలు; భారత్).

ముంబై ఇండియన్స్ (8)

గెరాల్డ్ కొయెట్జీ (రూ. 5 కోట్లు; దక్షిణాఫ్రికా), నువాన్ తుషారా (రూ. 4 కోట్ల 80 లక్షలు; శ్రీలంక), దిల్షాన్ మదుషంక (రూ. 4 కోట్ల 60 లక్షలు; శ్రీలంక), మొహమ్మద్ నబీ (రూ. 1 కోటీ 50 లక్షలు; అఫ్గానిస్తాన్), శ్రేయస్ గోపాల్ (రూ. 20 లక్షలు; భారత్), శివాలిక్ శర్మ (రూ. 20 లక్షలు; భారత్), అన్షుల్ కంబోజ్ (రూ. 20 లక్షలు; భారత్), నమన్ ధీర్ (రూ. 20 లక్షలు; భారత్).

పంజాబ్ కింగ్స్ (8)

హర్షల్ పటేల్ (రూ. 11 కోట్ల 75 లక్షలు; భారత్), రిలీ రోసో (రూ. 8 కోట్లు; దక్షిణాఫ్రికా), క్రిస్ వోక్స్ (రూ. 4 కోట్ల 20 లక్షలు; ఇంగ్లండ్), తనయ్ త్యాగరాజన్ (రూ. 20 లక్షలు; భారత్), విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్), అశుతోష్ శర్మ (రూ. 20 లక్షలు; భారత్), శశాంక్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్), ప్రిన్స్ చౌధరీ (రూ. 20 లక్షలు; భారత్).

సన్‌రైజర్స్ హైదరాబాద్ (6)

ప్యాట్ కమిన్స్ (రూ. 20 కోట్ల 50 లక్షలు; ఆస్ట్రేలియా), ట్రవిస్ హెడ్ (రూ. 6 కోట్ల 80 లక్షలు; ఆస్ట్రేలియా), జైదేవ్ ఉనాద్కట్ (రూ. 1 కోటీ 60 లక్షలు; భారత్), హసరంగ (రూ. 1 కోటీ 50 లక్షలు; శ్రీలంక), జథవేద్ సుబ్రమణ్యన్ (రూ. 20 లక్షలు; భారత్), ఆకాశ్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్).

లక్నో సూపర్ జెయింట్స్ (6)

శివమ్ మావి (రూ. 6 కోట్ల 40 లక్షలు; భారత్), సిద్ధార్థ్ (రూ. 2 కోట్ల 40 లక్షలు; భారత్), డేవిడ్ విల్లీ (రూ. 2 కోట్లు; ఇంగ్లండ్), ఆష్టన్ టర్నర్ (రూ. 1 కోటీ; ఆస్ట్రేలియా), అర్షిన్ కులకర్ణి (రూ. 20 లక్షలు; భారత్), అర్షద్ ఖాన్ (రూ. 20 లక్షలు; భారత్).

చెన్నై సూపర్ కింగ్స్ (6)

డరైల్ మిచెల్ (రూ. 14 కోట్లు; న్యూజిలాండ్), సమీర్ రిజ్వీ (రూ. 8 కోట్ల 40 లక్షలు; భారత్), శార్దుల్ ఠాకూర్ (రూ. 4 కోట్లు; భారత్), ముస్తఫిజుర్ రెహ్మాన్ (రూ. 2 కోట్లు; బంగ్లాదేశ్), రచిన్ రవీంద్ర (రూ. 1 కోటీ 80 లక్షలు; న్యూజిలాండ్), అవినాశ్ రావు (రూ. 20 లక్షలు; భారత్).

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (6)

అల్జారీ జోసెఫ్ (రూ. 11 కోట్ల 50 లక్షలు; వెస్టిండీస్), యశ్ దయాల్ (రూ. 5 కోట్లు; భారత్), ఫెర్గూసన్ (రూ. 2 కోట్లు; న్యూజిలాండ్), టామ్ కరన్ (రూ. 1 కోటీ 50 లక్షలు; ఇంగ్లండ్), సౌరవ్ చౌహాన్ (రూ. 20 లక్షలు; భారత్), స్వప్నిల్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్).

రాజస్తాన్ రాయల్స్ (5)

రోవ్‌మన్ పావెల్ (రూ. 7 కోట్ల 40 లక్షలు; వెస్టిండీస్), శుభమ్ దూబే (రూ. 5 కోట్ల 80 లక్షలు; భారత్), నాండ్రె బర్గర్ (రూ. 50 లక్షలు; దక్షిణాఫ్రికా), టామ్ కోలెర్ కాడ్మోర్ (రూ. 40 లక్షలు; ఇంగ్లండ్), ఆబిద్ ముస్తాక్ (రూ. 20 లక్షలు; భారత్).



ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమీర్ రిజ్వీ దూకుడైన బ్యాటింగ్‌తో యూపీ టి20 లీగ్‌లో సత్తా చాటాడు. ఈ టోర్నీలో కాన్పూర్ సూపర్‌స్టార్స్ తరఫున 9 ఇన్నింగ్స్‌లలోనే 455 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో మూడు ఐపీఎల్ టీమ్‌లు ట్రయల్స్‌కు పిలిచాయి. యూపీ టీమ్ అండర్-23 టైటిల్ గెలుచుకోవడంలో అతనిదే కీలక పాత్ర. అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఒకే రోజు 280 పరుగులు చేసి రికార్డు రిజ్వీకి ఉంది.



జార్ఖండ్ వికెట్ కీపర్ అయిన కుమార్ కుశాగ్ర కూడా ధాటిగా ఆడగల సమర్థుడు. విజయ్ హజారే టోర్నీలో మహారాష్ట్రపై 355 పరుగుల ఛేదనలో 37 బంతుల్లో 67 పరుగులు చేసి జట్టును గెలిపించడం అతడిని హైలైట్ చేసింది.

మనోళ్లు నలుగురు...

తాజా వేలంలో ఆంధ్ర ఆటగాళ్లు కేఎస్ భరత్ (రూ. 50 లక్షలు; కోల్‌కతా), రికీ భుయ్ (రూ. 20 లక్షలు; ఢిల్లీ), హైదరాబాద్ క్రికెటర్లు అరవెల్లి అవినాశ్ రావు (రూ. 20 లక్షలు; చెన్నై), తనయ్ త్యాగరాజన్ (పంజాబ్ కింగ్స్)లను ఆయా జట్లు ఎంచుకున్నాయి.

స్మిత్‌కు మళ్లీ నిరాశే...



టెస్టుల్లో దిగ్గజంగా, వన్డేల్లోనూ మంచి బ్యాటర్‌గా గుర్తింపు ఉన్న ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్‌ను టి20లకు తగడని ఐపీఎల్ ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. అందుకే గత ఏడాదిలాగే ఈసారి కూడా కనీస విలువ రూ.2 కోట్లకు కూడా ఎవరూ తీసుకోలేదు. వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో ఉన్న ఆసీస్ బౌలర్ హాజల్‌వుడ్‌నూ ఎవరు ఎంచుకోలేదు. వేలంలో అమ్ముడుపోని ఇతర గుర్తింపు పొందిన ఆటగాళ్లలో జేసన్ హోల్డర్ (వెస్టిండీస్), జిమ్మీ నీషమ్ (న్యూజిలాండ్), క్రిస్ జోర్డాన్ (ఇంగ్లండ్), టిమ్ సౌతీ (న్యూజిలాండ్), స్యామ్ బిల్లింగ్స్ (ఆస్ట్రేలియా), మిల్నే (న్యూజిలాండ్), తబ్రేజ్ షమ్సీ (దక్షిణాఫ్రికా), హనుమ విహారి, సర్ఫరాజ్ ఖాన్ (భారత్) తదితరులు ఉన్నారు.

భారత్‌కు చుక్కెదురు

- రెండో వన్డేలో టీమిండియా ఓటమి
- 8 వికెట్లతో దక్షిణాఫ్రికా జయభేరి
- జోర్జి సెంచరీ, రాణించిన హెన్‌డ్రిక్స్
- రేపు ఆఖరి వన్డే



పోర్ట్ ఎలిజబెత్: వరుసగా రెండో వన్డే గెలిచి సిరీస్‌నూ కై వసం చేసుకోవాలనుకున్న భారత్ ఆశలు మూకుమ్మడి వైఫల్యంతో ఆవిరయ్యాయి. నిలకడలేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్, నిలువెత్తు నిర్లక్ష్యం భారత్ కొంపముంచాయి. ఇదే అదనుగా దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌ను దెబ్బ కొట్టింది. దీంతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం చవిచూసింది. ఆతిథ్య జట్టు సిరీస్‌ను 1–1తో సమం చేసింది. చివరిదైన మూడో వన్డే రేపు పార్ల్‌లో జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 46.2 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. టాపార్డర్‌లో సాయి సుదర్శన్ (83 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 56; 7 ఫోర్లు)... ఈ ఇద్దరు తప్ప ఇంకెవరూ కనీసం 20 పరుగులైన చేయలేకపోయారు. సఫారీ బౌలర్లు బర్గర్ (3/30), బ్యురన్ హెన్‌డ్రిక్స్ (2/34), కేశవ్ మహరాజ్ (2/51) సమష్టిగా దెబ్బతీశారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లను పూర్తిగా ఆడలేకపోయింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 42.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్లు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ టోని డి జోర్జి (122 బంతుల్లో 119 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కగా, రీజా హెన్‌డ్రిక్స్ (81 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. ఇద్దరు తొలి వికెట్‌కు 130 పరుగులు చేయడంతోనే భారత్ పరాజయం ఖాయమైంది. వాన్ డర్ డసెన్ (36; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. ఈ మ్యాచ్‌తో రింకూ సింగ్ వన్డేల్లో అరంగేట్రం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బర్గర్ 4; సాయి సుదర్శన్ (సి) క్లాసెన్ (బి) విలియమ్స్ 62; తిలక్‌వర్మ (సి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ (బి) బర్గర్ 10; రాహుల్ (సి) మిల్లర్ (బి) బర్గర్ 56; సామ్సన్ (బి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ 12; రింకూ సింగ్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 17; అక్షర్ (సి) సబ్-వెరెన్ (బి) మార్క్‌రమ్ 7; కుల్దీప్ (సి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ (బి) కేశవ్ 1; అర్ష్‌దీప్ (సి) మిల్లర్ (బి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ 18; అవేశ్ (రనౌట్) 9; ముకేశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (46.2 ఓవర్లలో ఆలౌట్) 211. వికెట్ల పతనం:** 1-4, 2-46, 3-114, 4-136, 5-167, 6-169, 7-172, 8-186, 9-204, 10-211. **బౌలింగ్:** బర్గర్ 10-0-30-3, విలియమ్స్ 9-1-49-1, బ్యురన్ హెన్‌డ్రిక్స్ 9.2-1-34-2, ముల్డర్ 4-0-19-0, కేశవ్ 10-0-51-2, మార్క్‌రమ్ 4-0-28-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రీజా హెన్‌డ్రిక్స్ (సి) ముకేశ్ (బి) అర్ష్‌దీప్ 52; టోని (నాటౌట్) 119; డసెన్ (సి) సామ్సన్ (బి) రింకూ 36; మార్క్‌రమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (42.3 ఓవర్లలో 2 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1-130, 2-206. **బౌలింగ్:** ముకేశ్ 8-2-46-0, అర్ష్‌దీప్ 8-0-28-1, అవేశ్ 8-0-43-0, అక్షర్ 6-0-22-0, కుల్దీప్ 8-0-48-0, తిలక్ వర్మ 3-0-18-0, రింకూ సింగ్ 1-0-2-1, సాయి సుదర్శన్ 0.3-0-8-0.

హార్దిక్, సవితలకు ఎఫ్ఐహెచ్ అవార్డులు





లుసానే (స్విట్జర్లాండ్): భారత హాకీ ప్లేయర్లు హార్దిక్ సింగ్, సవిత పూనియాలు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వార్షిక అవార్డులను గెలుచుకున్నారు. భారత మహిళల కెప్టెన్ అయిన సవిత ‘ఎఫ్ఐహెచ్ గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డుతో హ్యాట్రిక్ కొట్టింది. సవిత 2021, 2022లలో కూడా ఈ అవార్డును అందుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో టెస్టు మ్యాచ్‌లు, హాంగ్జౌ ఆసియా క్రీడల్లో 33 ఏళ్ల సవిత చక్కని ప్రదర్శన కనబరిచింది. అక్టోబర్‌లో సొంతగడ్డపై జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలుపడంలో కీలకపాత్ర పోషించింది. జనవరిలో రాంచీలో జరిగే ఎఫ్ఐహెచ్ ఒలింపిక్ క్వాలిఫయర్‌లో జట్టుకు పారిస్ బెర్తే లక్ష్యంగా సవిత జట్టును నడిపించనుంది. భారత పురుషుల జట్టులో స్టార్ మిడ్‌ఫీల్డర్‌గా ఎదిగిన హార్దిక్ సింగ్ పోరాటపటిమను ఎఫ్ఐహెచ్ గుర్తించింది. అతను ‘ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది అతనికి లభించిన రెండో అవార్డు ఇది! హాకీ ఇండియా (హెచ్ఐ) నుంచి ‘బల్బీర్ సింగ్ సీనియర్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ కూడా అందుకున్నాడు.

హరియాణా స్టీలర్స్ గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ నాలుగో విజయం నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 31-29 పాయింట్లతో గెలిచింది. హరియాణా తరఫున వినయ్ 9 పాయింట్లు, ప్రపంజన్ 6 పాయింట్లు, మోహిత్ 5 పాయింట్లు స్కోరు చేశారు. గుజరాత్ తరఫున రోహిత్ గులియా 7 పాయింట్లు, ఫజల్, సోనూ జగ్లాన్ 4 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో యూపీ యోధాస్; పుణేరి పల్టన్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పుణేరి పల్టన్, బెంగాల్ వారియర్స్ 21 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి.

సాక్షి బిజినెస్
బుధవారం
20-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
122	34
71,437	21,453

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,947	▲ 43
డోజోన్స్	37,483	▲ 177
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,638	▲ 24
డాక్స్	16,744	▲ 94
షాంఘై	2,932	▲ 2
నికాయ్	33,219	▲ 460

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,084 ▲ 182
బంగారం (99.5 స్వచ్ఛత)	61,836 ▲ 182
వెండి (కేజీ)	73,652 ▲ 64

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.10	106.67
€	యూరో	ఒకటి	89.77	92.14
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.35	58.67
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.96	56.89
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.45	63.44
SAR	సౌదీ రియాల్	భారతీయ రూపాయి	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ రూపాయి	21.75	23.54
¥	చైనా యువాన్	భారతీయ రూపాయి	10.53	12.61

వరుణ్ బెవరేజెస్ చేతికి బెవ్కో

డీల్ విలువ రూ. 1,320 కోట్లు



న్యూఢిల్లీ: పానీయాల దిగ్గజం పెప్సీకో ఫ్రాంచైజీ సంస్థ వరుణ్ బెవరేజెస్.. దక్షిణాఫ్రికా కంపెనీ బెవరేజ్ కంపెనీ(బెవ్కో)తోపాటు అనుబంధ సంస్థలను కొనుగోలు చేయనుంది. దక్షిణాఫ్రికా, లెసోతో, ఎస్వటీని ప్రాంతాలలో పెప్సీకో ఫ్రాంచైజీ హక్కులను బెవ్కో కలిగి ఉంది. 3 బిలియన్ రాండ్ల(జెడ్‌ఏఆర్) (రూ. 1,320 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో సొంతం చేసుకోనున్నట్లు వరుణ్ బెవరేజెస్ వెల్లడించింది. తద్వారా దక్షిణాఫ్రికా మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించనుంది. నమీబియా, బోట్స్‌వానా పంపిణీ హక్కులతోపాటు.. అత్యంత కెఫైన్ కంటెంట్ డ్రింక్ రీఫ్రెష్, ఎనర్జీ డ్రింక్ రీబూస్ట్, కార్బొనేటెడ్ డ్రింక్ కూతా, జైవ్, ఫిజ్జీ లెమనేడ్ బ్రాండ్లను బెవ్కో కలిగి ఉంది. 2024 జులై31లోగా నగదు ద్వారా లావాదేవీని పూర్తి చేసే వీలున్నట్లు వరుణ్ అంచనా వేస్తోంది.

5 తయారీ కేంద్రాలు

2023లో బెవ్కో రూ. 1,590 కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరుణ్ తెలియజేసింది. జోహన్నెస్‌బర్గ్‌లో రెండు, దర్బన్, ఈస్ట్ లండన్, కేప్‌టౌన్‌లో ఒకటి చొప్పున మొత్తం ఐదు తయారీ యూనిట్లను కలిగి ఉంది. నిమిషానికి 3,600 బాటిళ్ల(బీపీఎం) సామర్థ్యం సంస్థ సొంతం. బెవ్కో కొనుగోలు ద్వారా దక్షిణాఫ్రికా మార్కెట్లో విస్తరించనున్నట్లు వరుణ్ వెల్లడించింది. ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికా అతిపెద్ద పానీయాల మార్కెట్‌కాగా.. రానున్న నాలుగేళ్లలో అంటే 2027కల్లా వార్షిక సగటున 5.3 శాతం చొప్పున వృద్ధి చూపగలదని అంచనా. దేశీయంగా పెప్సీకో అమ్మకాల పరిమాణంలో వరుణ్ బెవరేజెస్ 90 శాతాన్ని ఆక్రమిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది(2022–23) రూ. 10,596 కోట్ల ఆదాయం సాధించింది.

బెవ్కో కొనుగోలు వార్తలతో వరుణ్ బెవరేజెస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.7 శాతం జంప్‌చేసి రూ. 1,174 వద్ద ముగిసింది.

ఐపీవో బాటలో ఓలా, ఫస్ట్‌క్రై

వచ్చే వారం ప్రాస్పెక్టస్ దాఖలుకు చాన్స్



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఓలా, ఈకామర్స్ సంస్థ ఫస్ట్‌క్రై పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతున్నాయి. వచ్చే వారం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓలా ఎలక్ట్రిక్ యాజమాన్యం దేశ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు రోడ్‌షోలను నిర్వహిస్తోంది. ఇక ఫస్ట్‌క్రై కొత్త ఏడాది(2024)లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల తదుపరి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికావచ్చని అంచనా. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు రెండు సంస్థలలోనూ పెట్టుబడులున్న సంగతి తెలిసిందే. కాగా.. రెండు కంపెనీలూ వచ్చే వారం సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేసే సన్నాహాల్లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఐపీవో ద్వారా ఫస్ట్‌క్రై 50 కోట్ల డాలర్లు(సుమారు రూ. 4,150 కోట్లు) సమీకరించే అవకాశముంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం దీనిలో 60 శాతం వరకూ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనుండగా.. మిగిలిన 40 శాతం ఈక్విటీని కొత్తగా జారీ చేసే వీలుంది. కాగా.. రంజన్ పాయ్ కంపెనీ ఎంఈఎంజీ ఫ్యామిలీ ఆఫీస్, హర్ష్ మరియావాలా సంస్థ షార్ప్ వెంచర్స్, హేమేంద్ర కొఠారీ సంస్థ డీఎస్‌పీ ఫ్యామిలీ ఆఫీస్ ఇటీవలే ఫస్ట్‌క్రైలో రూ. 435 కోట్ల విలువైన వాటాలను సొంతం చేసుకోవడం గమనార్హం!

గో ఫస్ట్‌పై 3 కంపెనీల కన్ను

- లిస్టులో స్పైస్‌జెట్, స్కై వన్, సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్
- డెడ్‌లైన్ పొడిగించాలని ఆర్‌పీకి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేయడంపై మూడు సంస్థలు పోటీపడుతున్నాయి. దేశీ విమానయాన సంస్థ స్పైస్‌జెట్, షార్జాకి చెందిన ఏవియేషన్ కంపెనీ స్కై వన్, ఆఫ్రికా కేంద్రంగా పని చేసే సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ వీటిలో ఉన్నాయి. గో ఫస్ట్ కొనుగోలుపై ఆసక్తిగా ఉన్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు స్పైస్‌జెట్ తెలియజేసింది. మదింపు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత త్వరలోనే తమ ఆఫర్ ప్రకటించే యోచనలో ఉన్నట్లు వివరించింది. మదింపు ప్రక్రియను చేపట్టేందుకు గత పది రోజులుగా ఈ మూడు సంస్థల నుంచి దివాలా పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) శైలేంద్ర అజ్మీరాకు అభ్యర్థనలు వచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి గో ఫస్ట్ కొనుగోలు కోసం బిడ్లు దాఖలు చేసేందుకు గడువు నవంబర్ 22తో ముగిసింది. అయితే, గడువు లోపల స్పందించని కంపెనీలు.. ఆ తర్వాత ఆసక్తి వ్యక్తం చేయడం గమనార్హం. తాజా పరిస్థితుల నేపథ్యంలో బిడ్డింగ్ డెడ్‌లైన్‌ను మరికొంత కాలం పొడిగించాలని బిడ్డర్లు కోరినట్లు సమాచారం. దీనిపై రుణదాతల కమిటీ (సీఓసీ) నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ మే 3 నుంచి కార్యకలాపాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న స్పైస్‌జెట్, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు 270 మిలియన్ డాలర్లను సమీకరించుకునే ప్రయత్నాల్లో ఉంది.

మంగళవారం స్పైస్‌జెట్ షేర్లు ఇంట్రా–డేలో బీఎస్ఈలో దాదాపు 8 శాతం ఎగిసి 52 వారాల గరిష్ట స్థాయి రూ. 69.20కి చేరింది. చివరికి సుమారు 3% లాభంతో రూ. 66.08 వద్ద ముగిసింది.

పీహెచ్‌ను దక్కించుకున్న విజయా డయాగ్నోస్టిక్

డీల్ విలువ రూ. 135 కోట్లు

న్యూఢిల్లీ: లిస్టెడ్ హైదరాబాద్ కంపెనీ విజయా డయాగ్నోస్టిక్ పుణేకు చెందిన పీహెచ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. పీహెచ్‌లో 100% షేర్ల కొనుగోలు ఒప్పందానికి(ఎస్‌పీఏ) బోర్డు ఆమోదముద్ర వేసినట్లు హెల్త్‌కేర్ సంబంధ సర్వీసులందించే విజయా డయాగ్నోస్టిక్ సెంటర్ తెలియజేసింది. ఇందుకు దాదాపు రూ. 135 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా మరో రూ. 13 కోట్లవరకూ రుణాలివ్వడం లేదా పీహెచ్‌కున్న రుణ చెల్లింపులు చేపట్టడం ద్వారా ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. కొనుగోలు తదుపరి సొంత అనుబంధ సంస్థగా పీహెచ్ ఆవిర్భవించనున్నట్లు వివరించింది. సమీకృత కార్యకలాపాలు కలిగిన పీహెచ్ 23 ఏళ్లుగా డయాగ్నోస్టిక్ సేవలందిస్తున్నట్లు పేర్కొంది.



ఈ వార్తలతో విజయా డయాగ్నోస్టిక్ షేరు 2.8% ఎగసి రూ. 632 వద్ద ముగిసింది.

మళ్లీ కొత్త రికార్డులు



సెన్సెక్స్ 122 పాయింట్లు ప్లస్

ముంబై: ఎఫ్‌ఎంసీజీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఒక రోజు నష్టాల ముగింపు తర్వాత మళ్లీ లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలూ కలిసొచ్చాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 122 పాయింట్లు పెరిగి 71,437 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 21,453 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, నెస్లే షేర్లు ఒక శాతం రాణించడంతో సూచీలు నష్టాలు భర్తీ చేసుకోవడంతో పాటు లాభాలు ఆర్జించగలిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 309 పాయింట్లు పెరిగి 71,624 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు బలపడి 21,505 వద్ద కొత్త చరిత్రాత్మక గరిష్టాలు నమోదు చేశాయి. మరో వైపు ఐటీ, ఆటో, మెటల్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.603 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.294 కోట్ల షేర్లను కొన్నారు. బ్యాంక్ ఆఫ్ జపాన్ సరళతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపడంతో ఆసియా మార్కెట్లు ఒక శాతం లాభపడ్డాయి. యూరోజోన్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు యూరప్ మార్కెట్లు పరిమిత లాభాల్లో కదలాడాయి.

''స్టాక్ మార్కెట్లో ఆశావాదం కొనసాగింది. స్థిరీకరణ దశలో భాగంగా సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఎర్ర సముద్రం నౌకా మార్గానికి రక్షణ కల్పిస్తామంటూ అమెరికా ప్రకటనతో క్రూడాయిల్ ధరల్లో స్థిరంగా నెలకొంది. వృద్ధి ఆధారిత స్టాకుల ర్యాలీ తర్వాత ఇన్వెస్టర్లు విలువ షేర్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- పెట్రోలియం క్రూడ్, డీజిల్‌పై ప్రభుత్వం విండ్ ఫాల్ ట్యాక్స్‌ను తగ్గించడంతో ఆయిల్‌అండ్‌గ్యాస్ కంపెనీల షేర్లు లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.50%, ఓఎన్‌జీసీ, హిందూస్తాన్ పెట్రోలియం, బీపీసీఎల్, ఐఓసీ, పెట్రోనెట్ షేర్లు ఒకటి నుంచి అరశాతం చొప్పున పెరిగాయి.
- భారత ఐటీ కంపెనీలపై ప్రభావం చూపే అమెరికా దిగ్గజ ఐటీ కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్ ఆర్థిక సంవత్సరం 2024 తొలి త్రైమాసిక ఫలితాలు ప్రకటన(మంగళవారం)కు ముందు దేశీయ ఐటీ షేర్లలో అప్రమత్తత చోటు చేసుకొంది. కోఫోర్జ్ 3%, విప్రో 2%, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు ఒకశాతం పతనమయ్యాయి. ఎంఫసీస్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీఎం షేర్లు అరశాతం నష్టపోయాయి.
- షేర్ల విభజన రికార్డు తేది జనవరి 5 గా నిర్ణయించడంతో నెస్లే ఇండియా షేరు 4.50% లాభపడి రూ.25,485 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5.50% పెరిగి రూ.25,699 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని శాఖలు

ఎస్‌ఎంఎఫ్‌జీ గృహశక్తి ఎండీ దీపక్ పాట్కర్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు అఫోర్డబుల్ హౌసింగ్ రుణాలిచ్చే ఎస్‌ఎంఎఫ్‌జీ గృహశక్తి (గతంలో ఫులర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్) తెలుగు రాష్ట్రాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 15 శాఖలు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 20కి పెంచుకోనున్నట్లు సంస్థ ఎండీ దీపక్ పాట్కర్ తెలిపారు. దేశవ్యాప్తంగా తమ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 7,576 కోట్లుగా ఉందని మంగళవారమిక్కడ విలేకరులకు చెప్పారు. తెలంగాణలో సుమారు 639 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 201 కోట్ల పోర్ట్‌ఫోలియో ఉన్నట్లు వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 7 శాఖల్లో 120 మంది, ఏపీలో 8 శాఖల్లో 100 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. సగటు రుణ పరిమాణం రూ. 15–20 లక్షల శ్రేణిలో ఉంటోందని చెప్పారు. ఏయూఎంపరంగా టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణ ఉన్నట్లు వివరించారు. అందుబాటు ధరల్లోని గృహాల ఫైనాన్సింగ్ మార్కెట్ ఏటా 20 శాతం వృద్ధి చెందుతుందని అంచనాలు ఉన్నట్లు పాట్కర్ చెప్పారు. తమకు దేశవ్యాప్తంగా 150 శాఖలు ఉండగా.. 2025 మార్చి నాటికి ఆ సంఖ్యను 300కు పెంచుకోనున్నామని ఆయన తెలిపారు.

ఎంబసీ రీట్‌కు బ్లాక్‌స్టోన్ టాటా!



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్) లిస్టెడ్ సంస్థ.. ఎంబసీ ఆఫీస్ పార్క్స్ నుంచి పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ గ్రూప్ వైదొలగనున్నట్లు తెలుస్తోంది. బ్లాక్‌డీల్ ద్వారా ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్‌లో తమకుగల మొత్తం 23.6 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిలో భాగంగా ఒక్కో షేరుకి రూ. 310 ఫ్లోర్ ధరను ఖరారు చేస్తున్నట్లు తెలుస్తోంది. వెరసి సుమారు 83.3 కోట్ల డాలర్ల(సుమారు రూ. 6,914 కోట్లు) డీల్‌కు తెరలేవనున్నట్లు అంచనా.

జాబ్ పాయింట్

బెల్, వైజాగ్‌లో 57 పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్), విశాఖపట్నంలోని బెల్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో.. తాత్కాలిక ప్రాతిపదికన ట్రెయినీ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 57
» పోస్టుల వివరాలు: ట్రెయినీ ఇంజనీర్1–45, ప్రాజెక్ట్ ఇంజనీర్1–12.
» అర్హత: 55శాతం మార్కులతో బీఎస్సీ(ఇంజనీరింగ్)/బీఈ, బీటెక్(సీఎస్ఈ /ఐఎస్/ఐటీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)తో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.02.2023 నాటికి టీఈ పోస్టులకు 28 ఏళ్లు,పీఈ ఖాళీలకు 32ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం:రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.12.2023
» వెబ్‌సైట్: www.bel-india.in

యూఐఐసీలో 300 అసిస్టెంట్ పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ(యూఐఐసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా యూఐఐసీ కార్యాలయాల్లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 300 (ఆంధ్రప్రదేశ్‌లో 08, తెలంగాణలో 03 ఖాళీలు).
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.సంబంధిత ప్రాంతీయ భాష చదవడం,రాయడం,మాట్లాడటం వచ్చి ఉండాలి.
» వయసు: 30.09.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: రూ.22,405 నుంచి రూ.62,265.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.01.2024
» వెబ్‌సైట్: www.uiic.co.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్‌లో 15 టీచింగ్ పోస్టులు

అజ్మీర్ జిల్లా(రాజస్థాన్) బందార్‌సింద్రీలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్.. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–05, అసోసియేట్ ప్రొఫెసర్–03,అసిస్టెంట్ ప్రొఫెసర్–07
» విభాగాలు: పబ్లిక్ పాలసీ, లా అండ్ గవర్నెన్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కల్చర్ అండ్ మీడియా స్టడీస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, సొసైటీ–టెక్నాలజీ ఇంటర్‌ఫేస్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్ తదితరాలు.
» అర్హత: పీజీ, పీహెచ్‌డీ, నెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిక్రూట్‌మెంట్ సెల్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్, ఎన్‌హెచ్–8, బందార్‌సింద్రీ, రాజస్థాన్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 31.01.2024.
» వెబ్‌సైట్: www.curaj.ac.in

ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో 12 పోస్టులు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రెయినీల ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎంటీ) –12, మేనేజర్(మిడిల్ మేనేజ్‌మెంట్)–03.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంబీఏ/పీజీడీబీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.01.2024
» ఆన్‌లైన్ పరీక్ష: జనవరి 2024.
» ఇంటర్వ్యూ తేదీలు: జనవరి/ఫిబ్రవరి 2024.
» వెబ్‌సైట్: www.eximbankindia.in

ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్, న్యూఢిల్లీలో 114 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 114
» పోస్టుల వివరాలు: మైనింగ్ ఓవర్‌మ్యాన్–52, మ్యాగజైన్ ఇన్‌ఛార్జ్–07, మెకానికల్ సూపర్‌వైజర్–21, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్–13, ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్–03, జూనియర్ మైన్ సర్వేయర్–11, మైనింగ్ సర్దార్–07.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్/కాంపిటెన్సీ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.12.2023.
» వెబ్‌సైట్: www.ntpc.co.in

అడ్వాన్స్‌డ్.. సమన్వయంతోనే సక్సెస్!

» జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా అర్హత
» అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుతో ఐఐటీల్లో ప్రవేశం
» జేఈఈ-అడ్వాన్స్‌డ్-2024 తేదీ విడుదల
» 2024, మే 26న పరీక్ష నిర్వహణ
» అందుబాటులో దాదాపు 17 వేల సీట్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్.. దేశంలోని ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) క్యాంపస్‌ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్.. కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు ఇంటర్ తొలిరోజు నుంచే ఈ పరీక్షకు సన్నద్ధమవుతున్న పరిస్థితి! ఒకవైపు జేఈఈ మెయిన్స్.. మరోవైపు బోర్డ్ పరీక్షలు.. ఇంకోవైపు అడ్వాన్స్‌డ్.. ఈ మూడింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తేనే విజయం వరిస్తుంది! తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ -2024 పరీక్ష తేదీలను నిర్వాహక సంస్థ ఐఐటీ చెన్నై ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, టాప్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..



జేఈఈ అడ్వాన్స్‌డ్-2024

ఈ ఏడాది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎందుకంటే.. అడ్వాన్స్‌డ్‌కు అర్హతగా నిర్దేశించిన జేఈఈ మెయిన్స్ సిలబస్‌లో పలు అంశాలను తొలగించారు. కానీ అడ్వాన్స్‌డ్‌లో మాత్రం గత ఏడాది మాదిరిగానే సిలబస్ ఉంటుందని పేర్కొన్నారు. దీంతో.. విద్యార్థులు ఈ రెండు పరీక్షల ప్రిపరేషన్ విషయంలో నిర్దిష్ట వ్యూహాలు అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండింటి సమన్వయంతో సక్సెస్ సాధించొచ్చని పేర్కొంటున్నారు.

అర్హతలు

- 2023లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులు లేదా 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు.
- వయసు: జనరల్ కేటగిరీ అభ్యర్థులు అక్టోబర్ 1,1999 తర్వాత; ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ అభ్యర్థులు అక్టోబర్ 1,1994 తర్వాత జన్మించి ఉండాలి.

మెయిన్ నుంచి 2.5 లక్షల మంది

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే అడ్వాన్స్‌డ్ పరీక్షకు.. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన టాప్ 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు. అదే విధంగా ఐఐటీల్లో సీట్ల కేటాయింపులో అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణతతోపాటు బోర్డ్ పరీక్షల్లో టాప్–20 పర్సంటైల్‌లో నిలవాలనే నిబంధనను కూడా కొనసాగించనున్నారు.

మే 26న అడ్వాన్స్‌డ్

అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26న జాతీయ స్థాయిలో జరుగుతుంది. ఒకేరోజు రెండు పేపర్లు నిర్వహిస్తారు. పేపర్–1 ఉదయం, పేపర్–2ను మధ్యాహ్నం ఉంటుంది.

పరీక్ష ఇలా

జేఈఈ–అడ్వాన్స్‌డ్–2024 పరీక్షను రెండు పేపర్లుగా (పేపర్ 1, పేపర్ 2) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పేపర్‌లో మూడు సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు కేటాయించిన సమయం మూడు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది.

మారని సిలబస్

జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 సిలబస్ గతేడాది మాదిరిగానే ఉంటుందని నిర్వాహక ఇన్‌స్టిట్యూట్ ఐఐటీ–చెన్నై వర్గాలు పేర్కొన్నాయి. దీంతో అడ్వాన్స్‌డ్ కోసం విద్యార్థులు ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల సిలబస్ అంశాలను సంపూర్ణంగా చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 2024, ఏప్రిల్ 21– ఏప్రిల్ 30
- ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2024, మే 6
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, మే 17 – మే 26
- అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీ: మే 26 (పేపర్–1 ఉదయం 9 నుంచి 12 వరకు; పేపర్–2 మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు)
- ఫలితాల వెల్లడి: 2024, జూన్ 9
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jeeadv.ac.in/index.html

రివిజన్+ ప్రాక్టీస్

మ్యాథమెటిక్స్

పరీక్షలో ఎంతో కీలకంగా భావించే మ్యాథ్స్‌లో రాణించడానికి కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ముఖ్యంగా 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి.

ఫిజిక్స్

న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ కూడా ఉండే ఈ విభాగంలో మంచి స్కోర్ కోసం ఎలక్ట్రో డైనమిక్స్; మెకానిక్స్; హీట్ అండ్ థర్మో డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

కెమిస్ట్రీ

అభ్యర్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో మంచి మార్కుల కోసం కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అప్లికేషన్ ఓరియెంటేషన్‌ను అనుసరించాలి. కాన్సెప్ట్‌లను వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసే విధంగా సాధన చేయాలి. తద్వారా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్ వంటి వాటికి సులభంగా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

బోర్డ్ పరీక్షలు, మెయిన్‌తో సమన్వయం

అభ్యర్థులు బోర్డ్ పరీక్షలు, జేఈఈ–మెయిన్ పరీక్షతో సమన్వయం చేసుకుంటూ అడ్వాన్స్‌డ్ దిశగా అడుగులు వేయాలి. మెయిన్ తొలి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ సిలబస్‌పైనే దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయిలో ప్రిపరేషన్ సాగించాలి. జేఈఈ–మెయిన్ రెండో సెషన్‌కు కూడా హాజరయ్యే అభ్యర్థులు ఆ సమయంలో అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

పునశ్చరణ

బోర్డు పరీక్షలు, జేఈఈ–మెయిన్ రెండో సెషన్ ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయి ప్రిపరేషన్ ప్రారంభించాలి. అధిక శాతం సమయాన్ని రివిజన్‌కు కేటాయించాలి. అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి. ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లకు హాజరవుతూ లోటుపాట్లు సరిచూసుకోవాలి. ప్రిపరేషన్ తుది దశలో రివిజన్, ప్రాక్టీస్‌కు పెద్దపీట వేయాలి.

క్లుప్తంగా...

నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠినచర్యలు


రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నకిలీవిత్తనాల బెడదలేకుండా చూడాలని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల వల్ల రైతులకు ఏదైనా నష్టం జరిగితే విత్తన కంపెనీలు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని చెప్పారు. ఈ మేరకు మంగళవారం మంత్రి విత్తన సరఫరా, తెలంగాణ విత్తనరంగ అభివృద్ధిపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉన్నతాధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. వచ్చే సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తన లభ్యత(ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న)పై చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రైతులకు విత్తన లభ్యతలో లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. విత్తన సరఫరాలో తెలంగాణ రైతులకు అధిక ప్రాధాన్యమిచ్చి, మిగతా విత్తనాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసుకోవాలని కంపెనీలకు సూచించారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

బ్లాక్ మెయిలింగ్ కేసీఆర్‌కే చెల్లు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల



కమలాపూర్: 'ఎమ్మెల్యేగా గెలవకపోతే ముగ్గురికి ముగ్గురం చనిపోతాం, మా శవయాత్రకు మీరు రండి'.. అనే బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు కేసీఆర్‌కు, ఆ పార్టీలో గెలిచిన అభ్యర్థికే చెల్లుతాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుట్రలు, డ్రామాలు, మోసపు పద్ధతులతో హుజూరాబాద్‌లో మాత్రమే ఈటలపై నెగ్గగలమని ప్రగతి భవన్ కేంద్రంగా మొన్నటి ఎన్నికల్లో కొత్త నటనకు తెర తీశారని ఆరోపించారు. తాను హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గంపై కేసీఆర్ పగబట్టాడని చెప్పారు. ప్రజలు ఆ కుట్రల్ని, కేసీఆర్ నీచపు ఆలోచనలను అర్థం చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్డీవో సహా అధికారులు ఎవరూ సమీక్ష సమావేశాలకు రాలేదని వెల్లడించారు. పార్టీ ఆదేశిస్తే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఈటల తెలిపారు.

ధరణి పోర్టల్ లొసుగులను సర్వేతో సవరించాలి..

సీఎం రేవంత్‌కు లేఖ రాసిన చాడ



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లోని లొసుగులపై సర్వే చేయించి సవరణ చేయాలని, దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి చాడ లేఖ రాశారు. క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి (మిస్సింగ్ సర్వే నంబర్లు ఉన్న చోట) రికార్డులు సరి చేయాలన్నారు. గతంలో పట్టాపై ఆధార్‌కార్డు లాంటి లింక్ లేకపోవడం, సంబంధిత టెక్నికల్ సమస్యల వలన వాస్తవ సాగుదారులు రైతుబీమా, రైతుబంధు తీసుకోలేకపోతున్నారని వెల్లడించారు. సీలింగ్ భూముల వివరాలు సరిగా లేక కొన్ని పట్టా భూములుగా, కొన్ని ప్రభుత్వ భూములుగా, కొన్ని ల్యాండ్ సీలింగ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు అమలు చేయక ఆ భూములు అసైన్డ్ భూములుగా రికార్డయ్యాయని పేర్కొన్నారు. దీంతో రైతులకు నష్టం జరగడమే కాకుండా వారు లావాదేవీలు జరుపుకునేందుకు వీల్లేకుండా ఉన్నాయని చాడ లేఖలో వివరించారు.

బీజేపీని బద్నాం చేయడానికే పార్లమెంట్‌పై దాడి

బీజేపీ మాజీ ఎంపీ నర్సయ్య గౌడ్



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో బీజేపీని బద్నాం చేయడానికే పార్లమెంట్‌పై దాడి ఘటన జరిగిందని బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్, దాని తోక పార్టీలు రభస చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటన వెనుక పాత్రదారులు ఎవరో, కుట్రదారులు ఎవరో నిగ్గు తేల్చేందుకు దర్యాప్తు జరుగుతోందన్నారు. అన్ని వివరాలు బయటకు వచ్చాక హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేస్తారని తెలిపారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పార్లమెంట్‌పై దాడిచేసిన డిసెంబర్ 13నే ఈ దాడి కూడా జరగడం వెనుక కచ్చితంగా కుట్ర కోణం ఉందన్నారు. నిరుద్యోగ సమస్యకు నిరసనగా దాడి చేశామని నిందితులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అసలు విషయాలు బయట పడతాయనే విపక్షాలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్నాయని విమర్శించారు.



కానరాదా వైకల్యం.. 'మూలపడిన' యంత్రాంగం

ఈ ఫొటోలో భిక్షాటన చేస్తున్న దివ్యాంగుడి పేరు బాజీరావు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎల్కతుర్తివాసి. నడవలేని స్థితిలో ట్రైసైకిల్ కోసం ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ప్రజావాణిలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసినా ట్రైసైకిల్ మంజూరు చేయలేదు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరగడంతో తనది ఈ జిల్లా కాదంటున్నారని బాజీరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఏ ఆధారం లేకపోవడంతో రోడ్లపై పాకుతూ భిక్షాటన చేసి, జీవిస్తున్నానని తెలిపాడు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వందలాది ట్రైసైకిళ్లు పంపిణీ చేయకుండా కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఓ మూలన పడేశారు. దీంతో అవి అటు దివ్యాంగులకు అందక, ఇటు రక్షణ లేక తుప్పుపట్టి పోతున్నాయి. ఇప్పటికైనా అర్హులను గుర్తించి, ట్రైసైకిళ్లను అందజేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్




పోటెత్తిన తెల్ల బంగారం

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తెల్ల బంగారం పోటెత్తింది. ప్రైవేట్ వ్యాపారులు రోజురోజుకూ ధర తగ్గిస్తుండటం, ఇంట్లో నిల్వ ఉంచుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో రైతులు తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించేందుకు తరలిస్తున్నారు. దీంతో మంగళవారం ఒక్కరోజే 600 బళ్లు రావడం గమనార్హం. సీసీఐ ధర రూ.7,020 కాగా ప్రైవేట్‌లో రూ.6,600 మాత్రమే ఉండటంతో రైతులు సీసీఐకి విక్రయిస్తున్నారు. దీంతో జిన్నింగ్‌ల వద్ద రోడ్లపై పత్తి బళ్లు ఇలా క్యూ కట్టాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఓపిక పట్టండి అన్నీ పరిష్కరిస్తాం

- ఇళ్లు, రేషన్, భూసమస్యలపై ఇంత దూరం రానవసరం లేదు
- ఆరుగ్యారంటీల అమలుతో అవన్నీ పరిష్కారమవుతాయి
- ప్రజావాణిలో మంత్రి పొన్నం
- శుక్రవారం నుంచి ఉదయం 10 గంటల్లోపు వచ్చేవారికే అవకాశం



మంగళవారం ప్రజావాణికి తరలివచ్చిన జనం..

లక్డీకాపూల్: ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ప్రధానంగా ధరణి, భూసమస్యలను పరిష్కరించాలంటూ ఎక్కువమంది రాగా, కొండ పోచమ్మ సాగర్ బాధితులు, టీఎస్పీఎస్సీ రద్దు చేయాలంటూ నిరుద్యోగులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు విన్నవించారు. మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. మంత్రితో పాటు ప్రజావాణి నోడల్ అధికారి హరిచందన ఉన్నారు.

ఆటోవాలాలపై విధానపరమైన నిర్ణయం

ప్రజావాణి అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. అందరి సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరిస్తుందని, కాస్త ఓపిక పట్టాలని సూచించారు. మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో 5,324 వినతి పత్రాలందాయని తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోవాలాలు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వారికి కచ్చితంగా న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇళ్లు, రేషన్, భూసమస్యల వంటివన్నీ ఆరు గ్యారంటీల అమలుతో పరిష్కారమవుతాయని మంత్రి అన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

తెలంగాణలోని అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డిపాజిట్‌దారులకు తక్షణమే డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలమల్లేష్ ప్రజావాణిలో కోరారు. మాజీ హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర అన్ని జిల్లాల మాజీ హోంగార్డుల ప్రతినిధులు ఇందిర, యూనస్ మహ్మద్ విజ్ఞప్తి చేశారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికి న్యాయం జరగలేదన్నారు.

ఇంకా పలు సమస్యలపై..

ప్రభుత్వ పాఠశాల్లోని స్వచ్ఛ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెమ్మది వెంకటేశ్వర్లు, ప్రమీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 28 వేల మంది కార్మికులకు నిధుల కొరత పేరిట గ్రామ పంచాయతీలు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కాళేశ్వరం బాధితుల భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో బాధితులు పాదయాత్రగా ప్రజాభవన్‌కు వచ్చి కొండపోచమ్మ సాగర్ నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. నిలిచిపోయిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలకు అనుమతించాలని స్పౌజ్ ఫోరం ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శుక్రవారం నుంచి 10గంటల్లోపు వచ్చిన వారికే మాత్రమే

శుక్రవారం నుంచి ఉదయం 10 గంటలలోపు వచ్చిన వారికే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు ప్రజాభవన్ అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు ప్రజాభవన్ వద్ద ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు.

నకిలీ హామీలు.. నకిలీ నేతలు

- 'సిద్దరామయ్య వీడియో'పై కేటీఆర్ స్పందన
- డిసెంబర్ 9లోగా అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలేవీ?
- కర్ణాటక తరహాలో ఇక్కడా హుళక్కేనా? అంటూ ఎద్దేవా
- కేటీఆర్ పోస్టుపై ప్రతిస్పందించిన సిద్ధరామయ్య కౌంటర్



సాక్షి, హైదరాబాద్: నకిలీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా నకిలీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. డిసెంబర్ 9లోగా నెరవేరుస్తామన్న ఆరు గ్యారెంటీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు డబ్బులు లేవని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చెప్పినట్లుగా వైరల్ అవుతున్న వీడియోపై కేటీఆర్ మంగళవారం 'ఎక్స్'లో స్పందించారు. తాజాగా తెలంగాణలో నూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇక్కడ కూడా సిద్దరామయ్య తరహాలోనే చెబుతుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. అయితే కేటీఆర్ పోస్టుపై సిద్ధరామయ్య ప్రతిస్పందించారు. 'బీజేపీ నకిలీ వీడియోలు సృష్టిస్తుంది. దానిని మీరు ప్రాచుర్యంలో పెడతారు. అందుకే బీజేపీకి బీఆర్ ఎస్ పార్టీ బీ టీమ్ అనేది..'అంటూ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ కనీస అధ్యయనం చేసినట్టు లేదు: కేటీఆర్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతున్న కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో హామీ ఇవ్వడానికి ముందు కనీస అధ్యయనం కూడా చేసినట్టు లేదని కేటీఆర్ తొలుత 'ఎక్స్'లో విమర్శించారు. ప్రజలను మోసగించేలా కాంగ్రెస్ అబద్ధపు హామీలివ్వడం వల్లే తమ పార్టీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలకు ఇచ్చిన రైతు భరోసా హామీ ఏమైందని నిలదీశారు. రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీ, రూ.4 వేల ఆసరా పింఛను, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకు రూ.2,500 మాటేమిటని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే తొలి కేబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తామని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ నుంచి..వాటిపై ఎలాంటి ప్రకటన ఎందుకు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు నకిలీనా? లేక వారి మాటలు నకిలీనా? అని ప్రశ్నించారు.

ఫేక్ వీడియోను గుర్తించలేని స్థితిలో బీఆర్ఎస్: సిద్ధరామయ్య

సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'ఇటీవలి తెలంగాణ ఎన్నికల్లో మీరు ఎందుకు ఓడిపోయారో తెలుసా? కనీసం ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకునే ప్రయత్నం కూడా మీరు చేయరు కాబట్టి..'అంటూ విమర్శించారు. వైరల్ అయిన వీడియో నిజమైనది కాదని, ఎవరో ఉద్దేశపూర్వకంగా సృష్టించారని స్పష్టం చేశారు. ఫేక్, ఎడిటెడ్ వీడియోలను కూడా గుర్తించలేని స్థితిలో బీఆర్ఎస్ ఉందని ఎద్దేవా చేశారు.

మీ ఎమ్మెల్యే ప్రకటన అబద్ధమా?: కేటీఆర్

సిద్ధరామయ్య కౌంటర్‌పై బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం కన్వీనర్ క్రిషాంక్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తిరిగి పోస్టు చేశారు. 'కర్ణాటకలో మీరు ఇచ్చిన ఐదు గ్యారెంటీల అమలు సాధ్యం కాదని మీ సొంత పార్టీ ఎమ్మెల్యే సదాక్చరి చేసిన ప్రకటన అబద్ధమా? బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అని మీ నాయకుడు రాహుల్ ప్రచారం చేశారు. కానీ ఇక్కడ ఆ పార్టీ ముఖ్య నేతలను మేం ఓడించాం..'అని గుర్తుచేశారు.

త్వరలో రాష్ట్రానికి అమిత్ షా, నడ్డా?

- గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమీక్షతో పాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దిశానిర్దేశానికి రాక
- 24, 25, 26 తేదీల్లో వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్షతో పాటు వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధానికి బీజేపీ అధినాయకత్వం సిద్ధమవుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ఓటమిపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమీక్షించనున్నట్టు పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది. మార్చి చివర్లోనే లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయన్న అంచనాల మధ్య రాష్ట్ర పార్టీ నేతలకు వారు దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జాతీయ, రాష్ట్ర నాయకత్వ స్థాయిల్లో ఇంకా పూర్తి స్థాయి సమీక్షేదీ జరగకపోవడంతో వీరి పర్యటనలకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ముగియగానే ఈనెల 24, 26, 28 తేదీల్లో ఏదో ఒకరోజు వీరిద్దరూ లేదా వీరిలో ఒకరు రానున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

ఓటింగ్ శాతం పెరగడంపై సంతృప్తి

అసెంబ్లీ ఎన్నికల్లో 111 సీట్లలో బీజేపీ పోటీ చేయగా, 8 చోట్ల గెలుపొందింది. ఆశించిన స్థాయిలో సీట్లు గెలవకపోయినా 15 శాతం ఓటింగ్‌ను సాధించడంపై పార్టీనాయకులు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాలు, మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సాధించిన ఫలితాలతో లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోనూ పార్టీ గణనీయ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలుస్తుందనే ధీమా పార్టీనేతల్లో వ్యక్తమవుతోంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి పలువురు సిద్ధమవుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా గణనీయమైన సంఖ్యలో ఓట్లు పొందిన ఎమ్మెల్యే అభ్యర్థులు లోక్‌సభకు పోటీకి ఉవ్విళూరుతున్నారు.

బీజేఎల్పీ నేత ఎవరు ?

బీజేఎల్పీనేతగా ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన టి.రాజాసింగ్‌కే అవకాశం దక్కొచ్చని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బీసీ సీఎం నినాదంతో ముందుకెళ్లినందున కనీసం బీజేఎల్పీనేతకు బీసీనేతగా అవకాశం కల్పించాల్సి ఉంటుందని అంటున్నారు. రాజాసింగ్‌ను బీజేఎల్పీనేతగా, ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన మహేశ్వర్‌రెడ్డి, కేసీఆర్, రేవంత్‌రెడ్డిని ఓడించి సంచలనం సృష్టించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డిని బీజేఎల్పీ డిప్యూటీ లీడర్లుగా ఎన్నుకునే అవకాశాలున్నాయంటున్నారు. ఒకవేళ రాజాసింగ్‌ను బీజేఎల్పీనేతగా చేయకపోతే మహేశ్వర్‌రెడ్డికి ఆ అవకాశం రావచ్చనీ అంటున్నారు. గెలిచిన 8 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు కొత్తవారే. అయినా బీజేఎల్పీ విప్‌లుగా, సెక్రటరీలుగా అందరికీ ఏదో హోదా కల్పించ వచ్చునని చెబుతున్నారు.

'కాళేశ్వరం'పై విచారణ వచ్చే వారానికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వాదనలను హైకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చేందుకు.. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలంటూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)లతో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరారు. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలన్నారు. ఈ పిటిషన్ ఫైలింగ్ నంబర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్, జాతీయ విపత్తుల నిర్వహణ మండలికి ఫిర్యాదు చేశానని పిటిషనర్ పేర్కొనడంలో ఉద్దేశం ఏంటో చెప్పాలని ఆయన తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

హామీలు ఎగ్గొట్టేందుకే డ్రామాలు: కేటీఆర్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ శ్వేతపత్రాల డ్రామాలకు తెరలేపిందని కేటీఆర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి శ్వేతపత్రాలతో గారడీ చేస్తామంటే కుదరదని మంగళవారం రాత్రి 'ఎక్స్'వేదికగా హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో హామీలతో ఊదరగొట్టి అధికారంలోకి రాగానే మభ్య పెడతారా?, కుంటి సాకులతో పథకాలకు పాతరేస్తారా? అని ప్రశ్నించారు. ఏరు దాటాక తెప్పతగలేసినట్లు గద్దెనెక్కిన తర్వాత వాగ్దానాలను గంగలో కలిపేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తొమ్మిదిన్నరేళ్లలో తమ ప్రభుత్వ ప్రస్థానం తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకమని పేర్కొన్నారు. శాసనసభకు సమర్పించిన బడ్జెట్ పత్రాలన్నీ శ్వేతపత్రాలేనని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో విడుదల చేసిన ప్రగతి నివేదికలు కూడా ఇవే తరహాకు చెందినవన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చేదాకా ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని, హామీలు అమలు చేయలేకపోతే అధికార కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ గ్యారెంటీ అని కేటీఆర్ పేర్కొన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సీఎంకున్న అభ్యంతరాలేమిటి?

- ప్రాజెక్టు పనుల్లో అవినీతిపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు?
- సిట్టింగ్ జడ్జితో విచారణ అంటే కేసును పక్కదారి పట్టించడమే: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రశ్నించారు. అందుకు సీఎంకి ఉన్న అభ్యంతరాలేమిటి? సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ ఎందుకు రాయడం లేదని నిలదీశారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ కాదు... మేడిగడ్డ అందులో చిన్న భాగం మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డ వరకే పరిమితం చేయాలని కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ అంటే కేసును పక్కదారి పట్టించడమే అవుతుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ కేంద్రానికి పలు దఫాలుగా విజ్ఞప్తులు చేశారని గుర్తుచేశారు. తన వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని గతంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి రేవంత్ లేఖ కూడా రాశారని చెప్పారు. ఇప్పుడు సీఎం హోదాలో తన దగ్గర ఉన్న ఆధారాలను సీబీఐకు, కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం కథ కంచికి చేర్చాలనే కుట్ర

కాంగ్రెస్.. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కథ కంచికి చేర్చాలని చూస్తోందని రఘునందన్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అవినీతి విషయంలో గత ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి కాగ్ పలు దఫాలుగా ఉత్తరాలు రాసిందని తెలిపారు. ఈ ఏడాది మార్చి 20న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ కుమార్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని లేఖ వచ్చిందన్నారు. ఈ లేఖకు ఉద్దేశపూర్వకంగా సమాధానం ఇవ్వకుండా.. తమ బండారం బయటపడుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నివేదికను తొక్కిపెట్టిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ వరకే విషయాన్ని పరిమితం చేస్తున్నారని, ఎల్ అండ్ టీ కాంట్రాక్ట్ సంస్థపైకి మాత్రమే నెపాన్ని నెడుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఒక వ్యక్తి చేసిన అతిపెద్ద అవినీతి కాళేశ్వరం ప్రాజెక్ట్ అని రఘునందన్ వ్యాఖ్యానించారు.

ఎంపీలూ.. అందుబాటులో ఉండండి!

- బీఆర్ఎస్ ఎంపీలకు కేసీఆర్ ఆదేశం
- ఒక్కొక్కరితో విడి విడిగా భేటీ అయ్యే అవకాశం
- వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై చర్చ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేయాలని భావిస్తున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ఎంపీలను అందుబాటులో ఉండాల్సిందిగా ఆదేశించారు. దీంతో ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న పలువురు బీఆర్ఎస్ ఎంపీలు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు తిరుగుముఖం పడుతున్నారు. తుంటి ఎముక శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ నందినగర్ నివాసంలో కోలుకుంటున్న కేసీఆర్ పార్టీ ఎంపీలతో మూకుమ్మడిగా కాకుండా ఒక్కొక్కరితో విడివిడిగా భేటీ కావాలని నిర్ణయించారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటూనే పార్టీ ఎంపీలతో వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై చర్చించనున్నారు. లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన కేసీఆర్ రాబోయే ఎన్నికల్లో విపక్షాలు అనుసరించే వ్యూహాలను కూడా అంచనా వేస్తున్నారు.

రాష్ట్రం నుంచే సోనియా పోటీపై విశ్లేషణ

కాంగ్రెస్ అగ్రనేత సోనియాను తెలంగాణ నుంచి పోటీ చేయాలని ఆ పార్టీ ఆహ్వానించడం, సీఎం, ఇతర మంత్రులు లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా ఇన్‌చార్జిలుగా నియమితులు కావడం తదితర పరిణామాలను కూడా కేసీఆర్ నిశితంగా విశ్లేషిస్తున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు లోక్‌సభ సీట్లలో గెలుపొందిన బీజేపీ త్వరలో జరిగే ఎన్నికల్లో అనుసరించే వ్యూహం, కాంగ్రెస్, బీజేపీ తరపున పోటీ చేసే అభ్యర్థులు తదితర కోణాల్లో కేసీఆర్ లెక్కలు వేస్తున్నారు.

ఎన్నికల సన్నద్ధతపై దిశా నిర్దేశం..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఓటమి పాలైన అభ్యర్థులను కలుపుకుని లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని పార్టీ ఎంపీలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఆ సన్నాహక సమావేశాలకు హాజరయ్యేలా షెడ్యూలు సిద్ధం చేసుకోవాలని ఎంపీలకు స్పష్టం చేయనున్నారు.

మళ్లీ మెదక్ నుంచేనా?

గతంలో మెదక్ ఎంపీగా గెలుపొందిన కేసీఆర్ మరోమారు ఇక్కడి నుంచే లోక్‌సభ బరిలోకి దిగాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత ఎంపీల్లో కొందరిని తప్పించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలనే చర్చ కూడా పార్టీలో జరుగుతోంది.

ఆ కండక్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.40 లక్షల ఆర్థిక సాయాన్ని ఆర్టీసీ అందించింది. మెదక్ డిపో కండక్టర్ సీహెచ్ అంజయ్య గత సెప్టెంబరులో విధులు ముగించుకుని స్వగ్రామం నాగపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మరో బైక్ ఆయన్ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అంజయ్య మృతిచెందారు. ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల ఖాతాలు యూబీఐలో ఉన్నాయి. ఆ బ్యాంకులో ఉచిత ప్రమాద బీమా వెసులుబాటు ఉంది. దానిద్వారా ఇప్పుడు అంజయ్య కుటుంబానికి బ్యాంకు రూ.40 లక్షల బీమా మొత్తాన్ని విడుదల చేసింది. మంగళవారం బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అంజయ్య కుటుంబ సభ్యులకు చెక్కును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు అందజేశారు.

క్లుప్తంగా...

జూడాల సమ్మె విరమణ

వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో చర్చలు సఫలం

సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చలు సఫలం కావడంతో సమ్మె ఆలోచనను విరమించుకున్నట్లు జూడాల సంఘం అధ్యక్షుడు కౌశిక్ వెల్లడించారు. గతంలో రెండు మూడు నెలలకు స్టైపెండ్ ఇచ్చేవారని, ఇకనుంచి ప్రతి నెలా 15వ తేదీ వరకు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. 20 రోజుల్లో స్టైపెండ్‌లను సజావుగా ప్రాసెసింగ్ చేయడానికి కొత్త సాఫ్ట్‌వేర్‌ను విడుదల చేస్తామని చెప్పినట్లు కౌశిక్ వెల్లడించారు. డీఎన్‌బీ విద్యార్థుల 8 నెలల స్టైపెండ్‌ను త్వరగా జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు కొత్త భవనం నిర్మించాలని కోరగా.. రెండు నెలల్లో కొత్త భవనానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారన్నారు. విదేశాల్లో చదివే వారికి మెడికల్ స్టైపెండ్, మెడికల్ కాలేజీల్లో స్థలం ఉన్నచోట కొత్త హాస్టళ్ల నిర్మాణం, స్థలం లేని చోట సమీపంలోని ఇతర ప్రాంతాల్లో హాస్టళ్లను కేటాయిస్తామని మంత్రి తెలిపారన్నారు. పీజీలు, ఇంటర్న్‌లపై భారం పడకుండా పని గంటల కోసం మార్గదర్శకాలను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారని కౌశిక్ పేర్కొన్నారు.

నిన్న నియామకం.. నేడు నిలిపివేత

- కోడ్ పేరిట ఉత్తర్వుల నిలిపివేత
- సింగరేణిలో 146 మంది జూనియర్ అసిస్టెంట్లకు నిరాశ

సింగరేణి (కొత్తగూడెం): ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇచ్చినట్టే ఇచ్చి.. మర్నాడే ఎన్నికల కోడ్ పేరిట నిలిపివేశారు. సింగరేణి సంస్థలో 177 మంది జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి గత ఏడాది రాతపరీక్ష నిర్వహించగా కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఈనెల 18న 146 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈనెల 27 వరకు సింగరేణి ఎన్నికల కోడ్ అమల్లో ఉందని పేర్కొంటూ ఆ ఉత్తర్వులను తిరిగి నిలిపివేశారు. రెండు నెలల క్రితమే నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉన్నా అసెంబ్లీ ఎన్నికల కోడ్ పేరిట జాప్యం చేశారు. ఇప్పుడు ఉత్తర్వులు అందించి, మర్నాడే నిలిపివేయడంలో ఆంతర్యమేమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తర్వులు ఇస్తున్నప్పుడు కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని పరిగణించకుండా రోజుకో తీరుగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు.

'ఆ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి'

సాక్షి, హైదరాబాద్: స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని జీవో 317 స్థానికత సాధన సమితి కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శ్రీశైలం కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తానని వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డిని కలిసి మండలిలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో చక్రపాణి, మల్లేశ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు కొనసాగింపు

తాజాగా ఉత్తర్వులు జారీ



సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): మార్క్‌ఫెడ్ సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ సొసైటీ చైర్మన్ మార గంగారెడ్డిని కొనసాగిస్తూ ప్రభుత్వం మంగళవారం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్ పదవులను రద్దు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల్లో పొరపాటున మార్క్‌ఫెడ్ సంస్థ పేరును కూడా చేర్చి, ఆ సంస్థ చైర్మన్ పదవిని రద్దు చేసింది. మార్క్‌ఫెడ్ చైర్మన్ సభ్యుల ద్వారా ఎన్నుకోబడి ఐదేళ్ల వరకు పదవిలో కొనసాగుతారనే విషయాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వులను సవరించి ఆయనను కొనసాగిస్తున్నట్లు తాజాగా మరో జీవో విడుదల చేసింది. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మార గంగారెడ్డి పదవీకాలం 2025, మార్చి 11వ తేదీ వరకు ఉంది.

కారుణ్య వర్సిటీ–ఈటీఎస్ మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ.. ఈటీఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు మంగళవారం మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. ఈ ఒప్పందంలో భాగంగా ఈటీఎస్ కారుణ్య క్యాంపస్‌కు డిజిటల్ ల్యాబ్‌ను స్పాన్సర్ చేసింది. అలాగే విద్యార్థులకు టోఫెల్, జీఆర్‌ఈ వంటి మాక్ టెస్టులను నిర్వహిస్తుంది. ఆంగ్ల భాషలో ప్రావీణ్యంపై దృష్టి సారించే వర్క్‌షాప్‌లతో సహా ప్రత్యేక జీఆర్‌ఈ, టోఫెల్ మాస్టర్ క్లాస్‌లను కూడా నిర్వహించనుంది. అలాగే ఈ ఒప్పందం ద్వారా ఈటీఎస్ రిసోర్స్ సెంటర్ నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు, ఒలింపియాడ్స్‌లో కారుణ్య వర్సిటీ విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. ఈ ఒప్పందం అంతర్జాతీయ వర్సిటీల్లో అడ్మిషన్లు కోరుకునే విద్యార్థులకు పలు మార్గాలను సూచిస్తుందని వర్సిటీ చాన్స్‌లర్ పాల్ దినకరన్ పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభతోనే.. దేశ గౌరవం ఇనుమడిస్తుంది

- భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా పట్టుదలతో సాగాలి
- ప్రకృతి, పర్యావరణంపైనా అవగాహన అవసరం
- హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు కనబర్చే ప్రతిభతోనే దేశ గౌరవం పెరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులదేనన్నారు. మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) శతాబ్ది ఉత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా పట్టుదలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు జీవన నైపుణ్యాలను నేర్చుకోవడంపైనా దృష్టి సారించాలని సూచించారు. ప్రకృతి, పర్యావరణంపైనా అవగాహన పెంచుకోవాలని, స్వార్థ ప్రయోజనాలు కాకుండా ఇతరులకు సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. జీవితంలో అభిరుచులను స్థిరంగా కొనసాగించడం చాలా అవసరమని, ఇవి సానుకూల శక్తిని పెంపొందించడమే కాకుండా ఇతరులకు ప్రేరణగా పని చేస్తాయన్నారు.

దేశానికి గుర్తింపు తెచ్చి పెట్టింది..

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గొప్ప గొప్ప విద్యార్థులను అందించి దేశానికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టిందని ద్రౌపదీ ముర్ము కొనియాడారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల లాంటి అనేకమంది గొప్పవాళ్లను ఈ స్కూల్ అందించిందని గుర్తు చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థ అనేక సవాళ్లను ఎదుర్కొని ఉండొచ్చని, దాని అనుభవాల ఆధారంగా విద్యార్థులను శక్తివంతంగా తీర్చిదిద్దవచ్చన్నారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు కలిసి చదువుకోవడానికి, ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవడానికి ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించినందుకు హెచ్‌పీఎస్‌ను అభినందించారు. పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషదాయకంగా ఉందంటూ... ఈ స్కూల్లో చదివిన విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థినితో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము. చిత్రంలో గవర్నర్ తమిళిసై, మంత్రి సీతక్క

చదువు, క్రీడలు రెండు కళ్లు: గవర్నర్

విద్యార్థులకు చదువు, క్రీడలు రెండు కళ్లలాంటివని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. విద్యార్థులను తరగతి గదుల నుంచి క్రీడా, సామాజిక రంగానికి తరలించడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. అప్పుడే సమాజంలో ఎలా ప్రవర్తించాలో అలవడుతుందని చెప్పారు. హెచ్‌పీఎస్ అనేక దిగ్గజాలను తయారు చేసిందని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు రాష్ట్ర, దేశాభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు. అంతకుముందు స్కూల్ శతాబ్ది ఉత్సవాలను రాష్ట్రపతి జెండా ఊపి ప్రారంభించారు. వేడుకలు ఏడాది పొడవునా జరగనున్నాయి.

నేడు భూదాన్ పోచంపల్లికి రాష్ట్రపతి

సాక్షి, యాదాద్రి: శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి రానున్నారు. ఉదయం బొల్లారంలోని రాష్ట్రపతి భవన్ నుంచి ఆమె రోడ్డు మార్గంలో హకీంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11.00 గంటలకు పోచంపల్లికి చేరుకుంటారు. అక్కడ శ్రీరంజన్ వీవ్స్‌ను సందర్శించి మగ్గం నేయడం, నూలు వడకడం, రీలింగ్ తదితర ప్రక్రియలను పరిశీలిస్తారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, మగ్గాలను తిలకిస్తారు. అనంతరం అక్కడే చేనేత ఇక్కత్ వస్త్రాల తయారీ, అమ్మకాలపై ఆయా వర్గాల ముఖ్యులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. వినోబా భావే, వెదిరె రామచంద్రారెడ్డి చిత్రపటాలకు నివాళులర్పిస్తారు. అనంతరం 12.20 గంటలకు పోచంపల్లి నుంచి హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

ఒక్కరోజులో నాలుగు కరోనా కేసులు

వైద్య ఆరోగ్యశాఖ బులెటిన్.. గతవారం ఐదు కేసులు నమోదు

నేటి నుంచి మళ్లీ విరివిగా కరోనా టెస్టులు

- సబ్ వేరియంట్ గుర్తింపునకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టాలని నిర్ణయం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అత్యవసర సమీక్ష



సాక్షి, హైదరాబాద్: మళ్లీ కరోనా కలకలం రేపుతోంది. రాష్ట్రంలో మంగళవారం ఒక్కరోజే ఏకంగా నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 402 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా నలుగురికి వైరస్ వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు కోవిడ్ బులెటిన్ విడుదల చేశారు. కాగా గత వారం రోజుల్లో ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. బాధితులు అందరూ ఐసోలేషన్ లేదా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. దేశంలో పలు ప్రాంతాల్లో నమోదైన కేసులు... కరోనా ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 సబ్ వేరియంట్‌వని అధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో నమోదయ్యే కేసుల్లో ఈ వేరియంట్‌వి ఉన్నాయా లేదా అని తెలుసుకునేందుకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. కరోనాపై మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అత్యవసర సమీక్ష నిర్వహించారు.

అన్ని ఆస్పత్రులను సిద్ధంగా ఉంచాలి

కొత్త సబ్ వేరియంట్ జేఎన్1 పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు. దీన్ని ఎదుర్కొనేందుకు అన్ని ఆసుపత్రులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గత అనుభవంతో పరిస్థితులను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని మాక్‌డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గాంధీ ఆసుపత్రిలో స్పెషల్ వార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల పరిస్థితిపై ప్రభుత్వం నివేదిక కోరింది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌లోని జేఎన్ 1 వైరస్ పరిస్థితిపై ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు సమగ్ర సమాచారం అందజేశారు.

భయపడాల్సిన అవసరం లేదన్న అధికారులు

ప్రజలు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని మంత్రికి అధికారులు వివరించారు. అయితే ఇతర దేశాల్లో కేసులు పెరిగినందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందన్నారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కరోనా నిర్ధారణ పరీక్షలు విరివిగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అందుకు అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. బుధవారం నుంచి పెద్ద ఎత్తున కరోనా టెస్టులు నిర్వహించాలని భావిస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఇళ్లల్లో వారిని ఐసోలేషన్‌లో ఉంచడం వల్ల ఇతరులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చంటున్నారు.

మాస్కులు అవసరం లేదు కానీ...

మాస్కులు ధరించాల్సిన ప్రత్యేక అవసరం లేదని, అయితే జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా చికిత్సలకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆస్పత్రి సిబ్బంది కూడా అప్రమత్తమై కరోనా కేసుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎప్పుడు రోగులు వచ్చినా చికిత్సలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గాంధీ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ సబ్ వేరియంట్‌లో జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయని, కొంతమందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.



జ్వరాలు.. బారులు.. కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్న రోగులు వైద్యం కోసం మంగళవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద బారులుతీరారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ముందు జాగ్రత్తగా మాస్కులు ధరిస్తున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ అయిన సినీ ప్రముఖులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన సినీ ప్రముఖులు

కూకట్‌పల్లి (హైదరాబాద్): రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని టాలీవుడ్ ప్రముఖులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కోమటిరెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, కార్యదర్శి అనుపమ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల పాండురంగారావు, తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి దామోదర ప్రసాద్, తెలంగాణ సినిమా రచయితల సంఘం అధ్యక్షుడు పులి అమృత్, నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, దర్శకుడు కె.రాఘవేంద్రరావు, సినీ నిర్మాతలు దగ్గుబాటి సురేశ్, సి.కల్యాణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా సినిమా రంగంలోని పలు సమస్యలపై చర్చించారు.

48.47% పెరిగిన సైబర్ నేరాలు

ఆర్థిక నేరాల్లోనూ 41 శాతం వృద్ధి

సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ సాయంతో 18 వేలకు పైగా కేసుల పరిష్కారం

క్రైమ్ ఇన్ తెలంగాణ 2022 పుస్తకంలో వెల్లడి

దేశంలో అత్యంత భద్రమైన నగరాల్లో హైదరాబాద్‌కు మూడో స్థానం

సీఐడీ విభాగం రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన డీజీపీ రవి గుప్తా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గతంతో పోలిస్తే సైబర్ నేరాల నమోదు 48.47 శాతం పెరిగినట్టు తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడించింది. ఆర్థిక నేరాలు, మోసాలు సైతం పెరిగినట్టు క్రైమ్ ఇన్ తెలంగాణ–2022 పుస్తకం వెల్లడించింది. తెలంగాణ సీఐడీ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన క్రైమ్ ఇన్ తెలంగాణ–2022 పుస్తకాన్ని సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌తో కలిసి డీజీపీ రవిగుప్తా మంగళవారం డీజీపీ కార్యాలయంలో విడుదల చేశారు. 2021తో పోలిస్తే తెలంగాణలో 2022లో ఆర్థిక నేరాల్లో 41.37 శాతం పెరుగుదల నమోదైందనీ, అదేవిధంగా మోసాలకు సంబంధించిన కేసుల్లోనూ 43.3 శాతం పెరుగుదల ఉన్నట్టు పుస్తకంలో వెల్లడించారు. నేషనల్ క్రైమ్‌రికార్డ్స్‌బ్యూరో(ఎన్‌సీబీఆర్) తరహాలోనే రాష్ట్ర సీఐడీలోని స్టేట్‌క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో(ఎస్సీఆర్బీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నేరాల నమోదు, నేరాల సరళిని తెలియజేసేలా పూర్తి వివరాలతో కూడిన ''క్రైం ఇన్ తెలంగాణ–2022'' పుస్తకాన్ని రూపొందించారు. రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ఈ తరహాలో క్రైం ఇన్ తెలంగాణ పుస్తకాన్ని రూపొందించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

రాష్ట్ర వ్యాప్తంగా 10.25 లక్షల సీసీటీవీ కెమెరాలు

రాష్ట్రంలో సీసీటీవీ కెమెరాల సంఖ్య 10,25, 849కు చేరినట్టు క్రైం ఇన్ తెలంగాణ–2022 పుస్తకం వెల్లడించింది. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 1,74,205 సీసీటీవీ కెమెరాలను కొత్తగా ఏర్పాటు చేశారు. కాగా 2022లో నమోదైన 18,234 కేసులను ఛేదించడంలో సీసీటీవీ కెమెరాల ఫుటేజీ కీలకంగా పనిచేసినట్టు పేర్కొంది. ఎన్‌సీఆర్బీ 2022 నివేదిక ప్రకారం దేశంలోని అత్యంత భద్రమైన నగరాల్లో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచినట్టు పుస్తకంలో పేర్కొన్నారు. భద్రమైన నగరాల్లో మొదటి స్థానంలో కోల్‌కతా, రెండో స్థానంలో పుణే నిలిచింది. కాగా, క్రైమ్ ఇన్ తెలంగాణ–2022 పుస్తకం రూపొందించడంలో కీలకంగా పనిచేసిన ఎస్సీఆర్బీ ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు సీహెచ్ చెన్నయ్య, సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్లు ఎస్ శేఖర్‌రెడ్డి, ఎన్ నవీన్ బాబు, హెడ్ కానిస్టేబుళ్లు పి కృష్ణకుమారి, ఎన్ హుస్సేన్‌లను డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ అభినందించారు.



మహేశ్ భగవత్‌తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ రవిగుప్తా

స్థానిక సంస్థలకే సంపూర్ణ అధికారాలివ్వాలి: వెన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలకే సంపూర్ణ అధికారాలివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్స్ చాంబర్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీలకు మంచి రోజులొచ్చాయని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర మున్సిపల్ చాంబర్ కార్యవర్గ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో రాజు మాట్లాడుతూ 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలకు దేశంలో ఎక్కడా మార్పులు చేయకపోయినా, రాష్ట్రంలో స్థానిక సంస్థల అధికారాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసి మున్సిపల్ చట్టం–2019 తీసుకొచ్చిందని విమర్శించారు. పాత చట్టాన్ని తిరిగి అమలుపరిచేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి మృత్యుంజయం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 రోజులు కూడా గడవక ముందే బీఆర్‌ఎస్ నేతలకు నిద్రపట్టని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే మాకు కూడా అవకాశం ఇవ్వాలని హరీశ్‌రావు అనడం సిగ్గుచేటన్నారు. పదేళ్లుగా దోచుకున్నదేంటో ప్రజలకు కనిపిస్తున్నందుకే కాంగ్రెస్‌కి అవకాశం ఇచ్చారని, వాస్తవాలు తెలియజేస్తామంటే భయమెందుకని మృత్యుంజయం ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల, ఆర్థిక, విద్యుత్ శాఖల్లో జరిగిన దోపిడీ బయటపడుతుందనే భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు బెంబేలెత్తుతున్నారని చెప్పారు. తాను చాలా ముఖ్యమంత్రుల దగ్గర పనిచేశానని, అయితే వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని చూస్తున్నానని వ్యాఖ్యానించారు.

ఉద్యోగం ఎర వేస్తారు... క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు



జాబ్ ఫ్రాడ్స్‌తో జాగ్రత్త సుమీ!

కొద్దిపాటి జాగ్రత్తలతో సురక్షితంగా ఉండొచ్చు అంటున్న సైబర్ నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలను బలహీనతగా చేసుకుని కొంతమంది సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారు. వాటిల్లో ఆకర్షణీయమైన వేతనం, తక్కువ శ్రమ అంటూ ఇంటర్నెట్‌లో ఆన్‌లైన్ జాబ్స్ పేరిట ఇచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లు ఒకటి. ఆన్‌లైన్ జాబ్స్ పేరిట ఇచ్చే ఉద్యోగ ప్రకటనలతో ఎంతోమందిని ఆకర్షించి వారి నుంచి తెలివిగా డబ్బులు గుంజడం, ఆపై కనిపించకుండా తప్పుకోవడం ఇటీవల సాధారణమైపోయింది. అటువంటి ఊదరగొట్టే ఉద్యోగ ప్రకటనల వెనుక మోసం దాగి ఉన్నట్లు గ్రహించాలని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు. భారీగా ఆదాయం అంటూ ప్రకటనలు ఇస్తున్నారంటే దాని వెనుక సైబర్ నేరగాళ్లు మన వ్యక్తి గత, బ్యాంకు సమాచారం కోసం మాటు వేసి ఉన్నారని పసిగట్టాలని సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా ఉద్యోగావకాశాల కోసం, ఆన్‌లైన్ జాబ్స్ కోసం ఇంటర్నెట్‌లో వెదికేవారిని సైతం సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసు కుంటున్నట్లు సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరి స్తున్నారు. ఉద్యోగం పేరిట మెయిల్స్ లేదా మొబైల్స్‌కు లింక్స్ పంపిస్తారని, వాటిని ఏమాత్రం క్లిక్ చేసినా మన సమాచారమంతా వారు తెలుసుకుని అకౌంట్లలోని డబ్బుల్ని ఊడ్చేస్తారని చెబుతున్నారు. అయితే కొద్దిపాటి జాగ్రత్తలతో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండటం పెద్ద కష్టమేమీ కాదని వారు సూచిస్తున్నారు.

ఇవీ సూచనలు..

- ఆన్‌లైన్ జాబ్ ఆఫర్‌లో మనం చేసే పనికి సాధారణం కంటే ఎక్కువ లబ్ధి వచ్చేలా, అత్యధిక సంపాదన ఉండేలా సమాచారం ఉంటే అది మోసమని గ్రహించాలి.
- ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట వచ్చే ఈమెయిల్స్‌లో అక్షర దోషాలు ఉన్నా, ఎలాంటి ఫోన్ నంబర్లు లేకుండా ఉన్నా కచ్చితంగా అది మోసపూరితమైన లింక్ అని పసిగట్టాలి.
- ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు చేస్తామంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దు.
- ఆన్‌లైన్ జాబ్ ఇవ్వాలంటే వ్యక్తిగత సమాచారంతోపాటు పాన్, ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు షేర్ చేయాలని కోరుతున్నారంటే అది మోసమని గ్రహించాలి.
- ఆన్‌లైన్‌లో జాబ్ ఇస్తామని ప్రకటనల రూపంలో వచ్చే వెబ్‌లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవద్దు.

రక్షణరంగ బలోపేతానికి సహకరించండి

డీఆర్‌డీఎల్ ఇండస్ట్రీ పార్ట్‌నర్స్ అసోసియేషన్ సభలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి



సాక్షి, హైదరాబాద్: రక్షణరంగ ఉత్పత్తుల తయారీలో భారతదేశాన్ని బలోపేతం చేయడంలో డీఆర్‌డీఎల్‌తో భాగస్వాములుగా ఉన్న రక్షణరంగ ఉత్పత్తుల తయారీ కంపెనీలు సహకరించాలని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో ఆత్మ నిర్భర భారత్‌గా మార్చాలని అన్నారు. ఈ మేరకు కంచన్‌బాగ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో 150కిపైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రంగంలో ఉన్న సమస్యలు, అవకాశాలు, భవిష్యత్తు రక్షణరంగంలో సాంకేతికత తయారీలో డీఆర్‌డీఎల్‌తో కలిసి పనిచేయడంలో సహకారం వంటి అంశాలపై చర్చావేదికగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ అధికారులు ఏవీ రావు, అందె పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



పాతటైర్ల పరిశ్రమలు కాలుష్యాన్ని నియంత్రించాలి

పీసీబీ సభ్యకార్యదర్శి కృష్ణ ఆదిత్య

సాక్షి, హైదరాబాద్: పాతటైర్ల పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కాలుష్యనియంత్రణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి(టీపీసీబీ) సభ్యకార్యదర్శి కృష్ణఆదిత్య ఆదేశించారు. మంగళవారం టీపీసీబీ కార్యాలయంలో 47 మంది పాతటైర్ల పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. కృష్ణఆదిత్య మాట్లాడుతూ ఈ పరిశ్రమల్లో దుర్గంధ సమస్య తీవ్రంగా ఉన్నందున, దీనిని అరికట్టడానికి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం గురించి పీసీబీ సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు జవహర్ లాల్, ప్రసన్నరాణి, నరేంద్ర వివరించారు.

టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వ మార్పునకు సంబంధమేంటి?

- ప్రభుత్వ న్యాయవాది తీరుపై హైకోర్టు అసహనం

సాక్షి, హైదరాబాద్: జూనియర్ కళాశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, శానిటరీ నాప్కిన్ల వెండింగ్ మెషీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం మార్పునకు సంబంధం ఏమిటని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంత సమయం తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు నెలల్లో పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ...విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేసింది. 'సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 700 మంది బాలికలకు ఒకటే టాయిలెట్'అని పత్రికల్లో వచ్చిన కథనంపై విచారణ జరపాలని న్యాయ విద్యార్థి మణిదీప్ హైకోర్టుకు లేఖ రాశారు.

జీవో 111 విచారణ సందర్భంగా అసహనం

కాగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల పరిరక్షణ నిమిత్తం గతంలో జారీ చేసిన జీవో 111ను అమలు చేసేలా ఆదేశాలివ్వాలంటూ పర్యావరణవేత్త ప్రొ.జీవానందరెడ్డి 2007లో, ఆ తర్వాత మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వ మార్పు జరిగినందున వివరాలు ఇవ్వడానికి సమయం కోరడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.



'లియో' యాప్ విడుదల



సాక్షి, హైదరాబాద్: స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు వనరులను ఉపయోగించుకొని పరస్పరం వృద్ధి చెందేందుకు లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్ (లియో) నిర్వాహకులు 'లియో'యాప్‌ను ఆవిష్కరించారు. వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి, ఆయా వ్యాపార వ్యవస్థల్లోని వ్యక్తులను ఒక వేదికపైకి తీసుకురావడానికి ఈ యాప్ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో లియో యాప్‌ను విడుదల చేశారు. లియో ఒక వ్యాపార యాక్సిలరేటర్, స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుందని దాని వ్యవస్థాపకుడు, సీఈవో మొహ్నిష్ యెర్రా చెప్పారు. వృత్తిపరమైన అవసరాలు, ఆకాంక్షల మేరకు ఇది సహకారం అందిస్తుందన్నారు. గత 18 నెలల్లో లియో సంస్థ 104 మంది సభ్యులతో సంఘంగా అభివృద్ధి చెందిందని, ఇందులో ఉన్న పరిశ్రమల ప్రతినిధులు, నిపుణులు, ప్రభావవంతమైన వ్యక్తుల మొత్తం ఆస్తుల విలువ రూ.25 వేల కోట్లకు పైగానే ఉందని తెలిపారు. 16 విభిన్న వ్యాపార అవకాశాల కోసం రూ. 20 కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తూ, సంపద సృష్టికి విశ్వసనీయ భాగస్వామిగా స్థిరపడిందన్నారు. రాబోయే మూడేళ్లలో వెయ్యి మంది సభ్యులతో కూడిన శక్తిమంతమైన సంఘాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మొహ్నిష్ చెప్పారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.